ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital


Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

30-6-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 149 పేజీలు: 12 వెల: 6.50

భారత్‌పై మరోసారి నోరు పారేసుకున్న పాక్
ఆస్కార్ కమిటీలో కమల్, ఖురానా 5లో

# పనిచేయని ఎమ్మెల్యేలకు గుడ్‌బై

## వచ్చే ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా కదలండి
## కౌంట్‌డౌన్ పెట్టుకొని పనిచేయాలి
## అన్ని మార్గాల ద్వారా సర్వేలు చేయిస్తున్నా
## పోలవరం ప్రాజెక్టు 2027కు పూర్తి
## టిడిపి ప్రజాప్రతినిధులు, మంత్రుల విస్తృతస్థాయి సమావేశంలో సిఎం చంద్రబాబు



**విజయవాడ,జూన్29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అత్యధికశాతం ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సంచలన వ్యాఖ్యలు చేసారు.వారు విధానం మార్చుకోవాలని.దాదాపు రాష్ట్రంలో పూర్తిస్థాయిలో జనం మనలను నమ్మి అధికారం ఇచ్చారు.దానిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. కీలకంగా గుర్తుంచుకోవాల్సిన విషయం ప్రజలు మనకు 94 శాతం స్ట్రయిక్ రేట్ ఇచ్చారని గుర్తుంచుకోవాలన్నారు. వారి నమ్మకానికి అనుగుణంగా పనిచేయాలన్నారు.ఏడాది పాలనలో మనం విధ్వంసం నుంచి వికాసం దిశలో విజయవంతంగా ప్రభుత్వాన్ని నడిపించామన్నారు. ఆ దిశలో ప్రజలకు ఎంత మేరకు అవగాహన కల్పించామో ఎంఎల్‌ఏలు, ఎంపీలు.,మంత్రులు పునశ్చరణ చేసుకోవాలన్నారు. తాను క్షేత్ర స్థాయిలో పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటున్నానని, అనేక మార్గాల ద్వారా సర్వేలు చేయిస్తున్నానని సిఎం చంద్రబాబు తెలిపారు. అన్ని సర్వేలను విశ్లేషించి వాస్తవాలను బేరీజు వేస్తున్నట్లు వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో సిఎం చంద్రబాబు అధ్యక్షతన తెలుగుదేశం విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి టిడిపి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, పరిశీలకులు హాజరయ్యారు. సమావేశంలో చంద్రబాబు ఉద్వేగంతో మాట్లాడుతూ ఎమ్మెల్యేలతో నిన్నటి నుంచి రోజుకు నలుగురిని పిలిచి మాట్లాడుతున్నానని ఇంక కొంత మంది తమ పనితీరు మారాల్సిందేనని తేల్చి చెప్పారు. పనితీరు మార్చుకుంటే బాగుంటుందని, లేకపోతే ఇక అంతే సంగతులంటూ హెచ్చరించారు. 2029 ఎన్నికలే తన టార్గెట్ అని సిఎం చంద్రబాబు అన్నారు.

పనితీరు బాగాలేని వారికి మొహమాటం లేకుండా గుడ్ బై చెప్పేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిచేందుకు కౌంట్‌డౌన్ పెట్టుకుని పని చేస్తున్నామని స్పష్టం చేశారు. ఏళ్లను, నెలలను, రోజులను గంటలను కూడా లెక్కిస్తున్నానన్నారు. తానా, ఆటాలు అంటూ ఫారెన్ ట్రిప్పులు వద్దని హెచ్చరించారు. ప్రజాప్రతినిధుల గ్రాఫ్ పెరుగుతుందా? తగ్గుతుందా? అనేది పరిశీలిస్తున్నానని చెప్పారు.

ఎంత పని చేశామనే అంశంతో పాటు ఎలా చేస్తున్నామనేది కూడా కీలకమని స్పష్టం చేశారు. పార్టీలోని ప్రతి ఒక్కరూ అదే తరహాలో ఆలోచన చేయాలని పిలుపునిచ్చారు. వారసులకు హ్యాండ్ హోల్డింగ్ ఇస్తాం కానీ దాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత వాళ్ల మీదే ఉంటుందని వివరించారు. ప్రభుత్వాల కొనసాగింపు అనేది చాలా ముఖ్యమని, వైకుంఠపాళి అభివృద్ధి వద్దని >>2



# ప్రజల్లో ఉండి సమస్యలు పరిష్కరించండి

## ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా 'తల్లికి వందనం' అమలు: మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్29,ప్రభాతవార్తప్రతినిధి:** అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే వ్యవహరించాలని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న లోకేశ్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేందుకు కష్టపడాలని సూచించారు. 151 సీట్లు 11 అయ్యాయంటే దానికి కారణం వారి అహంకారమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా తల్లికి వందనం అమలు చేశామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. పద్ధతి ప్రకారం ఇచ్చిన ప్రతి హామీ పూర్తిచేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తేల్చిచెప్పారు.దేశం మొత్తం తిరిగినా, ప్రపంచం మొత్తం తిరిగినా తిరిగి వచ్చేది మనం పవిత్ర దేవాలయంలా భావించే పార్టీ కార్యాలయానికేనని మంత్రి లోకేశ్ గుర్తుచేశారు. దేవాలయం లాంటి పార్టీ కార్యాలయంపై దాడిచేస్తే పట్టించుకోని పరిస్థితి ఆనాటి పాలనలో చూసామని ధ్వజమెత్తారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను మరువద్దని నాయుకులనీ కోరుతున్నానని అలానే పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. మనం ఎక్కడ కూర్చోవాలో ప్రజలే నిర్ణయిస్తారని లోకేశ్ అభిప్రాయపడ్డారు. పార్టీ వ్యవస్థలో మహిళలను పెద్దఎత్తున భాగస్వాములను చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**డోర్ టూ డోర్ ప్రచారం**

అనుబంధ విభాగాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి లోకేశ్ తెలిపారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించాలని అలానే జులై 5 నాటికి కమిటీలన్నింటినీ పూర్తి చేయాలని నేతలను ఆదేశించారు. సీనియర్లకు ఉన్న అనుభవం, యువతకు ఉన్న శక్తి రెండిం >>2



# పూరీ రథయాత్రలో తొక్కిసలాట

## ముగ్గురు మహిళలు మృతి, 50 మందికిపైగా గాయాలు
## తక్షణమే స్పందించిన సిఎం మోహన్‌చరణ్‌మాఝీ
## కలెక్టర్,ఎస్పీలపై బదలీ వేటు, డిసిపి, పోలీస్ కమాండెంట్‌ల సస్పెన్షన్
## మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలచొప్పన పరిహారం

**పూరి,జూన్ 29:** పూరీ జగన్నాథ రథయాత్రలో జరిగిన తొక్కిసలాట సందర్భంగా ముగ్గురు మృతిచెందడంతోపాటు 50 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతిచెందిన ముగ్గురు కూడా మహిళలే కావడం గమనార్హం. వీరందరినీ జిల్లా ఆసుపత్రులకు తరలించారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని ఆసుపత్రిలోని వైద్యులు తెలిపారు. కాగా దుర్ఘటనపై ఒడిశా సిఎం మోహన్ చరణ్ మాఝి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జగన్నాథ్ భక్తులందరికీ ప్రభుత్వం తరఫున క్షమాపణలు చెబుతున్నట్లు మాఝి ప్రకటించారు. ఈ భద్రతా నిరక్ష్యం క్షమించరానిదన్న ముఖ్యమంత్రి, బాధ్యులపై కఠిన చర్యలు >>2



## ఇక 8 గంటలు ముందే
# రిజర్వేషన్ చార్టులు!
## రైల్వేబోర్డు కీలక ప్రతిపాదనలు

**న్యూఢిల్లీ,జూన్ 29:** టికెట్ల రిజర్వేషన్లలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకు భారతీయ రైల్వేలు కీలకనిర్ణయాలు తీసుకుంటోంది. రైళ్లు బయలుదేరడానికి ఎనిమిదిగంటల ముందే రిజర్వేషన్ ఛార్టులను సిద్ధం చేయాలని రైల్వే బోర్డు ప్రతిపాదించింది. అంటే మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరే రైలు రిజర్వేషన్ చార్టులు ముందు రోజు రాత్రి 9గంటలకు సిద్ధం చేయబోతున్నది. టికెట్ బుకింగ్‌ను సులభతరం చేయడానికి రైల్వేలు అనేక చర్యలు చేపడుతుందని పేర్కొంది. ప్రస్తుతం రిజర్వేషన్ ఛార్ట్ రైలు బయలుదేరడానికి నాలుగు గంటల ముందు తయారవుతున్నది. దాంతో ప్రయాణికుల్లో అనిశ్చితినెలకొంటున్నది. రైలు టికెట్ కన్ఫామ్ అవుతుందా లేదా అన్న ఆందోళనలు >>2

# పౌర సేవల్లో విశాఖ టాప్


## 74.4 శాతంతో ముందంజ
## అట్టడుగున 51.8 శాతంతో అనకాపల్లి




**విజయవాడ,జూన్29,ప్రభాతవార్తప్రతినిధి:** పౌర సేవలను మరింత ప్రభావవంతంగా ప్రజలకు చేరువ చేసేందుకు సేవాస్థాయి ఫలితాలను కొలిచే ఒక సరికొత్త వ్యవస్థను అమలులోకి తెచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అర్బన్ లోకల్ బాడీలు (యూఎల్బీలు) తొలుత కనీసం పది వేర్వేరు సేవా ప్రమాణాల ఆధారంగా ర్యాంకింగ్ చేయబడతాయి, ఆ ఫలితాల ఆధారంగా పనులు రూపొందించబడతాయి. రాష్ట్ర సగటు ర్యాంకింగ్ (100 స్కేలులో) 66.3 శాతంగా ఉండగా, విశాఖపట్నం జిల్లా 74.4 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది, తరువాత ఎన్టీఆర్ 72.6 శాతంతో ఉంది.తిరుపతి (66.2 శాతం), గుంటూరు (64.9 శాతం), తూర్పు గోదావరి (64 శాతం), అనంతపురం (62 శాతం), వైఎస్ఆర్ కడప (61.7 శాతం), పల్నాడు (61.4 శాతం), అన్నమయ్య (60.4 శాతం) మరియు కర్నూలు (60.3 శాతం) సేవాస్థాయి ర్యాంకింగ్‌లలో ఇతర టాప్ పర్ఫార్మర్లుగా నిలిచాయి.అనకాపల్లి జిల్లా 51.8 శాతం స్కోర్‌తో చార్ట్‌లో అట్టడుగున ఉంది.యూఎల్బీలలో సేవల అందించడం నిర్ణీత కాలపరిమితుల ప్రకారం నెరవేరేలా రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ కొత్త వ్యవస్థను రూపొందించారు.సురేష్ కుమార్ నాయకత్వంలో పౌరుల ఆకాంక్షలను నెరవేర్చడానికి మరియు పట్టణ సమస్యలను పరిష్కరించడంలో మొట్టమొదటిసారిగా కేంద్రీకృత విధానాన్ని ఎంఎయూడీ శాఖ అవలంబిస్తోంది. యూఎల్బీలలో ప్రధాన సేవాస్థాయి సూచికలలో ఇంటింటికీ నీటి కనెక్షన్ల ద్వారా తాగునీటి సరఫరా, ఇంటింటికీ చెత్త సేకరణ, వ్యర్థాల ప్రాసెసింగ్, పాత వ్యర్థాల నిర్వహణ, మురుగునీటి శుద్ధి, వర్షపు నీటి కాలువల నిర్మాణం, పక్కా రోడ్లు, (ఎల్ఇడి) స్ట్రీట్ లైటింగ్, పట్టణ (మహిళా) స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆదాయం కలిగించే కార్యకలాపాలు మరియు మున్సిపల్, రెవెన్యూశాఖ ఉన్నాయి.పట్టణ సేవల సామర్థ్యాన్ని నిర్ధారించడంతో పాటు, ఈ సరికొత్త వ్యవస్థ ఉత్తమ ఫలితాలను సాధించడానికి మరియు వనరులను సరైన వినియోగానికి తోడ్పడుతుంది.ఈ కొత్త చొరవను మరియు ర్యాంకింగ్ విధానాన్ని అభినందించిన ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, సేవాస్థాయి సూచికల గురించి ఎమ్మెల్యేలకు, జిల్లా కలెక్టర్లకు, మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ కార్పొరేషన్ల కార్పొరేటర్లతో పాటు మున్సిపాలిటీల చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లకు పూర్తి అవగాహన కల్పించాలని ఎంఏయూడీ శాఖ అధికారులను ఆదేశించారు. యూఎల్బీలలోని ఎన్నికైన ప్రతినిధులు, శాసనసభ్యులు మరియు జిల్లా కలెక్టర్లు ఈ దిశగా పనిచేసి, సేవాస్థాయి సూచికలకు అనుగుణంగా ఉన్న పనులుమాత్రమే చేపట్టేలా చూడాలని సిఎం కోరారు.ఎంఏయూడీ శాఖ ముఖ్య కార్యదర్శి నిర్ణయించిన కాలపరిమితులను ప్రశంసిస్తూ, ప్రతిపాదిత పనులన్నీ నిర్ణీత కాలపరిమితుల ప్రకారం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎంఏయూడీ శాఖ ఇప్పుడు సేవల అందించడాన్ని మరియు అభివృద్ధి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించడానికి రియల్‌టైమ్ డాష్‌బోర్డ్‌ను అభివృద్ధి చేస్తోంది.ఎంఏయూడీ శాఖ రంగాల వారీ సేవల ఆధారంగా మొదటి దశ ర్యాంకింగ్ ప్రక్రియను పూర్తి చేసింది.

# కీలకదశకు 'కల్తీ నెయ్యి' దర్యాప్తు

## నివేదికలు 'సుప్రీం'కు అందజేత
## తేలనున్న ప్రధాన సూత్రధారులు



**తిరుమల,జూన్ 29ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల వెంకన్న లడ్డూల తయారీలో కల్తీనెయ్యి పాపానికి కారకులను గుర్తించిన సిబిఐ సిట్ అధికారులు తదుపరి కీలకచర్యలకు సిద్ధమవుతోందనేది సమాచారం. ఇప్పటికే లోతుగా నకిలీనెయ్యి సరఫరాలో మూలాలు కదిలించి ప్రధాన పాత్రదారులందరినీ రిమాండ్‌కు తరలించింది. ఇప్పుడు సిబిఐ సిట్ అధికారులు అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో దర్యాప్తుచేపట్టి తయారుచేసిన నివేదికలను సుప్రీంకోర్టుకు సమర్పించారు. ఈ నివేదికల్లో అనేక సంచలన అంశాలు పొందుపరిచారు. ఈ >>2

# మూడు రోజులు భారీ వర్ష సూచన

**విజయవాడ,జూన్29,ప్రభాతవార్తప్రతినిధి:**భారత వాతావరణ విభాగం శుభవార్త చెప్పింది. ఎపితో సహా పలు రాష్ట్రాల్లో రానున్న మూడు రోజులు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అరేబియా సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో శనివారం నాడు అల్పపీడనం ఏర్పడినట్లు తెలిపింది. మరోవైపు బంగాళాఖాతంలోనూ ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని చెప్పింది. దీని ప్రభావంతో ఇవాళ అల్పపీడనం ఏర్పడే అవకాశముందని వివరించింది. ఇది నెమ్మదిగా పశ్చిమవాయవ్య దిశగా వెళ్తూ గంగా పరివాహక పశ్చిమబెంగాల్, ఉత్తర ఒడిశా, ఝార్ఖండ్ వైపు కదలొచ్చని ఐఎండీ అంచనా వేసింది. వీటి ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో ఏపీలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ >>2





ఆదివారం టిడిపి విస్తృత సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, మంత్రులు

# ఎమ్మెల్యేలకు గుడ్‌బై

>> సిఎం పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు కొనసాగితే అభివృద్ధి జరుగుతుందని, సుస్థిరపాలన ఉంటే రాష్ట్రం బాగుంటుందని స్పష్టం చేశారు. 11 ఏళ్లుగా కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వమే ఉందని, అందుకే దేశం అభివృద్ధి చెందుతుందని వివరించారు. 2019 ఎన్నికల్లో మనమే గెలిచి ఉంటే రాష్ట్రం అభివృద్ధిలో అగ్రగామిగా ఉండేదన్నారు. డబ్బులతో ఎన్నికల్లో గెలవలేమనే విషయం స్పష్టమైందని, అభివృద్ధితో ఆదర్శంగా రాజకీయాలు చేద్దామని నేతలకు దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన బ్యాడ్ ఇమేజ్ పోగొట్టాలంటే చాలా సమయం పడుతుందని, కానీ టిడిపికి ఉన్న బ్రాండ్‌తో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారని చెప్పారు. ప్రజలు ఇచ్చిన 94 శాతం స్ట్రైక్ రేట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత నేతలందరిపై ఉందని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజల్లో తృప్తి చూస్తూ భవిష్యత్తుపై భరోసా కల్పించాల్సిన బాధ్యత నాయకులపై ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం నిర్మొహమాటంగా నిర్ణయాలు తీసుకున్నామని గుర్తుచేశారు. చేసిన మంచిని ప్రజలకు అర్ధమయ్యేలా చెప్పుకోలేకపోవటం మనకున్న లోపమని నేతలకు చురకలంటించారు. 2014-19మధ్య అభివృద్ధి పరుగు పందెంలో చేసింది చెప్పుకోవటంలో విఫలమయ్యామని చెప్పారు. ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి సంక్షేమం ప్రజలకు చెప్పేందుకే జులై 2 నుంచి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం అని వివరించారు. గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన దాదాపు 75 పథకాలు పునరుద్దరించామని చెప్పారు. నేరస్తులను నేరస్తులుగానే చూస్తామని తప్పులు చేసిన వారు ప్రత్యర్థి పార్టీలో ఉంటే చర్యలు తీసుకోకూడదా అని సిఎం చంద్రబాబు ప్రశ్నించారు. జగన్ సత్తెనపల్లి పర్యటనలో ఏం జరిగిందో అందరూ చూశారని అన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో సిఎం చంద్రబాబు అధ్యక్షతన తెలుగుదేశం విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి టీడీపీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, పరిశీలకులు హాజరయ్యారు. పనితీరు బాగాలేని వారికి మొహమాటం లేకుండా గుడ్ బై చెప్పేస్తానన్నారు. 2029 ఎన్నికలే తన టార్గెట్ అని సీఎం చంద్రబాబు అన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిచేందుకు కౌంట్‌డౌన్ పెట్టుకుని పని చేస్తున్నామని స్పష్టం చేశారు. ఏళ్లను, నెలలను, రోజులను గంటలను కూడా లెక్కిస్తున్నానన్నారు. తానా, ఆటాలు అంటూ ఫారెన్ ట్రిప్పులు వద్దని హెచ్చరించారు. ప్రజాప్రతినిధుల గ్రాఫ్ పెరుగుతుందా? తగ్గుతుందా? అనేది పరిశీలిస్తున్నానని చెప్పారు.

**పోలవరం ప్రాజెక్ట్ 2027 నాటికి పూర్తి**

ఎన్ని ఆర్థిక సమస్యలు ఉన్నా ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నట్లు సిఎం చంద్రబాబు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికీ టిడిపిపై విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. 2027 నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్న సిఎం, రాజధాని నిర్మాణం సహా అన్నీ పనులను వేగం చేశామన్నారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవటం ఎంత ముఖ్యమో వాటిని ప్రజలకు వివరించటం కూడా అంతే ముఖ్యమని సూచించారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సుపరిపాలనలో తొలి అడుగు వేశామని రాష్ట్ర పునర్నిర్మాణం లక్ష్యంగా పనిచేస్తున్నామని వ్యాఖ్యానించారు. అమరావతి నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని సిఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ నగరానికి అన్ని దిశల రూ.లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయన్నారు.

**జగన్ దొంగాటలు చట్టం చూస్తూ ఊరుకోదు**

జగన్ కారు కింద పడి ఆయన పార్టీ కార్యకర్త మరణిస్తే,మానవత్వం లేకుండా వ్యవహరించారన్నారు.అతని ఆరాచకానికి పోలీసులు దగ్గర బలమైన సాక్ష్యాలున్నాయన్నారు.అయినప్పటికి అతనిలో ప్రశ్చాత్తాపం లేకుండా పోయిందన్నారు.ఎవరికైనా ప్రమాదం జరిగితే వారిని కాపాడి ఆస్పత్రికి పంపుతాము కానీ తన కారు కిందే కార్యకర్త పడిపోతే పక్కకు పడేసి వెళ్లిపోయారని మండిపడ్డారు. దీనికి సంబంధించిన ఆధారాలు లభ్యమైన తర్వాత కూడా సొంత మీడియా ఉందని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరామర్శల పేరుతో గంజాయి బ్యాచ్, రౌడీల వద్దకు వెళ్తారా అని మండిపడ్డారు. చేస్తున్న మంచి పనులతో పాటు, మారుతున్న రాజకీయాలను ప్రజలకు వివరించాలని సిఎం సూచించారు. వివేకా హత్యను ఎలా ఏమార్చారో ప్రజలకు చెప్పాలని, వివేకా హత్య విషయంలో ప్రజల్నే కాకుండా తనను కూడా ఏమార్చారని సిఎం విమర్శించారు. నేరం చేసిన వారు తప్పించుకోలేరన్నారు. ఏపీ మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు సమావేశంలో ప్రసంగించారు.



ఆదివారం లక్నోలో సమాజ్‌వాదిపార్టీ అధ్యక్షుడు అఖిలేష్‌ను ఘనంగా సన్మానించిన దృశ్యం

# 8 గంటలు ముందే రిజర్వేషన్ చార్టులు!

>>వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ప్రయాణికుల్లో అనిశ్చితిని తొలగించేందుకు రైలు బయలుదేరే ఎనిమిది గంటల ముందే రిజర్వేషన్ ఛార్ట్‌ను సిద్ధం చేయాలని రైల్వే బోర్డు ప్రతిపాదించింది. ఎలాంటి అంతరాయం కలుగకుండా దశలవారీగా దీన్ని అమలు చేయాలని బోర్డుకు సూచించారు. ఈ నిర్ణయంతో వెయిట్ లిస్ట్‌లో ఉన్న ప్రయాణికులపై కొంత వరకు అనిశ్చితి తగ్గుతుంది. వెయిటింగ్ లిస్ట్ స్టేటస్ మరింత ముందుగానే తెలియడంతో దూర ప్రాంతాలు.. శివారు ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు ప్రయోజన కరంగా ఉంటుందని రైల్వే భావిస్తున్నది. వెయిట్‌లిస్ట్ నిర్ధారించబడకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేందుకు మరింత సమయం ఉండనున్నది. కొత్త ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (పిఆర్ఎస్) ద్వారా ఇప్పుడు నిమిషానికి 1.5 లక్షలకు పైగా టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చని రైల్వే బోర్డు తెలిపింది. దాంతో పాటు, జులై ఒకటి నుంచి ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ నుంచి తత్కాల్ టికెట్ బుకింగ్‌కు సంబంధించి మార్పులు ఉంటాయి. ఇకపై అథెంటికేషన్ యూజర్స్ మాత్రమే తత్కాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేందుకు అనుమతి ఉంటుంది. దాంతో పాటు జులై చివరి నుంచి తత్కాల్ టికెట్ బుకింగ్ కోసం వన్ టైమ్ పిన్ ఆధారిత వెరిఫికేషన్ జరుగనున్నది. ఈ ఆన్‌లైన్ అథంటికేషన్ ప్రక్రియలో యూజర్లు డిజి లాకర్ అకౌంట్ సహాయం తీసుకోవచ్చు. డిజిలాకర్, ఏదైనా ఇతర ప్రభుత్వ ఐడీలో సేవ్ చేయబడిన ఆధార్ కార్డ్ డేటాను ధృవీకరణ కోసం ఉపయోగించవచ్చని రైల్వేశాఖ పేర్కొంది.

# పూరీ రథయాత్రలో తొక్కిసలాట

>> తీసుకుంటామని హామీ ఇచ్చారు. భద్రతా వైఫల్యంపై దర్యాప్తునకు ఐదుగురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం ప్రకటించారు. పూరీ కలెక్టర్ సిద్ధార్థ్, ఎస్పీ బినిత్ అగర్వాల్‌ను బదిలీ చేస్తున్నట్లు వెల్లడించారు. వీరితో పాటు పూరీ డిసిపి బిష్ణు చరణ్ పాటి, పోలీస్ కమాండెంట్ అజయ్ పధిని సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.మరోవైపు పూరీ తొక్కిసలాట దుర్ఘటనపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తీవ్రవిచారం వ్యక్తంచేశారు. ఈ ప్రమాదానికి పూర్తిగా నిరక్ష్యం, సరైన నిర్వహణ లేకపోవడంవల్లే జరిగిందని ఆరోపించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపిన ఆయన, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటనపైసమగ్ర దర్యాప్తు చేపట్టి కారణాలు తెలుసుకోవాలని సూచించారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, క్షతగాత్రులకు సరైనసహాయం అందించాలని ఒడిశా ప్రభుత్వాన్ని కోరారు. ఈ తొక్కిసలాట ఘటనపై పూరీ రాజు గజపతి మహారాజ దివ్యసింగ్‌దేబ్ విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఒడిశా ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా సరైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పూరీ జగన్నాథ్ రథయాత్రకు మరిన్ని ఏర్పాట్లుచేసి ఉండాల్సిందని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభిప్రాయ పడ్డారు. అధికారులు తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే తొక్కిసలాట చోటుచేసుకుందని భక్తులు ఆరోపించారు. అంబులెన్సులు కూడా అందుబాటులో ఉంచలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మరోవైపు ఈసారి రథయాత్ర ప్రారంభించడంలో ఆలస్యం జరగడంపై రాజకీయ వివాదం చెలరేగింది. మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దీనిని భయంకరమైన గందరగోళంగా అభివర్ణించారు. సరైన సమయానికే రథాలు గుండీచా ఆలయానికి చేరుకున్నాయని బీజేపీ చెబుతోంది. 1977 నుంచి రథాలు ఎల్లప్పుడూ రెండో రోజునే గుండిచా ఆలయానికి చేరుకుంటాయని ఒడిశా న్యాయశాఖ మంత్రి హరిచందన్ పేర్కొన్నారు. బాధితులరక్షణకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటామని వివరించారు.

# ఆర్బీఐ 'పసిడి కోశాగారం'

## ఓ డాక్యుమెంటరీ కోసం తొలిసారి ప్రదర్శించిన రిజర్వ్ బ్యాంక్

**ముంబయి,జూన్ 29:** రిజర్వుబ్యాంకు చరిత్రలోనే మొట్టమొదటిసారిగా తనవద్ద ఉన్న బంగారునిల్వలను ప్రదర్శించింది. పారదర్శకతను చాటిచెపుతున్న ఈనిల్వలను ప్రదర్శించడం వెనుక కూడా మరో కీలకమైన లక్ష్యం ఉంది. త్వరలోనే భారత రిజర్వుబ్యాంకుపై తీసిన డాక్యుమెంటరీ ఒకటి ఒటిటిల్లో ప్రసారానికి రానున్నది. ఆర్‌బిఐ అన్‌లాక్డ్ బియాండ్‌ది రూపీ అనేశీర్షికతో ఈ డాక్యుమెంటరీ జియో హాట్‌స్టార్‌లో ప్రసారానికి రానున్నది. ఐదుభాగాలుగా ఉన్న ఈ డాక్యుమెంటరీ రిజర్వుబ్యాంకు సంక్లిష్టమైన విభాగాలతోపాటు పనితీరును కూడా వివరిస్తుంది. రిజర్వుబ్యాంకు 90వ వార్షికోత్సవం సందర్భంగా ఈ డాక్యుమెంటరీని ప్రదర్శించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఆర్‌బిఐ ముందు తనవద్ద ఉన్న పసిడి ఖజానాను ప్రదర్శనకు పెట్టింది. ఒక్కొక్కటి 12.5 కిలోల బరువున్న బంగారు ఇటుకలను కూడా ప్రదర్శనలో ఉంచింది. ఒక్కొక్కటి కోట్లాది రూపాయల విలువ ఉంటుందని అంచనా. మొత్తం రిజర్వుబ్యాంకు వద్ద ఇప్పటివరకూ 870 టన్నుల బంగారునిల్వలున్నట్లు తేలింది. దేశాలు ఆర్థికంగా పతనం అయినపుడు లేదా వృద్ధిలోకి వస్తున్నపుడు, అలాగే ఆర్థిక వ్యవస్థల్లో హెచ్చుతగ్గులున్నపుడు కూడా బగారం విలువల్లో మాత్రం ఎలాంటి మార్పులుండవు. చెల్లింపుల సమతుల్యత సందర్భంగా 1991లో భారత్‌లో సంక్షోభం ఎదురయినపుడు తనవద్ద ఉన్న బంగారం నిల్వల్లో కొంతమొత్తం విదేశాల్లో తాకట్టుపెట్టింది. అప్పటినుంచి భారత్ ఆర్థిక వ్యవస్థల్లో సమస్యలు,సంక్షోభాలు ఎదురయినపుడు వినియోగించేందుకు వీలుగా బంగారం నిల్వలనున పెంచుకుంటూ వచ్చింది. తాజా గణాంకాలప్రకారం రిజర్వుబ్యాంకు వద్ద ఉన్న బంగారం నిల్వలు 850 కోట్ల డాలర్ల విలువైనవని తేలింది. ఇన్వెస్టర్ల నమ్మకాన్ని పరిరక్షించడానికి, విదేశీ కరెన్సీ స్థిరత్వంకోసం ఈ నిల్వలు ప్రయోజనకారి అవుతాయని ఆర్‌బిఐ చెపుతోంది. ఇక డాక్యుమెంటరీ పరంగాచూస్తే చిత్రాన్ని చాక్‌బోర్డ్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించింది. ఆర్‌బిఐ 90యేళ్ల ప్రయాణంపై పూర్తి వివరణాత్మకంగా ఉంటుందని అంచనా. ఆర్‌బిఐకి ఈకేంద్రాలు మధ్యప్రదేశ్ లోని దేవాస్, మహారాష్ట్రలోని నాసిక్, పశ్చిమబెంగాల్‌లోని సల్బోని, కర్ణాటకలోని మైసూరుల్లో సెక్యూరిటీపేపర్, ఇంకు, ఇతర ఉత్పత్తుల తయారీ కేంద్రాలతో పాటు భద్రపరిచే వనరులున్నాయి. ప్రస్తుతం భారత కరెన్సీ పూర్తిగా మేడిన్‌ఇండియాలోనే రూపొందుతోంది. దీన్నిబట్టిచూస్తే రిజర్వుబ్యాంకు పూర్తి స్వయం స్వావలంబనతో నడుస్తున్నట్లు తేలింది. ఆర్‌బిఐ నోట్లు కూడా మొత్తం 50కిపైగా సెక్యూరిటీ ఫీచర్లతో ఉంటున్నాయి. వీటిలో అనేకం పైకి కనిపించవు. అందువల్లనే నకిలీఒట్లను సులభంగా గుర్తించగలుగుతున్నాం.

# డైట్ ఛార్జీల పెంపునకు కృషి

## -బిసి సంక్షేమ మంత్రి సవిత

**విజయవాడ,జూన్29,ప్రభాతవార్తప్రతినిధి:** హాస్టల్ విద్యార్థులకు ఇచ్చే డైట్ ఛార్జీల పెంపునకు కృషి చేస్తానని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత,జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తాజా ఆహారాన్ని మాత్రమే అందించాలని స్పష్టంచేశారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఏడాది పూర్తి చేసుకున్నందుకు మంత్రి సవితను రాష్ట్ర బీసీ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘ ప్రతినిధులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైందని, ఇప్పటికే ప్రభుత్వం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసిందని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తాజా ఆహారం, మరిగించి చల్లార్చిన నీరు మాత్రమే అందించాలని స్పష్టంచేశారు. విద్యార్థులకు జలుబు, తలనొప్పి, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే, తక్షణమే అందుబాటులో ఉన్న వైద్యులతో వైద్య సేవలందించాలన్నారు.హాస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సవిత హామీ ఇచ్చారు. డైట్ ఛార్జీల పెంపు విషయమై ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. బీసీ హాస్టళ్లకు మాత్రమే కాకుండా సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల హాస్టళ్లకు సంబంధించి డైట్ ఛార్జీలపైనా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. త్వరలోనే డైట్ ఛార్జీల పెంపు విషయమై నిర్ణయం వెలువడే అవకాశముందన్నారు. నాలుగో తరగతి ఉద్యోగాలు, హెచ్ డబ్ల్యూవోల ఖాళీ పోస్టుల భర్తీ, ఏబీసీ డబ్ల్యూవోల పదోన్నతల అంశాలను కూడా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా హాస్టళ్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొరన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులు కేటాయిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రి సవితకు రాష్ట్ర బీసీ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘ ప్రతినిధులు అందజేశారు.

# మొదటిభార్యకు విడాకులు ఇవ్వకుండానే రెండోవివాహం

## ఉత్తరాఖండ్ బిజెపి మాజీ ఎమ్మెల్యేపై ఆరేళ్ల బహిష్కరణ వేటు

**డెహ్రాడూన్,జూన్ 29:** బిజెపి మాజీ ఎమ్మెల్యే రెండో వివాహం చేసుకున్నారు. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే మరో మహిళను పెళ్లాడారు. దీంతో బహుభార్య త్వానికి వ్యతిరేకంగా అమలుచేసిన యూనిఫాం సివిల్ కోడ్‌ను ఆయన ఉల్లంఘించడంపై బిజెపి ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీనుంచి ఆయనను బహిష్కరించింది. బిజెపి పాలిత ఉత్తరాఖండ్‌లో ఈసంఘటన జరిగింది. హరిద్వార్ లోని జ్వాలాపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సురేష్ రాథోడ్ రెండో పెళ్లి చేసుకున్నారు.

సహరాన్‌పూర్‌కు చెందిన నటి ఊర్మిళా సనావర్‌ను తన రెండవ భార్యగా ఆయన పరిచయంచేశారు. అయితే మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే బిజెపి నేత సురేష్ రాథోడ్ రెండో పెళ్లి చేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

# 'కల్తీ నెయ్యి' దర్యాప్తు

>>నివేదికలను సుప్రీంకోర్టు ధర్మాసనం పరిశీలించి తదుపరి వెలువడించే ఆదేశాల మేరకు సిట్ ముందుకుకదలనుందనేది తెలుస్తోంది. నకిలీనెయ్యి పాపంలో తమిళనాడు ఏఆర్ డెయిరీ ఎండి రాజశేఖరన్, నెయ్యిసరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌లోని పరాగ్‌డెయిరీ,ప్రీమియర్ అగ్రిఫుడ్స్,అల్ఫామిల్క్‌ఫుడ్స్, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు ఆశిశ్‌అగర్వాల్, విపిన్‌జైన్, పొమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక)సిఇఒఅపూర్వవినయ్‌కాంత్‌చావ్డా, తోబాటు టిటిడి ఉద్యోగులు, డెయిరీల సిబ్బంది మొత్తం 15మందిని సిట్ అధికారులు ప్రధాన నిందితులను అరెస్టుచేసేసింది. ఇప్పుడు అసలు టెండర్లు పిలవడం, ఆ తరువాత ఎలాంటి అర్హత లేకున్నా బోలేబాబాడెయిరీకి నెయ్యిసరఫరాకు అనుమతించడం వంటివాటిల్లో ప్రధాన సూత్రధారులు ఎవరనేది తేల్చనుంది. పవిత్రమైన లడ్డూలను కలుషితంచేసిన పాపంలో రానున్న రోజుల్లో ఎవరిని విచారణ చేయనున్నారనేది ఇప్పుడు ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ఈ కేసులో క్లైమాక్స్‌లో శిక్ష ఎవరికి పడనుందనేది కూడా త్వరలోనే వీడిపోనుంది. తిరుమలకు 2019 నుండి 2024 మేనెల వరకు నెయ్యి సరఫరా అంశాలు ఇప్పుడు విస్తుగొల్పుతున్నాయి. సుప్రీంకోర్టు వెలువడించే ఆదేశాల మేరకు నకిలీనెయ్యి సరఫరా కేసు విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకోనున్నాయనేది తెలుస్తోంది.

# పరిష్కరించండి

>> టినీ జోడించాల్సిన అవసరం ఉందని అన్నారు. సీనియర్లే 4 దశాబ్దాలు పార్టీని ముందుకు తీసుకెళ్లారని అదేవిధంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని కూడా ఇంటింటికీ తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. నెల రోజుల పాటు తూచా తప్పకుండా అందరం డోర్ టూ డోర్ ప్రచారం చేసి సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు.

# భారీ వర్ష సూచన

>> మోస్తరు వానలు పడే అవకాశముందని వెల్లడించింది. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో మత్స్యకారులు ఈరోజు వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.వాతావరణ శాఖ తెలిపిన సమాచారాన్ని అనుసరించి ఆదివారం అర్ధరాత్రి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో సోమవారం ఉదయం వరకు ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయి. ఉత్తర బంగాళాఖాతంలో కొత్తగా అల్పపీడనం ఏర్పడటం వల్ల ఏర్పడిన దిగువగాలుల కారణంగా హైదరాబాద్ ప్రాంతం మొదలుఅనేక జిల్లాల్లో, ముఖ్యంగా విజయవాడ, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఉత్తర ప్రకాశం, కృష్ణ, ఏలూరు, తూర్పు పశ్చిమ గోదావరి, కాకినాడలో కొన్ని ప్రాంతాలలో అర్ధరాత్రి నుండి వర్షం ప్రారంభం కానుంది.

## వారం - వర్జ్యం

తేది : 30-06-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
పంచమి ఉ.9.27
మఖ ఉ.7.22
వర్జ్యం మ.3.53-సా.5.35
దు.మ.12.38-1.30, 2) మ.3.15-సా.4.07
శుభసమయం : ఉ.5.15-6.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** జీవితభాగస్వామితో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. వాహనసౌఖ్యం.

**వృషభం :** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. సాంకేతిక విద్యలపట్ల ఆసక్తిచూపుతారు.

**మిథునం:** మాటల చాతుర్యంతో ఎదుటివారిని ఆకట్టుకుని ఎంతటిపనినైనా సాధిస్తారు.

**కర్కాటకం:** పూర్వపు మిత్రుల నుండి ఆసక్తికరమైన విషయాలు తెలుసుకొంటారు. వస్తుసేకరణ.

**సింహం:** కొత్త కార్యక్రమాలు ప్రారంభిస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

**కన్య :** ఆస్తి వివాదాలు ఎదురై చికాకులుపెడతాయి. ఆర్థిక పరిస్థితి కొంతవరకు అనుకూలం.

**తుల :** వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. ఉద్యోగులు పదోన్నతి అవకాశాలు పొందుతారు.

**వృశ్చికం:** సంఘంలో కీర్తిప్రతిష్ఠలు పెరుగు తాయి. అనుకోని విధంగా ధన, వస్తు లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. మాటకు విలువ పెరుగుతుంది.

**మకరం:** ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా వుండును. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**కుంభం:** కళాకారులకు, సాంకేతిక నిపుణులకు ఆర్థిక ప్రయోజనాలు అందుతాయి. ప్రయాణాలు.

**మీనం :** మిత్రుల కష్టాలను కూడా మీవిగా భావించి కష్టపడతారు. పోటీ పరీక్షలలో విజయం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# దిగ్గజ ఐటీ కంపెనీల ప్రతినిధులకు సిఎం చంద్రబాబు విందు

## నేడు విజయవాడలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ నేషనల్ వర్క్ షాప్

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, జూన్ 29:** అంతర్జాతీయ ఐటీ, బహుళజాతి కంపెనీల ప్రతినిధులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విందు ఇచ్చారు. అమరావతిలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయనున్న క్వాంటం వ్యాలీపై సోమవారం జరగనున్న నేషనల్ వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు వచ్చిన దిగ్గజ ఐటీ సంస్థల ప్రతినిధులకు సీఎం చంద్రబాబు తన నివాసంలో డిన్నర్ ఇచ్చారు. ఆయా కంపెనీల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం వ్యాలీపై చర్చించారు. దేశంలోనే తొలిసారిగా ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సహకారంతో ఈ పార్కును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని సీఎం వివరించారు.

**సిఎం విందుకు హాజరైన ప్రముఖులు:**

సిఎం చంద్రబాబు ఇచ్చిన విందుకు హాజరైన ప్రముఖుల్లో గిదిళీ ప్రెసిడెంట్ అండ్ గ్లోబల్ హెడ్ వి. రాజన్న, మైక్రోసాఫ్ట్ ఇండియా ఎండీ రాజీవ్ కుమార్, ఏటీ అండ్ టీ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ సిద్ధు, వార్నర్ బ్రదర్స్ ఇండియా ఇన్నోవేషన్ సెంటర్ హెడ్ మనీష్ వర్మ, భారత్ బయోటెక్ వ్యవస్థాపకురాలు సుచిత్రా కె. ఎల్లా, హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, నేషనల్ క్వాంటం మిషన్ డైరెక్టర్ జె.బి.వి. రెడ్డి, రెడ్డీ ల్యాబ్స్ ఫణి మిత్ర, అస్ట్రా జెన్గా ఎండీ ప్రవీణ్ రావు, ఐబీఎం ఇండియా వైస్ ప్రెసిడెంట్ స్కాట్ క్రౌడర్, కేంద్ర శాస్త్రసాంకేతిక మంత్రిత్వశాఖ కార్యదర్శి అభయ్ కరాండికర్, కేంద్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ అజయ్ కుమార్ సూద్ వంటి ప్రముఖులు పాల్గొన్నారు. వీరితో పాటు అమెజాన్, హెచ్‌సీఎల్, ఎల్ అండ్ టీ, ఐఐటీ మద్రాస్, తిరుపతి, బ్యాంక్ ఆఫ్ అమెరికా వంటి సంస్థల ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇవాళ డిన్నర్‌కు హాజరైన వారంతా సోమవారం విజయవాడలో జరగనున్న నేషనల్ క్వాంటం వర్క్ షాపులో పాల్గొననున్నారు.

# ఎపిలో 10 జాతీయ రహదారులకు మహర్దశ

## 988 కిలోమీటర్ల మేర విస్తరించేందుకు సిద్ధం కానున్న ప్రతిపాదనలు

**విజయవాడ,జూలై29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని పది జాతీయ రహదారులు అభివృద్ధిపై ఎన్‌హెచ్ఐ ప్రత్యేక దృష్టిపెట్టింది.దీంతో ఈ రహదారలు విస్తరణ వేగవంతం కానున్నది. రోడ్లపై వాహన రద్దీతో పాటు మున్ముందు మరింత ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉందని గుర్తించడంతో వాటి విస్తరణపై కేంద్రం దృష్టిపెట్టింది. ఆయా జాతీయ రహదారులను 988 కిలోమీటర్ల మేర విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించింది. వాహన రద్దీని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలోని పది జాతీయ రహదారులకు విస్తరణ దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఆయా జాతీయ రహదారుల్లో 988 కిలోమీటర్ల మేర విస్తరించేందుకు వీలుగా సాధ్యాసాధ్యాల నివేదిక, డీపీఆర్ రూపొందించేలా కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆదేశించింది. తాజాగా ప్రకటించిన 2025- 2026 వార్షిక ప్రణాళికలో ఈ రహదారులను కేంద్ర ప్రభుత్వం చేర్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా అధికారులు డీపీఆర్‌లు సిద్ధం చేసి పంపిస్తే, వాటికి ఆమోదం లభించనుంది. కావలి, కలిగిరి పట్టణాల వద్ద 20 కిలోమీటర్ల మేర బైపాస్‌లు నిర్మిస్తారు. కావలి వద్ద చెన్నైకోల్‌కతా హైవేలో బైపాస్ ఉండగా, కావలికి మరోవైపు దుత్తలూరు నుంచి వచ్చే హైవే 165ఎన్‌హెచ్ సైతం బైపాస్ నిర్మించనున్నారు. దీనివల్ల కావలికి రింగ్ రోడ్డు అందుబాటులోకి వచ్చినట్లు అవుతుంది.

కత్తిపూడి నుంచి ఒంగోలు, రాజమహేంద్రవరం నుంచి రామచంద్రపురం జాతీయ రహదారుల విస్తరణ కోసం డీపీఆర్ తయారీకి సలహా సంస్థల ఎంపికకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. ఏపీ, కర్ణాటక సరిహద్దు నుంచి కదిరి, ముదిగుబ్బ మీదుగా అనంతపురం వరకు 86 కిలోమీటర్లు 4 వరుసలుగా విస్తరిస్తారు. ఇందులో కదిరి, ముదిగుబ్బల వద్ద బైపాస్‌లు కూడా ఉన్నాయి. పలమనేరు నుంచి కుప్పం మీదుగా తమిళనాడులోని కృష్ణగిరి సరిహద్దు వరకు 97 కిలోమీటర్ల దూరాన్ని నాలుగు వరుసలుగా చేయనున్నారు. గుత్తి నుంచి తాడిపత్రి, ముద్దనూరు నుంచి జమ్మలమడుగు వరకు మొత్తం 69 కిలోమీటర్లు 4 వరుసలుగా విస్తరిస్తారు. అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వరకు 52 కిలోమీటర్లు 4 వరుసలుగా చేస్తారు. రాజమహేంద్రవరం నుంచి రంపచోడవరం మధ్య 3 చోట్ల 24 కిలోమీటర్లు, విశాఖపట్నం రాయ్‌పూర్ మార్గంలో 13 కిలోమీటర్లు పది మీటర్ల వెడల్పుతో రెండు వరుసలుగా విస్తరించనున్నారు. కత్తిపూడి నుంచి ఒంగోలు వరకు 380 కిలోమీటర్ల 216ని నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. ఇందులో కత్తిపూడి నుంచి కాకినాడ వరకు 27 కిలోమీటర్లు ఇప్పటికే నాలుగు వరుసలుగా ఉంది. దీనిని ఆరు వరుసలు చేయనున్నారు. మిగిలిన భాగం ప్రస్తుతం రెండు వరుసలు ఉండగా నాలుగు వరుసలుగా విస్తరిస్తారు. కర్నూలు నుంచి నంద్యాల, కడప, రాయచోటి, పీలేరు, చిత్తూరు మీదుగా తమిళనాడులోని రాణిపేట వరకు ఉన్న ఎన్‌హెచ్40ని కడప నుంచి చిత్తూరు జిల్లాలోని రంగంపేట క్రాస్ వరకు 148 కిలోమీటర్లు 4 వరుసలుగా విస్తరించనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని కొడికొండ చెక్‌పోస్ట్ నుంచి సిర వరకు 99 కిలోమీటర్లు 4వరుసలు చేస్తారు. ఏపీ, కర్ణాటక సరిహద్దు నుంచి కదిరి, ముదిగుబ్బ మీదుగా అనంతపురం వరకు 86 కిలోమీటర్లు 4 వరుసలుగా విస్తరిస్తారు. ఇందులో కదిరి, ముదిగుబ్బల వద్ద బైపాస్‌లు కూడా ఉన్నాయి. వీటిలో పలమనేరు నుంచి కుప్పం మీదుగా తమిళనాడులోని కృష్ణగిరి సరిహద్దు వరకు 97 కిలోమీటర్ల దూరాన్ని నాలుగు వరుసలుగా చేయనున్నారు. మొత్తంగా 988 కిలోమీటర్ల విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేసేలా మోర్త్ వార్షిక ప్రణాళికలో పేర్కొనగా ఇందులో 931 కిలోమీటర్లు నాలుగు వరుసల విస్తరణ ప్రాజెక్టులే ఉన్నాయి,ఇక విజయవాడమచిలీపట్నం జాతీయ రహదారి65ని ఆరు వరుసలుగా విస్తరించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ కార్యాచరణ ఆరంభించింది. నేషనల్ హైవేలను నౌకాశ్రయాలకు అనుసంధానం చేసే ప్రాజెక్టులో భాగంగా ఈ రహదారిని మచిలీపట్నం పోర్టు వరకూ విస్తరిస్తారు. ఇందుకోసం సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేస్తున్నారు. విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు జాతీయ రహదారి 63 కిలోమీటర్ల మేర ఉంది. ఇందులో అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు కంకిపాడు ఉయ్యూరు మధ్య చలివేంద్రపాలెం దగ్గరలో క్రాస్ అవుతుంది. అక్కడి నుంచి మచిలీపట్నం వరకు 44 కిలోమీటర్ మేర ప్రస్తుతం ఉన్న నాలుగు వరుసల మార్గాన్ని 6 వరుసలుగా విస్తరిస్తారు. మచిలీపట్నం వద్ద ఒంగోలుకత్తిపూడి నేషనల్ హైవే రెండు వరుసలుతో ఉంది. ఇందులో మాచవరం రైస్‌మిల్లు వరకు 4 కిలోమీటర్లు నాలుగు వరుసలుగా విస్తరిస్తారు. మాచవరం రైస్ మిల్లు వద్ద నుంచి పోర్టుకు 3.7 కిలోమీటర్లను నాలుగు వరుసలతో కొత్తగా రహదారిని నిర్మిస్తారు. వీటిలో ఆరు వరుసలుగా విస్తరించనున్న 44 కిలో మీటర్లతో పాటు 3.7 కిలో మీటర్లు మేర నాలుగు వరుసల హైవే నిర్మాణాన్ని ఎన్‌హెచ్ఏ చేపడుతుంది. ఒంగోలుకత్తిపూడి హైవేలో 4 కిలోమీటర్ల మేర విస్తరించే పనులను కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ పర్యవేక్షిస్తుంది. మొత్తంగా ఈ రహదారికి చెందిన తయారీ బాధ్యత చైతన్య, ఎంఎస్ పార్క్ జేవీ సంస్థకు అప్పగించారు. విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు ఉన్న హైవేలో ఓఆర్ఆర్ క్రాస్ అయ్యే ప్రాంతం నుంచి మాత్రమే రహదారిని విస్తరించనున్నారు. విజయవాడ బెంజ్ సర్కిల్ నుంచి పోరంకి, పెనమలూరు జంక్షన్, కంకిపాడు మీదుగా చలివేంద్రపాలెం వరకు 19 కిలోమీటర్ల మేర ఉన్న మార్గాన్ని 6 వరుసలుగా విస్తరించడంపై ఇంకా స్పష్టత లేదు. విజయవాడ పరిధిలోనే వాహన రద్దీ ఈ పరిధిలోనే ఎక్కువగా ఉంటుంది.

# తిరుమల సమాచారం




## వారాంతంతో మళ్లీ తిరుమల కిటకిట

### కిలో మీటర్లు బారులు తీరిన భక్తులు

**తిరుమల,జూన్ 29 ప్రభాతవార్తప్రతినిధి:** వేసవి సెలవులు ముగిసిన తరువాత జూన్‌నెలాఖరులో వారాంతం కావడంతో ఆదివారం కూడా కలియుగవైకుంఠం తిరుమ ల భక్తజనసంద్రంగా మారింది. వరుసగా రెండు రోజులు సెలవులు శని ,ఆదివారాలు రావడంతో ఏడుకొండల స్వామి దర్శనానికి భక్తులు రెండురోజులుగా భారీగా కొండపైకి చేరారు. ఆదివారం ఉదయానికే వైకుంతమ్ క్యూకాంప్లెక్స్‌లలోని 61 కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల నారాయణగిరి ఉద్యానవనాల్లోని షెడ్ల వరకు క్యూలైన్లలో బారులుతీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి ఆదివారం మధ్యాహ్నానికి 18 గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఆరుగంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. సాయంత్రం 6గంటల వరకు 51వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.ఇంకా 20వేలమంది భక్తులు పైగానే అర్ధ రాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి.క్యూలైన్లలో భక్తులకు శ్రీవారి సేవకులు అన్నప్రసాదాలు, పాలు,మజ్జిగ నిరంతరాయంగా పంపిణీ చేస్తున్నారు. కాగా శనివారం రాత్రివరకు 90,051మంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించారు. కానుకల ద్వారా 2.90కోట్ల ఆదాయం చేకూరింది. మరో వారం రోజులు రద్దీ ఇలాగే కొనసాగే అవకాశం ఉంది.

## టిటిడి ఎస్వీవిద్యాదాన ట్రస్ట్‌కు రూ.51లక్షలు విరాళం



**తిరుమల,జూన్ 29ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు తమవంతు విరాళాలందిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం తమిళనాడు చెన్నై టివిఎస్ క్యాపిటల్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎస్వీ విద్యాదానట్రస్ట్‌కు 51,00,001 రూపాయలు విరాళం చెక్కురూపంలో అందించారు.ఈ భారీ విరాళాన్ని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కి టివిఎస్ క్యాపిటల్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సిఎండి గోపాల్ శ్రీనివాసన్ క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా దాతను అభినందించారు.

## జిఎన్‌సి టోల్‌గేట్ వద్ద కారులో మంటలు

### సకాలంలో స్పందించడంతో తప్పిన ప్రమాదం



**తిరుమల,జూన్ 29ప్రభాతవార్తప్రతినిధి:** వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం కర్నాటక నుండి వచ్చిన భక్తులు కారులో మంటలు వ్యాపించాయి. కారు డ్రైవర్ సకాలంలో గమనించి భక్తులను క్రిందకు దించేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అక్కడే ఉన్న సెక్యూరిటీ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు సకాలంలో స్పందించడంతో మంటలను అదుపు చేశారు. ఆదివారం సాయంత్రం తిరుమలలోని జిఎన్‌సి టోల్‌గేట్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. కర్నాటక కోలారు గుడిపల్లికి చెందిన టిజి సుదర్శన్ కుటుంబంతో కలసి తిరుమలకు కారులో వచ్చారు. కారు టోల్‌గేట్‌కు రాగానే ఒక్కసారిగా మంటలు,పొగలు వ్యాపించాయి. దీన్ని గమనించిన అతను వెంటనే కుటుంబ సభ్యులను క్రిందకు దించేయడంతో మంటలు వ్యాపించాయి. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీసులు వెంటనే మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటల్ని ఆర్పివేశారు.దీంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. వందలకిలోమీటర్లు ప్రయాణించడంవల్లే ఘాట్‌లో ఇంజిన్‌వేడిగా మారి పొగలు వ్యాపించాయని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

## శక్తిపీఠంలో టిటిడి ఛైర్మన్ నాయుడు

### పూజాకైంకర్యాలు, అన్నదానంపై సంతృప్తి

**తిరుమల,జూన్ 29ప్రభాతవార్తప్రతినిధి:** వారాహి అమ్మవారి నవరాత్రి పూజల్లో భాగంగా ఆదివారం ఉదయం తిరుపతికి సమీపంలో రామచంద్రాపురం మండలం రాయలచెరువురోడ్డులోని శక్తిపీఠం పాతాళ శ్వేత వారాహిక్షేత్రాన్ని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా మరకత శక్తికాళీదేవి, మరకత సిద్దేశ్వరస్వామిని దర్శించుకున్నారు. శక్తిపీఠాధీశ్వరి మాతాజీ రమ్యానందభారతిస్వామిని మర్యాదపూర్వకంగా ఛైర్మన్ నాయుడు కలుసుకున్నారు.వారాహి అమ్మవారి నవరాత్రుల్లో భాగంగా శక్తిపీఠాన్ని సందర్శించి పీఠంలో చాలా మంచి కార్యక్రమాలు చేపడుతున్నారని అభినందించారు. అంతేగాక పీఠంలో పూజా కార్యక్రమాలు, అన్నదానం చాలా బాగా చేస్తున్నారని చెప్పారు. ఈ పీఠాన్ని సందర్శిస్తే కష్టాలు తీరుతాయనే విశ్వాసంతో భక్తులు చాలామంది వస్తున్నారని ఆయన విశ్వాసం వెలిబుచ్చారు. అంతకుముందు శక్తిపీఠం చేరుకున్న ఛైర్మన్ బిఆర్ నాయుడుకు పీఠం నిర్వాహకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఛైర్మన్ నాయుడును సత్కరించి వైదేహిమాలను సమర్పించారు.పుస్తకం,ప్రసాదాన్నిఛైర్మన్‌కు అందించారు.



## శ్రీవారి ఆశీస్సులతో అంతా శుభాలు కలగాలి

### టాటా సంస్థ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్



**తిరుమల,జూన్ 29ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అంతా శుభాలు కలగాలని దేవుని ప్రార్ధించినట్లు టాటా సంస్థ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ తెలిపారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం స్వాగతం పలికారు. చంద్రశేఖరన్‌శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## రెండుతెలుగురాష్ట్రాలు ఆర్ధికంగా అభివృద్ధిచెందాలి

### తెలంగాణ ఆర్థికసంఘం ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య

**తిరుమల,జూన్29ప్రభాతవార్తప్రతినిధి:** ఆర్థికంగా, సామాజికంగా, అభివృద్ధి పరంగా రెండు తెలుగురాష్ట్రాలు కలసి పనిచేయాలని, ప్రజలు అందరూ సంతోషంగా ఉండాలని దేవదేవుడ్ని వేడుకున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఆర్థికసంఘం ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య తెలిపారు. అన్ని సంక్షేమ పథకాలు అమలుచేసేలా శ్రీవారి శక్తిని ప్రసాదించాలని కోరుకున్నానన్నారు. దేశంలోనే రెండు తెలుగురాష్ట్రాలు అన్ని విధాలా అభివృద్ధిచెందాలని ఆకాంక్షించారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆయన శ్రీవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.



## శ్రీవారి దర్శనం పై చర్చిస్తా: టిజి ఆర్టీసి ఎండి సజ్జనార్

**తిరుమల,జూన్ 29ప్రభాతవార్తప్రతినిధి:** తెలం గాణ,ఆంధ్రప్రదేశ్ ప్రజలు సంతోషంగా ఉం డాలని, తెలంగాణ ఆర్టీసి ప్రయాణీకులకు టిటిడి దర్శన సౌకర్యం కల్పించే విషయంపై చర్చిస్తానని టిఎస్‌ఆర్‌టిసి ఎండి సజ్జనార్ తెలిపారు.ఇప్పటికే కొత్త విధానంలో టిఎస్ ఆర్టీసి శ్రీవారి దర్శనం కల్పించే అంశం పరిశీలనలో ఉందన్నారు. ఆది వారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శిం చుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



# పెద్దారెడ్డికి ఒక చట్టం.. జేసికి ఒక చట్టమా!

### హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయకుంటే ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తాం..

### వైఎస్సార్సీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



ఆదివారం కేతిరెడ్డి పెద్దారెడ్డితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, జూన్ 29 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లాలోని మాజీ ఎమ్మెల్యే తాడిపత్రి పెద్దారెడ్డికి భద్రత కల్పించి తాడిపత్రిలో ఉండేలా చూడాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను జిల్లాపోలీసు యంత్రాంగం అమలు చేయకుంటే పెద్ద ఎత్తున వైసిపి ఆధ్వర్యంలో ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతామని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదివారం తాడిపత్రిలోని తన నివాసానికి వెళ్లగా పోలీసులు తాడిపత్రిలో ఉండేందుకు లేదంటూ పోలీసులు బలవంతంగా అనంతపురంలోని నివాసానికి తరలించారు. విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి సాకే శైలజానాథ్, మాజీ ఎంపి తలారి రంగయ్యలు నగరంలోని కేతిరెడ్డి నివాసానికి వెళ్లి జరిగిన ఘటనలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన జరగడం లేదని, ఆటవిక రాజ్యం ఏలుతోందని విమర్శించారు. గత ఏడాది కాలంగా తాడిపత్రిలోని తన నివాసానికి వెళ్లేందుకు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ప్రయత్నం చేస్తున్నా పోలీసులు రానివ్వకపోవడంతో రెండు నెలల క్రితం హై కోర్టు నుంచి ఉత్తర్వులు సైతం తీసుకొచ్చారన్నారు. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలంటూ జిల్లా ఎస్పీని తాము కలిసి కోరినప్పటికీ వేరువేరు కారణాలను చూపుతూ ఉత్తర్వులను అమలు చేయడం లేదన్నారు. గతంలో ఎన్నికల సమయంలో పెద్దారెడ్డి తోపాటు జేసి ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రిలో ఉండకూడదంటూ హైకోర్టు చేసిన ఆదేశాలను ఎన్నికల తర్వాత పోలీసులు ఉల్లంఘించారని, పెద్దారెడ్డికి ఒకరూల్, జేసి ప్రభాకర్‌రెడ్డికి ఒక రూల్ అమలు చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఏడాది కూటమి పాలనపై రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలతో చర్చించేందుకు పెద్దారెడ్డి ఆదివారం తాడిపత్రిలోని తన నివాసానికి వెళ్లగా పోలీసు యంత్రాంగం అక్కడి నుంచి బలవంతంగా తీసుకురావడం, ఇదేం ప్రజాస్వామ్యమని ఆయన ప్రశ్నించారు. తాడిపత్రిలో జేసి ప్రభాకర్‌రెడ్డి శాసించినదే పోలీసులు అమలు చేస్తున్నారని విమర్శించారు. హైకోర్టు ఉత్తర్వులు ఉల్లంఘనపై మళ్లీ హైకోర్టుకు వెళ్తామని, అప్పుడు ఆపే శక్తి మీకు ఉందా అని ప్రశ్నించారు. జేసి ప్రభాకర్‌రెడ్డి తనను తాడిపత్రికి రమ్మని ప్రగల్భాలు పలుకుతారని, తీరా తానువెళ్తే పోలీసులతో తనను అడ్డుకుంటున్నాడని విమర్శించారు. నేను రాజకీయం కోసం ఎందాకైనా వెళ్తానని, నీ చేతనైంది నువ్వుచెయ్..నా చేతనైంది నేను చేస్తానని, నీ శక్తి ఏందో నాకు తెలుసు, నా శక్తి ఏందో నీకు తెలుసునని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురునేతలు పెద్దారెడ్డి నివాసానికి చేరుకోవడంతో సందడిగా మారింది.

# నకిలీ ఇ స్టాంపు సూత్రధారి ఎర్రప్ప

### ఎమ్మెల్యే సురేంద్రబాబు, ఎస్ఆర్సి ఇన్ఫ్రాకు క్లీన్‌చిట్

### రబ్బర్ స్టాంపులు, రెవెన్యూ నకిలీ సర్టిఫికెట్లు లేవని నిర్ధారణ

### ఈ వ్యవహారంలో రాష్ట్రస్థాయిలో వీర పాండ్యన్ విచారణ



ఎంఎల్ఏ అమిలినేని సురేంద్ర బాబు, ఎర్రప్ప అలియాస్ మీ సేవ బాబు

**అనంతపురం, జూన్ 29, ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో బయటపడ్డ నకిలీ ఈ స్టాంపుల వ్యవహారంలో సూత్రధారిగా ఎర్రప్ప అలియాస్ మీ సేవ బాబు నిర్ధారణ అయింది. నకిలీ ఈ స్టాంపులు కేసులో స్థానిక టిడిపి, వైసీపీ నేతలు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకున్నప్పటికీ ఈ స్కాంలో రెండు పార్టీల నేతల హస్తం లేదని, కర్త క్రియ , కర్మ అంతా కళ్యాణ్ దుర్గం లో మీసేవ నిర్వహిస్తున్న ఎర్రప్ప అలియాస్ మీసేవ బాబుదే అని అధికారులు తేల్చేశారు. పెద్ద ఎత్తున మీసేవ బాబు సంబంధించిన ఏజెన్సీ వద్ద ఈ స్టాంపులు కొనుగోలు చేసిన ప్రముఖ నిర్మాణ సంస్థ ఎస్ఆర్సి ఇన్ఫ్రా డెవలపర్స్ లిమిటెడ్ ఏలాంటి అవినీతికి పాల్పడలేదని, పక్కాగా ఆన్లైన్లో ఏజెన్సీ వారికి డబ్బులు చెల్లించే ఈ స్టాంప్స్ తీసుకున్నారని , అవినీతిలో వారు పాత్ర లేదని అధికారులు నిర్ధారించడం గమనించదగ్గ విషయం. తమ అవసరాల కోసం కళ్యాణ్ దుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు కు చెందిన ఎస్సార్సీ ఇన్ఫ్రా డెవలపర్స్ లిమిటెడ్ వారు ఈ స్టాంపుల కోసం మీసేవ బాబుకు సంబంధించిన ఏజెన్సీకి 32 లక్షల రూపాయలను వివిధ బ్యాంకుల ద్వారా ఆన్లైన్లో చెల్లించింది. అయితే ఈ మొత్తంలో ఈస్టాంపుల కోసం మీసేవ నిర్వాహకుడు ప్రభుత్వానికి రూ.6.58 లక్షలే చెల్లించి ఎస్ ఆర్ ఇన్ ఫ్రాకు మీ సేవ నిర్వాహకుడు రూ.25.48 లక్షలు మోసం చేశారు. నూరు రూపాయల ఈ స్టాంపులను లక్ష రూపాయల ఈ స్టాంపులుగా కంప్యూటర్లో టాంపరింగ్ చేసి చూస్తే ఒరిజినల్ ఈ స్టాంపులు ఉన్నట్లు మీసేవ బాబు చేసి వాటిని ఎస్సార్ శ్రీ ఇన్ఫ్రా వారికి ఇస్తూ వచ్చారు. అవి ఒరిజినల్ ఈ స్టాంపులు మాదిరిగానే ఉండడంతో సహజంగానే తెలుసుకోలేక వాటిని వినియోగిస్తూ వచ్చారు. ఎర్రప్ప అలియాస్ మీసేవ బాబు ఇప్పటివరకు 15,413 ఈస్టాంపులు విక్రయిస్తే అందులో 438 ఈ స్టాంపులను ఎస్ ఆర్ సి వారు కొనుగోలు చేసినట్లు వాటిలో 25.50 లక్షల మోసం జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. ఈ స్టాంపులతో సంబంధం ఉన్న ఏజెన్సీలు, బ్యాంకులు, ఇతర సంస్థల నుంచి పోలీస్ అధికారులు సమాచారాన్ని అడిగినట్లు తెలుస్తోంది. నకిలీ ఈ స్టాంపుల వ్యవహారంలో బోయ ఎర్రప్ప అలియాస్ మీసేవ బాబు తోపాటు ఆయన సతీమణి కట్ట భార్గవి, కురుబ మోహన్ బాబు, భువనేశ్వరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు కంప్యూటర్లు, లాప్టాప్, మూడు సీపీయులు, మూడు మానిటర్లు, మూడు ఫోన్లు, ఏడు వినియోగించిన స్టాంపులు, 88 ఖాళీ ఈ స్టాంపులను పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఇది ఇలా ఉండగా కళ్యాణ్ దుర్గం లో బయటపడ్డ నకిలీ ఈ స్టాంపులు వ్యవహారంలో ఎస్ఆర్సి ఇన్ఫ్రా డెవల పర్స్ లిమిటెడ్ సంస్థ ఎండి యశ్వంత్ స్పందిస్తూ ఈ విషయంలో రాష్ట్ర వ్యాప్తంగా దర్యాప్తు చేయాల్సి ఉందని, ఇతర చోట్ల కూడా ఇలా నకిలీ ఈ స్టాంపుల ముఠాలు ఈ అవకా శం ఉందని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఈజీగా ఉన్న ఐఏఎస్ అధికారి వీర పాండ్యన్ కూడా స్పం దిస్తూ అన్ని జిల్లాల్లో తగు చర్యలు తీసుకోవాలని , నకిలీ ఈ స్టాంపులు ఎక్కడైనా సృష్టించారో తనిఖీలు చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

# రాష్ట్ర వ్యాప్తంగా జనభా పెంపుపై సర్వే

**విజయవాడ,జూన్29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా జనభా పెంపు అంశంపై పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తోంది. నూతన జనాభా విధానంపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడం ఈ సర్వే లక్ష్యంగా ప్రభుత్వం చెబుతోంది. రాష్ట్రంలో పునరుత్పత్తి జరగాల్సిన అవశ్యకత గురించి ఏపీ సీఎం చంద్రబాబు చెబుతున్నారు.మానవ వనరులు అభివృద్ధి వలన వినూత్న ఆవిష్కరణలకు అవకాశాలుంటాయని ఆయన చెబుతున్నారు.దేశంలో యుపి,బీహార్‌లో జనభా పునరుత్పత్తి పెరుగుతుందని ఆయన వెల్లడించారు.ఈ క్రమంలో జనభా పెంపు అంశంపై ఏపీ ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందించి అందుకు అనుగుణంగా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తోంది.ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఈ సర్వే ప్రారంభమైంది కూడా! సర్వేలో భాగంగా రూపొందించిన ఎనిమిది ప్రశ్నల్లో ఏ విధమైన ప్రభుత్వ మద్దతు ప్రజలను ఎక్కువ మంది పిల్లల్ని కనడానికి ప్రోత్సహిస్తుంది అన్న ప్రశ్న కూడా ఒకటి. ఆర్థికసాయంతో పాటు రాయితీలు ఇవ్వడం, ప్రసూతి వైద్య,శిశు సంరక్షణ సేవలను అభివృద్ధి చేయడం, నాణ్యమైన విద్యను అందుబాటులో ఉంచడం, ఆరోగ్యనిపుణులు, డాక్టర్ల చేత క్రమం తప్పకుండా కౌన్సిలింగ్ నిర్వహించడం, ప్రభుత్వ నుండి ఎటువంటి సాయం అవసరం లేదు అన్న జవాబులు ఇచ్చి వాటిలోంచి ఏదో ఒకటి ఎన్నుకోవాలని సర్వేలో పాల్గొంటున్న వారిని ప్రభుత్వం కోరుతోంది. ఇతరత్రా ఏవైనా సాయం కావాలన్నా తెలపాలని పేర్కొంది. ప్రభుత్వ సిబ్బందే ఈ తరహా ప్రశ్నలు అడగడం ప్రజల్లో చర్చనీయాంశంగా మారుతోంది.కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉండాలన్నది కూడా మరో ప్రశ్న. దీనిని నేరుగా అడగకుండా రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎంతమంది పిల్లలుండాలని మీరు భావిస్తున్నారని ప్రభుత్వం అడిగింది. ఒకరు, ఇద్దరు, ఇద్దరి కన్నా ఎక్కువ అన్న జవాబులను ఇచ్చి, వాటిలో ఒక దానిని ఎంచుకోవాలని సూచించింది.

## అడ్వకేట్స్ స్పెషల్ ట్రైనింగ్ అకాడెమీకి టంగుటూరి ప్రకాశం పేరుపెట్టాలి: ఎపి స్టేట్ బార్ కౌన్సిల్ విజ్ఞప్తి

**విజయవాడ,జూల్29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అడ్వకేట్స్ స్పెషల్ ట్రైనింగ్ అకాడమీని ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల స్టేట్ బార్ కౌన్సిల్ హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించింది. ఏర్పాటు చేయబోయే న్యాయవాదుల ప్రత్యేక శిక్షణ అకాడమీకి ప్రముఖ న్యాయవాది, సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి సిఎం, ఆంధ్రకేసరి దివంగత టంగుటూరి ప్రకాశం పంతులు పేరు పెట్టాలని రాష్ట్రానికి విజ్ఞప్తి చేసింది.రాష్ట్ర బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎన్ ద్వారకనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశం ఆ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసింది. న్యాయవాదుల అకాడమీకి ప్రకాశం పంతులు స్పెషల్ ట్రైనింగ్ అకాడమీ ఫర్ అడ్వకేట్స్ పేరు పెట్టాలని కోరింది. లేనిపక్షంలో తెలుగు రాష్ట్రాల నుంచి సుప్రీంకోర్టుకు తొలిప్రధాన న్యాయమూర్తిగా చేసిన జస్టిస్ కోకా సుబ్బారావు పేరునైనా పెట్టాలంది. ప్రకాశం లేదా కోకా ఇద్దరిలో ఒకరి పేరు పెట్టాలని సమావేశం విజ్ఞప్తి చేసింది.

## ప్రసాద్ సూరికి సిఎం చంద్రబాబు అభినందనలు

**విజయవాడ, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** పేద మత్స్యకార కుటుంబంలో పుట్టి సాహిత్యంపై మక్కువతో రాసిన రెండో నవలకే ప్రతిష్టాత్మక కేంద్ర సాహిత్య యువ పురస్కారం అందుకోవడం ఎంతో ఆనందదాయకం. ఇంతటి అద్భుత ప్రతిభ కనబరిచిన ప్రసాద్ సూరికి అభినందనలు. సముద్రపు లోతు చూసే మత్స్యకారులకు మనిషి జీవితపు ఎత్తుపల్లాలు చూడడం కష్టమేమీ కాదు అని నిరూపించిన ప్రసాద్ సూరి రానున్న రోజుల్లో సాహిత్యపు శిఖరం తాకాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. రాష్ట్రానికి తను జన్మించిన జాతికి ఎనలేని ప్రతిష్ట తెచ్చిపెట్టిన ప్రసాద్ సూరికి మరొక్క మారు శుభాభినందనలు తెలిపారు.

## కమల్ హాసన్‌కు అభినందనలు తెలిపిన డిసిఎం పవన్

**విజయవాడ, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** విఖ్యాత నటుడు,ఎంపీ కమల్ హాసన్‌కు హృదయపూర్వక ఏపీ డిప్యూటీసీఎం పవన్ కళ్యాణ్ అభినందనలు తెలిపారు."ఎక్స్'స మాధ్యమంలో పవన్ చేసిన ట్వీట్‌లో ఆయన కెరీర్‌లో లెక్కకు మిక్కిలి వైవిధ్యమైన పాత్రలు ధరించి సినీ అభిమానులతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న దిగ్గజ భారతీయ నటుడు కమల్‌హాసన్‌కు అరుదైన గౌరవం దక్కింది.

## టీచర్ వీరకుమారి మృతి పట్ల మంత్రి డా.డోలా దిగ్భ్రాంతి

**విజయవాడ, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రోడ్డ ప్రమాదంలో మృతి చెందిన గురుకులం పార్ట్‌టైం టీచర్ వీర కుమారి మృతిపట్ల రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా బాలవీరాంజనేయస్వామి దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. కృష్ణాజిల్లా బల్లిపర్రు డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పార్ట్‌టైం టీచర్ వీరకుమారి నిన్న పాఠశాలనుంచి తిరిగిఇంటికి వెళ్తుండగా రోడ్డుప్రమాదంలో మృతి చెందింది. ఎ.పి ఎస్‌డబ్ల్యూ ఆర్ఇఐఎస్ నుంచి ఎక్స్ గ్రేషియా ఇచ్చి ఆమె కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

## నాందేడ్-తిరుపతిల మధ్య ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, జూన్ 29,ప్రభాతవార్త:** ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ తెలుగు రాష్ట్రాల మీదుగా నాందేడ్-తిరుపతి- నాందేడ్‌ల మధ్య రెండు వేర్వేరు ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. నాందేడ్ నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 07189ఎక్స్‌ప్రెస్ జూలై 4నుంచి 25వరకు ప్రతి శుక్రవారం సాయంత్రం 4.30గంటలకు బయలుదేరి శనివారం మధ్యాహ్నం 12.30గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో తిరుపతి నుంచి నాందేడ్ వెళ్లే నెంబర్ 07190ఎక్స్‌ప్రెస్ జూలై 5నుంచి 26వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం తిరుపతి నుంచి 2.20గంటలకు బయలుదేరి ఆదివారం ఉదయం 9.30గంటలకు నాందేడ్ చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గమధ్యలో ముద్ఖేడ్,ధర్మాబాద్, బాసర,నిజామాబాద్, కామారెడ్డి, మెడ్చల్, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, పిడుగురాళ్ల, నెమళ్లపూడి, రొంపిచర్ల, వినుకొండ, దొనకొండ, మార్కాపురం, కంభం, గిద్దలూరు, దిగువమెట్ట, నంద్యాల,జమ్ములమడుగు, ఎర్రగుంట్ల, కడప,నందలూరు, రాజంపేట, కోడూరు, రేణిగుంట స్టేషన్‌లలో నిలుస్తాయి. అలాగే నాందేడ్ నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 07015 మరో సర్వీసు జూలై 5నుంచి 26వరకు ప్రతి శనివారం సాయంత్రం 4.50గంటలకు బయలుదేరి తిరుపతికి ఆదివారం ఉదయం 10.10గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో తిరుపతి నుంచి నాందేడ్ వెళ్లే నెంబర్ 07016సర్వీసు జూలై 6నుంచి 27 వరకు తిరుపతి నుంచి ప్రతి ఆదివారం సాయంత్రం 4.40గంటలకు బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 1.15గంటలకు నాందేడ్ చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైళ్లు ముద్ఖేడ్,బాసర,నిజామాబాద్,కామారెడ్డి,మెడ్చల్ ,మల్కాజిగిరి,కాచిగూడ,ఉందానగర్,షాద్‌నగర్, జడ్చర్ల,మహబూబ్‌నగర్,వనపర్తి,గద్వాల,కర్నూలు,డోన్,గుత్తి,ఎర్రగుంట్ల,కడప,ఒంటిమిట్ట,రాజంపేట,రేణిగుంట స్టేషన్లలో నిలుస్తాయి.

## జూలై 4 నుంచి న్యూ పిడుగురాళ్ల శావల్యాపురం మధ్య పాసింజర్ రైలు

**విజయవాడ,జూన్29,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని అమరావతి పరిధిలో కీలకమైన నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టు మార్గంలో ఇకపై న్యూ పిడుగురాళ్ల శావల్యాపురం మధ్య పాసింజర్ రైలు అందుబాటులోకి వస్తుంది.ఈ రెండు స్టేషన్ల మధ్య సుదీర్ఘకాల ఎదురు చూపుల అనంతరం తొలిసారి ప్రయాణికుల రైలు పరుగులు పెట్టనుంది. ఈ రైలు మార్గం నిర్మించి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు గూడ్స్ రైళ్లను మాత్రమే నడుపుతున్నారు.జులై 4వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ప్రతి శుక్రవారం మహారాష్ట్ర నాందేడ్‌లో సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరే ప్రత్యేక రైలు (07189) పల్నాడు జిల్లాలో నడికుడికి రాత్రి 12.05, పిడుగురాళ్లకి రాత్రి 12.30, నెమలపురికి రాత్రి 01.00, రొంపిచర్లకి రాత్రి 01.25, వినుకొండకు 02.00 గంటలకు చేరుతుంది. మార్కాపురం, దొనకొండ, కంభం, నంద్యాల మీదుగా తిరుపతికి శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు రైలు వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07190) తిరుపతిలో జులై 5వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం 2.20 గంటలకు బయలుదేరి వినుకొండకు రాత్రి 10.05కు, రొంపిచర్ల 10.25కు, నెమలిపురి 10.35కు, పిడుగురాళ్ల 10.45కు, నడికుడి 11.00కి, నాందేడ్‌కు ఆదివారం ఉదయం 09.30 గంటలకు చేరుకుంటుందని రైల్వే అధికారులు వెల్లడించారు.

ADITYA BIRLA CAPITAL
FINANCE

Regd Office: Indian Rayon Compound, Veraval, Gujarat - 362 266 | (T) +91-22-6723 9101 | (Toll free) 1800 270 7000 | CIN: L64920GJ2007PLC058890 | www.adityabirlacapital.com

**నోటీసు**

ఆదిత్య బిర్లా క్యాపిటల్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో **https://abcf.financial/fraudawareness** అందుబాటులో ఉన్న క్రింది లింక్ **https://www.adityabirlacapital.com/**లో పేర్కొన్న రుణగ్రహీతలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడుతున్నది.

ఆదిత్య బిర్లా క్యాపిటల్ లిమిటెడ్ ("ఏబిసిఎల్") (గతంలో ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్ ("ఏబిఎఫ్ఎల్") నిర్వహించిన దర్యాప్తులో, పైన ఉన్న లింక్‌లో పేర్లు ప్రస్తావించబడిన రుణగ్రహీతలైన మీరు, రుణం పొందే ఉద్దేశ్యంతో తప్పుడు మరియు కల్పిత పత్రాలను ఉపయోగించి ఎబిసిఎల్ నుండి వ్యక్తిగత రుణం పొందేటప్పుడు మోసం చేశారని వెలుగులోకి వచ్చింది.

రుణగ్రహీతలుగా మీరు అనుసరించే, మీరు అమలు చేసే ఈ కార్యనిర్వహణ విధానం మా ప్రామాణిక నిబంధనలు మరియు షరతులను ఉల్లంఘిస్తుంది మరియు ఆర్థిక లావాదేవీలకు సంబంధించి వర్తించే చట్టాలు మరియు నిబంధనలను కూడా ఉల్లంఘిస్తుంది.

అందువల్ల, పైన పేర్కొన్న వాటిని దృష్టిలో ఉంచుకుని, ఎబిసిఎల్ వెబ్‌సైట్ యొక్క హైపర్‌లింక్‌లో పేర్కొన్న రుణగ్రహీతలు, ఈ నోటీసు అందిన 21 రోజుల్లోపు, ఆర్‌బిఐ మాస్టర్ డైరెక్షన్స్ ఆన్ ఫ్రాడ్ రిస్క్ మేనేజ్‌మెంట్ ఇన్ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (NBFCలు) (హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలతో సహా) ప్రకారం, డాక్యుమెంటరీ ప్రూఫ్‌తో కూడిన వ్రాతపూర్వక వివరణను అందించాలని కోరుతున్నాము. తేదీ 15.07.2024 నంబరు RBI/DOS/2024-25/120 DOS. CO. FMG. SEC. నం.7/23.04.001/2024-25.

నిర్ణీత సమయ వ్యవధిలోపు మీరు ఈ నోటీసుకు ప్రతిస్పందించడంలో విఫలమైతే, మీకు సరైన వివరణ లేదని మేము భావిస్తాము మరియు మీకు వ్యతిరేకంగా అవసరమైన చట్టపరమైన చర్యలను ప్రారంభించడంలో మేము ముందుకు వెళ్తాము, ఇందులో చట్ట అమలు అధికారుల ముందు అధికారిక ఫిర్యాదును దాఖలు చేయడం మరియు మీ ఖాతా మోసపూర్వకమైనదని ప్రకటిస్తామని తెలియపరుస్తున్నాము.

చట్టపరమైన పరిణామాలను నివారించడానికి దయచేసి ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించండి.

**ఆదిత్య బిర్లా క్యాపిటల్ లి. తరపున**
**సంతకం/-**
సంతకం చేయడానికి అధీకృతం చేయబడిన వారు

ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
ప్రచురించే తేదీ : 30 జూన్ 2025

వార్త

కసరత్తు శరీరానికి పటుత్వం కలిగిస్తుంది,
చదవడం మనస్సును పదును పెడుతుంది.

-ఆర్.స్టీలీ

# 'కట్టు' తప్పుతున్న యువత

దేశ కాలమాన పరిస్థితులు మారుతున్నాయి. సమాజం వికృత పోకడలు పోతోంది. పెడ ధోరణులు పెరుగుతున్నాయి. కట్టుబాట్లు కట్టలు తెంచుకుంటున్నాయి. ఎవరూ చట్టాన్ని లెక్క చేయడం లేదు. అయితే ఏమవుతుందిలే అనే ధోరణిలో ఆలోచిస్తున్నారు. చిన్ననాడు అమ్మ ఉగ్గుపాలతో నేర్పాల్సినవి నేర్పలేదనా, అమ్మమ్మ చెప్పే పేదరాశి పెద్దమ్మ కథలు వినిపించలేదనా..ఇవన్నీ కావు. రామాయణం, మహాభారతాల వంటి ఇతిహాసాల బోధనా వారికి బోధపడలేదనుకుందామా! ఎక్కడో 'గతి' తప్పుతోంది. దానికి కారణం కొత్తగా దశాబ్దకాలంగా చిట్టి చిట్టి చేతుల్లో వీర విజృంభణ చేస్తున్న స్మార్ట్‌ఫోన్‌లు చెడుగాడుతున్నాయనుకోవాలో అర్థంకాని పరిస్థితి. ఇక ఎక్కడ పడితే అక్కడ వారి వావి వరసలు, వయోబేధాలు లేని అసహజ కామోద్వేగాలు కూడా వినటానికే జుగుప్సాకరంగా ఉన్నాయి. ఇష్టం లేని పెళ్లిళ్లు కష్టంగా కాపురాలు.. ఆపై విడాకులు. ఇప్పుడా పరిస్థితిదాటి పోయిందని నిన్నమొన్నటి మేఘాలయలో ఇష్టం లేని పెళ్లి చేసుకుని ప్రియుడి ద్వారా సుపారీ గ్యాంగ్‌తో భర్తను చంపించిన వీరోచిత కార్యంగా భావించిన భార్య ఉదంతం విన్నాం. అక్రమ సంబంధాన్ని వారిస్తున్నా, పరాయి మగాడితో ఫోనులో పరాచిక సంభాషణ చేస్తున్నందుకు మందలించిన భర్తను ప్రియుడితో కలిసి హత్య చేయించిన భార్య నిర్వాకాన్ని తెలుసుకున్నాం. పిల్లలున్నా, భర్తతో కొన్నేళ్లు కాపురం చేసినా ఎందుకో కొందరిలో భర్తలంటే భార్యలకు ఏవగింపు కలుగుతోందని అర్థం చేసుకోవాలా? అనురాగానికి అర్థం తెలుసుకోలేకపోతున్నారనుకోవాలా? తెలియని పరిస్థితి. వివాహమర్యాదలు, కట్టుబాట్లు మరచి వివాహేతర సంబంధాలతో కాపురాలు కూల్చుకునేవారిని చూశాం. తాజాగా ప్రియుడి మోజులో వివాహితలే భర్తను ముట్టుపెట్టే వ్యూహాలు, కుట్రలు, కూహకాలు పన్నుతున్నారు. ఇన్‌స్టాగ్రాం, పరిచయాలు, వాట్సాప్ సంభాషణలుయువతలో అధికమ య్యాయి. ముక్కుమొహం తెలియని వారితో ప్రేమాయణాలు మంచివి కాదని చెప్పేతల్లుల్నే ద్వేషిస్తున్న యువ తుల్ని చూస్తున్నాం. నిన్నగాక మొన్న ప్రేమకు అడ్డొస్తోం దని తల్లిపై పగపెంచుకున్న ఓ కూతురు తల్లిని అన్యా యంగా చంపేసింది. ఇటీవల జరిగిన ఎన్నో ఉదంతాలు తీరుతెన్నులు చూస్తే ఇలాకూడా ఉంటాయా అనిపిస్తుంది. తల్లిని చిన్ననాటి నుంచే ద్వేషించి చివరకు తన ప్రియుడితో చంపించిన ఈ కేసులో చెల్లెలు దిక్కులేనిదయ్యింది. రెండు కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి. ఆ కుటుంబాల్లో చిన్నవాళ్లే బయట మిగిలారు. నేరస్థులు జువెనైల్ హోమ్‌కు. ఇదేదో సినిమాలో చూసినట్లుందే అనే సంఘటనలు సమాజ వైపరీత్యాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. నవమాసాలు కనిపెంచి పోషించిన కన్నతల్లిని ఇంటి నుంచి బయటకు పంపేసిన కొడుకులు తల్లి ఆగ్రహాన్ని చవిచూస్తారు. వృద్ధాప్య జీవితంలో ఇలాంటి పరిస్థితి తలెత్తిన తల్లిదండ్రుల కోసం వచ్చిన కొత్త చట్టం కాస్త మేలు చేస్తోంది. కథలా బయటకు వస్తున్నాయి. తండ్రి ఆస్తి పంచలేదని అతని అంత్యక్రియలకు ససేమిరా అన్న ఆపిన కొడుకు ఘాతుక నిర్ణయం వెల్లడైంది. కూతుర్ల ప్రవర్తన నచ్చలేదని కోట్లాది రూపాయల ఆస్తిని ఆలయానికి దస్తావేజులో అందచేసిన తండ్రి వ్యధ కూడా బయటకొచ్చింది. ఏనాడో మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలని తత్వవేత్త అరిస్టాటిల్ చెప్పిన విషయాలు ఇప్పుడు నిజమేననిపిస్తోంది. కనిపెంచి పోషించిన తల్లిదండ్రులను చెత్తకుప్పల పాలుచేయడం సభ్యసమాజం హర్షించదు. కానీ ఎందుచేతనో ఇలాంటి ఉదంతాలు ఎక్కువగానే ఉన్నాయంటే రక్తసంబంధాలో ప్రేమాప్యాయతలు, ఆదరాభిమానాల విషయమై ఎంతో మార్పు వస్తోందన్నమాట. పెళ్లిళ్ల సమయంలో ఎంతో ఆనందంగా కనపడిన ఓ నవ వధువు తీరా శోభనం గదిలోకెళ్లాక, తాను వేరొకరిని ప్రేమిస్తున్నానని తనను తాకితే 35 ముక్కలవుతావని తొలిరాత్రి భర్తకు భార్యవార్నింగ్ ఇచ్చిన వైనం మరీ అనైతికం. ఈ ఉదంతం ప్రయాగరాజ్‌లో జరిగినా యువతులు, వారి ప్రేమలు ఇష్టం లేని పెళ్లిళ్ల ఎంతవరకు దిగజారుతాయో అర్థమౌతుంది. ఈఉదంతాన్ని పరకాయిస్తే ఐదు దశాబ్దాల నాడు ఒక భావకవి రచించిన 'నేలతో నీడ అన్నది నను తాకరాదని..నేడుభర్తనే తాకరాదని ఒకభార్య అన్నది' అన్న పాటలో పల్లవి గుర్తొస్తోంది. అంటే దాదాపుయాభై ఏళ్లనాడే ఇలాంటి పట్టింపుల గురించి ఊహించారని దానర్థం. ఇవన్నీ ఇలా ఉంటే కొత్తగా చాన్నాళ్లు కాపురం చేసి భార్యకోరిక మన్నించి ఆమెకు తన ప్రియునితో వివాహబంధాలు వేయించి త్యాగజీవులగా మారిపోతున్న భర్తలూ ఉంటారని ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయి. కాన్పూర్ సమీపంలోని భగ్గనివాడ గ్రామంలో పదిహేనేళ్లు కాపురం చేసిన తన భార్యకు వేరొకరికతో వివాహేతర సంబంధం ఉందని తెలిసి ఆమె ఇష్టానుసారం ఆ ప్రియుడితోనే వివాహం జరిపించాడో భర్త..ఇలా యువతీ యువకుల్లో కొత్త తరహా ఆలోచనలు పుట్టుకు రావడాన్ని కాల మహిమ అనుకుందామా! కలిగయుగమంటే ఇంతేమరి అని సరిపెట్టుకుందామా? తేల్చుకోలేని పరిస్థితి, సంస్కృతి సంప్రదాయాలంటూ కట్టుబాట్లను పట్టుకుని వేళ్లాడే భారతీయులకు ఎంతకష్టమొచ్చిందో! కాలానుగతిన ఎన్ని మార్పులు వస్తాయో ఎవరికీ తెలియదు. ఇప్పుడు వింటున్నదీ కంటున్నదీ అరుదైన ఉదంతాలుగా చెప్పుకుంటున్నా నేరాలకు పాల్పడే ఆత్మీయ సంబంధాలను వదిలిపెట్టేసి సమాజపు కట్టుబాటులను పక్కన బెడుతున్న సంఘటనలు, సందర్భాలు ఉదంతాలు జరగకుండా చిన్న వయసులోనే యువతీయువకులకు మానసిక విశ్లేషణ చేయించి ముందస్తు కౌన్సిలింగ్ చేయించడం అవసరమే మరి.

శారీరక సౌందర్యం ఎంత ఉన్నా,
హృదయ సౌందర్యం లేకపోతే
అదంతా వ్యర్థమే!



వివేకానందుడు

ఇంద్రియపరమైన
విషయాలతో ఎంతగా మనిషి
తెగతెంపులు చేసుకుంటాడో,
అంతగా అతడు భగవంతుని
పట్ల ఆకర్షితుడవుతాడు.



రమణ మహర్షి

## ప్రజావాక్కు



### అంతరిక్ష చరిత్రలో మరో మైలురాయి

భారతఅంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), అమెరికా అంతరిక్ష సంస్థ(నాసా), ఐరోపాఅంతరిక్ష సంస్థలు భాగస్వామ్యం వహించగా, వేర్వేరు కారణాల వల్ల అనేక సార్లు వాయిదా పడి ఎట్టకేలకు భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసీ యాత్రకు బయల్దేరారు. 41 సంవత్సరాల తర్వాత రాకేష్ శర్మ తర్వాత అంతరిక్షంలో అడుగుపెట్టనున్న రెండో భారతీయుడుగా, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న తొలి భారతీయుడుగా శుభాంశు శుక్లా రికార్డుల కెక్కనున్నారు. అంతరిక్షయాత్ర కేవలంఒక సాహసం మాత్రమేకాదు, ఇది శాస్త్ర, సాంకేతికరంగాల్లో ముందడుగు వేసే ఒక గొప్ప ప్రయోగం. భూమికి వెలుపల జీవనం సాధ్యమా? అనే ప్రశ్నకు సమాధానం వెతికే ప్రయత్నం కూడా అంతరిక్ష ప్రయాణంలో భాగమే.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### భద్రతను బలోపేతం చేయాలి

ఒడిషా గోపాలపురం బీచ్‌లోఇటీవల చోటుచేసుకున్న హేయమైన సామూహిక లైంగిక దాడి ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో కలవరపెట్టింది. ఈ నేపథ్యంలో ఒడిషా ప్రభుత్వం ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో భద్రతను బలోపేతం చేయాలని తీసుకున్న నిర్ణయం సమయోచితమైనది, అవసరమైనదిగా పేర్కొనాలి. పర్యాటక ప్రాంతాలు విదేశీ పర్యాటకులు, కుటుంబాలు, ఒంటరిగా ప్రయాణించే మహిళలు వంటి వేలాది మందిని ఆకర్షిస్తాయి. వీరి భద్రత కేవలం శాంతిభద్రతల సమస్య మాత్రమే కాకుండా, దేశ పర్యాటక రంగ ప్రతిష్ఠకు సంబంధించిన అంశం కూడా. గోపాలపురం లాంటి సంఘటనలు పర్యాటకులలో భయం, అనుమానాలను కలిగించి, దేశ పర్యాటక సామర్థ్యాన్ని తీవ్రమైనంగా దెబ్బతీస్తాయి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### చట్టాల అమలుపై దృష్టి పెట్టాలి

దేశంలోనిమూలవాసులు ఇవ్వాళ అస్తిత్వపరీక్షను ఎదురుకొంటున్నారు. తూర్పు మధ్య భారతాల్లో విస్తరించిన ఆదివాసులకు తమ వనరుల కోసం తమ జీవిక కోసం కూడా పోరాటం చేయవలసివస్తుంది. ఇది ఎంతమాత్రం ఆమోదనీయంకాదు. ఆదివాసుల కాళ్ళకింద ఉన్నకోట్ల విలువైన నిక్షేపాలపైనమాత్రమే ప్రభుత్వాలు దృష్టిపెడుతున్నాయి .

- భారత అవినాష్, ముత్తరాం

### ఉపాధ్యాయులపై ఒత్తిడి వద్దు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి విపరీతమైన ఒత్తిడి పెరిగిపోయింది. గతవారం రోజులుగా అటెండెన్స్‌లో గ్రేస్ పీరియడ్ కూడా తీసివేసినట్లుగా సమాచారం. ఉదయం 9గంటలు దాటిన తర్వాత ఫెసియల్ అటెండెన్స్ ఉపాధ్యాయులు వేసినప్పటికీ మండలవిద్యాశాఖ అధికారులు కార్యాలయాల నుంచి ఆబ్సెంట్ అని మెసేజ్‌లు వస్తుండటంతో ఉపాధ్యాయులు బెంబేలెత్తిపోతున్నారు. విద్యాశాఖ అధికారులు మానిటరింగ్ చేస్తూ ఉపాధ్యాయుల ఫేషియల్ అటెండెన్స్ ఉదయం9గంటలలోపు వేయాలని ఉపాధ్యాయులపై తీసుకొచ్చిన ఈ అసమంజస అమానుష ఒత్తిడి తగ్గించాలి. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉపాధ్యాయులు పని చేసుకునే అవకాశం కల్పించాలి. ఈవిధంగా ఉపాధ్యాయులను తీవ్రఒత్తిడి, ఒడిదుడుకులకు గురి చేయకుండా విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం వాతావరణంలో పని చేసుకునే అవకాశం కల్పించాలి.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### పైచేయి కాదు శాంతే ముఖ్యం

విజయంఎవరిదైనా గొప్పలుపోరాదు. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఆహ్వానించదగినదే. ఇరాన్ సుప్రీం నేత ఖోమేని వ్యాఖ్య నించడం అతని స్థాయికి తగ్గట్లు లేదు. మేము అమెరికా పై విజయం సాధించామని చెప్పడం, మా దెబ్బకు అమెరికానే ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ చేయించింది. ఈ సందర్భంగాఖోమేని ఇజ్రాయెల్‌పై మేమువిజయం సాధించాం. ఇజ్రాయెల్‌మాదాడితో తీవ్రంగా నష్టపోయినందువల్లే అమెరికా ఇజ్రాయెల్‌కు నచ్చ జెప్పింది అనే భోగట్టా. నెతన్యాహూకు మా బలం ఏమిటో తెలిసివచ్చింది. అందుకే అమెరికా మెత్తబడింది. అమెరికా ను కూడా మేము నష్ట పరిచాం అని చెప్పడం, పశ్చిమ ఆసియాలో అమెరికాకు తీవ్ర నష్టం కలిగించాం.

- కనుమ ఎల్లారెడ్డి, హైదరాబాద్

### రీడర్ అలవెన్సు పెంచాలి

అంధలెక్చరర్స్, టీచర్స్ గురుకులాలలో, ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు బోధన చేయడంలో, సహాయకుల అవసరతఎక్కువగా ఉంటుంది. సూక్ష్మఅక్షరాలు, కంప్యూటర్ క్లాసులు, టీచింగ్ డైరీ రాయడం, హౌస్‌మాస్టర్ డ్యూటీలు, నైట్ స్టడీలు చేయడం ఇబ్బందికరంగా ఉంటుంది. సహాయకులకు ఇచ్చే ఆర్థిక సహాయం రీడర్ అలవెన్స్.

-రాపాక రవీందర్, జనగాం

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# యుద్ధాలతో నలిగిపోతున్నది సామాన్య జనాలే!

*ప్రపంచ వ్యాప్తంగా దేశ ప్రజల్లో అణు యుద్ధం భయం లేకపోలేదు. కనిపించని కరోనా వైరస్ ప్రపంచాన్ని కుదిపి వేసినప్పటికీ అంతకంటే ఘోరంగా మతోన్మాదం పేరిట సర్వసాధనమైన మనుషులను పొట్టన పెట్టుకుంటున్నటువంటి యుద్ధాలు ఎవరికి ప్రయోజనం లేదు. గతంలో రాజ్య విస్తరణ కోసం అనేక యుద్ధాలు జరిగిన సంఘటనలు విదితమే కానీ నేటి ఆధునిక యుగంలో మతవాదం అనే ఒక అంశంపై యుద్ధనీతికీ అజ్ఞానపు మతహింసకు అశాంతి అలజడుకు ఆజ్యం పోస్తున్నట్లు గోచరిస్తుంది. ఏదేమైనాప్పటికీ మతం అనేది మనిషి మనుగడ కొరకు శాంతి జీవనాలకు ఆదర్శవంతమైన మానవతా విలువలకు ప్రతిబింబంవలే ఉంటుందే తప్ప ప్రపంచంలో ఎక్కడా కూడా మతహింసకు తావిచ్చే విధంగా ఏ మత గ్రంథం రచింపబడలేదని అందరూ గ్రహించాలి.*

దాడిశెట్టి శ్యామ్ కుమార్

దక్షిణాసియా ఖండంలో ఇజ్రాయిల్ పాలస్తీనాలోని హమాస్ మధ్య జరిగిన అంతర్గత యుద్ధంలో ప్రాణ నష్టం అధికంగా జరిగినప్పటికీ, ఇజ్రాయిల్ అక్కడితో ఆగిపోకుండా హమాస్ ఉగ్రవాద సంస్థగా పరిగణించి దానికి ఇరాన్ దేశ ప్రభుత్వం మద్దతుగా నిలుస్తుందని భావించి ఇజ్రాయిల్ ఇరాన్ సైనిక స్థావరాలపై దాడులు చేసింది. అంతేకాకుండా తమకు ఇరాన్ దేశంతో అణు ముప్పు ఉన్నదన్న సమాచారంతో ఏకంగా ఇరాన్‌లో అణు స్థావరాలని చెప్పుతున్న ప్రాంతంలో దాడులు కొనసాగించింది. ఇంకే ముంది ఇరాన్ మాత్రం తామేం తక్కువ కాదని ఇజ్రాయిల్ పై ప్రతిదాడికి దిగింది. కానీ ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే యుద్ధంలో వాడే హానికరమైన ఆయుధాలతో ఆయా దేశాల్లోని మామూలు జనాల దైనందిన జీవితాలు అస్తవ్యస్తమై, బ్రతికిన చోట ఉండలేక ప్రాణం గుప్పిట్లో పెట్టుకుని వేరే ప్రాంతానికి వలసలుగా వెళ్లిపోతుండడం బాధాకరం. మతోన్మాద యుద్ధాలలో చేతుల్లో బలి అయిపోతుండడం శోచనీయం. సాధారణంగా ఏ దేశంలోని ప్రజలైన యుద్ధాన్ని ఆకాంక్షించరు. మతోన్మాదానికి దాదాపుగా ఎవరు మక్కువ చూపరు వత్తాసు పలకరు. మితిమీరిన మతోన్మాద ప్రభుత్వాలు ఉన్నటువంటి దేశాల్లో మతం కొరకు మారణ హోమాన్ని సృష్టించుట ఎంతవరకు సమంజసం అనే వాదనలు వినిపిస్తున్నాయి. చరిత్రలో రాజ్య విస్తరణకు రాజ్యాల మధ్య జరిగిన యుద్ధ సంఘటనలను గురించి విన్నాం, కానీ మతోన్మాదంతో పెనవేసుకుపోయిన ఉగ్రవాద జాడలనువారి వల్ల బలైపోతున్న జనాలను చూస్తుంటే మనసు తరుక్కుపోతుంటుంది. మితిమీరిన మతాభిమానంతో జరిగిన నష్టాలను ఆధునిక ప్రపంచంలో దేశాలు గ్రహిస్తున్న ఇలాంటి కొన్ని దేశాలు దేశంలోని జీవన విధానాలపై ప్రజల శ్రేయస్సు కొరకు ఆలోచించకుండా మతమే ముఖ్యమైనది అన్నట్లు ఇలాంటి యుద్ధాలకు కొంతమంది పాలకులు ఆజ్యం పోస్తుంటారా అనే సందేహాలు కలుగక మానవు. మతాలేవీ మతాధిపత్యం గురించి మతం గురించి కొట్లాడుకోమని ఎక్కడాచెప్పలేదు. మతాలను గౌరవించుకొని భిన్న సంస్కృతుల్లో మానవ జీవ మనుగడ శాంతియుతంగా జరగాలని ఏ మతమైనా నొక్కి వక్కాణిస్తుంది. అలాంటి వాటిని వదిలేసి నేటి ఆధునిక యుగంలో మితిమీరిన మతాభి మానంతో మతోన్మాదం వృద్ధి చెంది ఉగ్రవాదంగా మారిపోవడం ప్రస్తుత ప్రపంచ దేశాల్లో జరుగుతున్న యుద్ధాలను చూస్తే సందేహాలు కలుగక మానవు. ఆధునిక యుగంలో అధునాతన ఆయుధ సంపత్తి కలిగిన అగ్ర దేశమైన అమెరికా కూడా పెద్దతరహా లేకుండా మతోన్మాదంతో యుద్ధాలు చేసుకుంటున్న దేశాల మధ్య శాంతి మార్గాన్ని సూచించాల్సింది పోయి ఏకంగా మత యుద్ధాలను ప్రేరేపించే విధంగా ఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్ అణు స్థావరా



లపై దాడి చేయడం ముస్లింలు, యూదుల, అరబ్బుల మధ్య ఇంకా ఎక్కువ తీవ్ర ఘర్షణలకు తావిచ్చేటట్లు ఉంటున్నాయి అనే అనుమానాలు కలగక మానవు. ఆయుధాలను కేవలం తమ ఆత్మరక్షణ విషయాల్లో అవసరమైతేనే ఉపయోగించే తీరుండాలి. అలాంటి అధునాతన ఆయుధాలు ఉగ్రవాదుల చేతుల్లోకి చేరిపోతే ఇంకేముంటుంది ప్రపంచ వినాశనం తప్ప. ముఖ్యంగా దక్షిణ ఆసియా అశాంతికి నిలయంగా మారాలన్న కుట్రలు కనీ కనబడనట్టు గోచరిస్తూనే ఉంది. అమెరికా లాంటి యూరప్ దేశాలు యూరప్ ఖండాన్ని శాంతియుతంగా ఉండాలని ఆసియా ఖండంలో వీలైనప్పుడల్లా దేశాల మధ్య అస్థిరత పరచాలన్నది నైజాం కావచ్చు అనే భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో ముందుంటున్నామన్న దురహంకారంతో అమెరికా లాంటి దేశం తనకు అనుకూలంగా లేని దేశాలను సామవేద దండోపాయంతో బెదిరించడం ప్రపంచ దేశాలు గమనించాల్సందే అనే భిన్న వాదనలు ఉన్నాయి. పాకిస్థాన్ ఉగ్రవాదుల విషయంలో భారత్ తీసుకున్న నిర్ణయాల విషయంలోనూ అమెరికా తల దూర్చింది. కానీ సంధి కుదిరిచినట్టు ప్రగల్బాలు పలికింది. ఏకంగా అమెరికా అధ్యక్షుడు ప్రపంచ శాంతి దూతగా ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తున్న దేశాలతోనే నోబుల్ శాంతి బహుమతి కొరకు మద్దతు కూడగట్టుకోవడం హాస్యాస్పదంగా అనిపించక మానదు. ఇజ్రాయిల్ ఇరాన్ మధ్య జరుగుతున్న పరస్పర మతాల సార్వభౌమత్వానికి జరుగుతున్న దాడుల్లో ఏకంగా అగ్రరాజ్యమే యుద్ధానికి దిగి బెదిరింపు ధోరణితో ఇరాన్ దేశాన్ని తన గుప్పిట్లో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్న అగ్రరాజ్యం దక్షిణాసియా ప్రాంతాల్లో సుస్థిరత లేకుండా కుటిల నీతిని ప్రదర్శిస్తుందా అనే సంశయం లేకపోలేదు. శాంతియుత మార్గంలో ప్రపంచ శాంతి మానవ మునగడే ధ్యేయంగా ఉండవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని యుద్ధాన్ని ఆకాంక్షించే వారికి అర్థంకావలసి ఉంది. ఆధునిక ప్రపంచంలో మూర్ఖంగా అజ్ఞాన విహీనులైనట్లు కేవలం మతాధిపత్యం కొరకు ఏకంగా అణు ఆయుధాలతో యుద్ధం చేస్తామనడం ఏ దేశానికి సరైన విధానం కాదు. మత యుద్ధాలకు తావిచ్చే సందర్భంలో మతోన్మాద శత్రు చేతిలో అణుఆయుధాలు అత్యంత ప్రమాదకరమైనవి. ఆధునిక యుగంలో మితిమీరిన మతాభిమానంతో వికృత చేష్టలతో, అణుబాంబులతో విరుచుకుపడుతామనడం సరైన విధానం కాదని ప్రజల శ్రేయస్సును కోరేపాలకులు గ్రహించాలి. అణు సంపత్తిని సమకూర్చుకున్న అనేక దేశాలుఅణు బాంబులు తమ దేశప్రయోజనాల కోసం అంటున్న ప్రపంచ వ్యాప్తంగా దేశ ప్రజల్లో అణు యుద్ధం భయం లేకపోలేదు. కనిపించని కరోనా వైరస్ ప్రపంచాన్ని కుదిపి వేసినప్పటికీ అంతకంటే ఘోరంగా మతోన్మాదం పేరిట సర్వసాధనమైన మనుషులను పొట్టన పెట్టుకుంటున్నటువంటి యుద్ధాలు ఎవరికి ప్రయోజనం లేదు. గతంలో రాజ్య విస్తరణ కోసం అనేక యుద్ధాలు జరిగిన సంఘటనలు విదితమే కానీ నేటి ఆధునిక యుగంలో మతవాదం అనే ఒక అంశంపై యుద్ధ నీతికీ అజ్ఞానపు మతహింసకు అశాంతి అలజడుకు ఆజ్యం పోస్తున్నట్లు గోచరిస్తుంది. ఏదేమైనాప్పటికీ మతం అనేది మనిషి మనుగడ కొరకు శాంతి జీవనాలకు ఆదర్శవంతమైన మానవతా విలువలకు ప్రతిబింబంవలే ఉంటుందేతప్పప్రపంచంలో ఎక్కడా కూడా మత హింసకు తావిచ్చే విధంగా ఏ మత గ్రంథం రచింపబడలేదని అందరూ గ్రహించాలి. ●

# అన్నదాతలను ఆదుకునేవారే లేరా?

మేకిరి దామోదర్

రైతు లేనిదే రాజ్యం లేదు, అన్నదాతలే దేశానికి వెన్నెముక. జై కిసాన్ అంటూ జేజేలు పలుకుతూ పల్లకి మోతలే, 'మాటలు కోటలు దాటుతున్నాయిచేతలు తంగేళ్లు దాటడం లేదు' అన్నట్లుగా ఉంది. నిజానికి రైతు శ్రమకు తగ్గ గుర్తింపు, గౌరవం ఇస్తున్నామా! అంటే లేదని చెప్పాల్సి వస్తుంది. ఎందుకంటే? మన దేశానికిస్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా వ్యవసాయ రంగం తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుంది. కానీ పారిశ్రామిక, సాంకేతిక, సేవారంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. జాతీయ స్థూల విలువ జోడింపు (జీవీఏ)లో వ్యవసాయం దాని అనుబంధ రంగాల వాటా తగ్గుతోంది. కృత్రిమ మేధ (ఏఐ)అన్ని రంగాల్లోనూ ప్రవేశించి ప్రగతి పరుగులు పెట్టిస్తుంటే!. వ్యవసాయరంగం "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే"అన్న చందంగా కునారిల్లుతుంది. రైతు ఆత్మహత్యలను ఆపలేకపోవడం పాలకుల లోపమా?, రైతుల శాపమా!. ఏది ఏమైనా బలిపీఠంపై ఉన్న సాగును బాగుపడేలా చేస్తూ, రైతును రాజును చేసే సంగతేమో కాని కనీసం ఆత్మహత్యలను నివారించాల్సి ఉందనేది కాదనలేని నిజం. అప్పుడే నేటి తరం యువత ఆ రంగంలోకి రాగలరు. ఈమధ్య రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కల్పించడం అభినందనీయమే. కానీ మన దేశంలో ఎక్కువ మందికి జీవనోపాధి కల్పించే సాగును, దాన్నే నమ్ముకున్న రైతాంగం బాగుపడ్డ రోజే వారి జీవితాల్లో నిజమైన ఆనందం. ఈ సంవత్సరం వర్షాలు జోరుగా కురుస్తాయని, రుతుపవనాలు ముందే వస్తాయని వాతావరణశాఖ చెప్పింది. అలానే జూన్ మొదట్లో రుతుపవనాలు వచ్చి తొలకరి కురిసి మురిపించింది. ఆ తర్వాత జూన్ నెల చివరకు వస్తున్నా ఆకాశం మేఘావృతమై ఉంటుందే కానీ వర్షాలు పడడం లేదు. తొలకరి వానలకు నాటిన పత్తి తదితర పంటల కోసం రైతులు నొసటిన చేయి పెట్టి ఆకాశం వైపు ఎదురుచూస్తున్న పరిస్థితులు ఇన్నేళ్లైనా మారనేలేదు. మన దేశంలో అన్నదాతలకు ఎంతో ముఖ్యమైన కాలమిది. జాతికి మెతుకునిచ్చి, బతుకు నిలిపే రైతన్న పుడమినే పుత్తడి (పులకింప)చేసి పూతలు పూయించి కాతలు కాయిస్తు, బురదను మలిచి బువ్వను చేసే పుణ్య పురుషుడు అన్నదాత.




తొలకరి వానలకు ముందుగా నాలుగు సార్లు దుక్కి దున్ని విత్తనాలు నాటుతారు. మొక్క మొలకెత్తింది మొదలు దానిని పసి బిడ్డను చూసినట్లు అపురూపంగా చూసుకుంటాడు. కలుపుతీస్తాడు, మందులు వేస్తాడు పంట చేతికందే సరికి అనావృష్టో లేదా అతివృష్టి వలనో ఆ పైరు ఎండిపోవడమో, కొట్టుకపోవడమో జరుగుతుంది. విత్తనాల ఖర్చులు కూడా తిరిగిరాని దయనీయస్థితి. వ్యవసాయం అంటే పండినా, పండకపోయినా రైతు నిరాశ చెందకుండా ముందుకే సాగుతాడు. ఈ పరిస్థితి ఈనాటిది కాదు? తరతరాలుగా తాత ముత్తాతల నుంచి చూస్తున్నారు. మన దేశంలో సాగు రంగంలో దండు! పండుగ రెండూ ఉంటాయి. ఈ రంగంలో ఒక ఏడు పండితే? మరో ఏడు పండదు. అయినా పండలేదని రైతు కాడిమేడి వదిలేస్తే!. అందరికీ ఆహారం ఎలా?. ప్రకృతి విపత్తులకు తోడు పాలకుల ఉదాసీనత, వ్యాపా(దళా)రుల దోపిడీ నాసిరకం విత్తనాలు, నకిలీ పురుగుమందులు, నాణ్యతలేని ఎరువులు ఇలా అనేక విధాలుగా అష్టకష్టాలైనా అనుభవిస్తూ, అధిగమిస్తూ పంట పండిస్తాడు. చివరకు పండిన పంట అమ్ముకునే నాటికి గిట్టుబాటు (మద్దతు) ధర ఉండదు. అలా అని రైతు నిరాశకు, నిస్పృహకులోనైతే మనం బతికేదెలా! రైతులను ప్రకృతి, పాలకులు, వ్యాపారులు దగా చేస్తున్నా వ్యవసాయాన్ని వదులుకోడు. కాడిదించే ప్రసక్తే లేదు. రేయింబవళ్లు ఎండా వానా ఏదైనా సరేనిత్యం పుడమి తల్లిని, వ్యవసాయాన్ని నమ్ముకొని అదే పని చేస్తుంటాడు. వారి శ్రమ వెలకట్టలేనిది. "సూర్యుడైనా మబ్బుల చాటుకెళ్లి కాసేపు విశ్రాంతి తీసుకుంటాడేమో' కానీ రైతు మాత్రం అవిశ్రాంతంగా దేశానికి పట్టెడు అన్నం పెట్టడం కోసం ఫలితం మీద ధ్యాస లేకుండా పోరాడుతూనే ఉంటాడు. దళా(వ్యాపా)రుల దోపిడీ నుంచి విముక్తి కలిగించి, పంటకు గిట్టుబాటు(మద్దతు)ధర కల్పించిన నాడే ఈ తరం యువత వ్యవసాయం వైపు మళ్లుతారు. పట్టణాలకు వలస నివారించబడుతోంది. దేశసౌభాగ్యానికి పునాది రాళ్లయిన అన్నదాతలు చల్లగా ఉంటేనే మన కడుపు చల్లగా ఉంటుంది. ఈ దేశంలో సాగు రంగాన్ని తరతరాలుగా పట్టిపీడిస్తున్న ఆత్మహత్యల సామాజిక రుగ్మతను తరిమి వేయాల్సిన బాధ్యత ముమ్మాటికి ప్రభుత్వాలదే. ఇదంతా రైతుకు చేయాల్సిన అందరి కనీస బాధ్యత. పాలకులు, పాలితులు ఏమిచ్చినా రైతు రుణం తీర్చుకోలేరు. సాగునే నమ్ముకున్న అన్నదాతల ఆత్మహత్యలు నివారించబడి, వారి జీవితాల్లో వెలుగులు నింపిన రోజే నిజమైన పండుగ. ●

# ఇ- పాస్‌పోర్ట్‌తో ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ సులభతరం

యేచన్ చంద్రశేఖర్

భారత ఉపఖండంలో, ప్రయాణ పత్రాల ప్రస్తావన మౌర్యుల కాలంలో ఉన్నప్పటికీ అది నేటి విధానానికి భిన్నంగా ఉండేది. ఆ రోజుల్లో పాస్‌పోర్ట్‌ల స్థానంలో అధికారిక పత్రాలు, సురక్షిత ప్రవర్తన లేఖలు ఉపయోగించబడ్డాయి. మొదటి ప్రపంచ యుద్ధానంతరం బ్రిటిష్ ఇండియాలో పాస్‌పోర్ట్‌లను ప్రవేశపెట్టారు. 1920లో అమలులోకి వచ్చిన ఇండియన్ పాస్‌పోర్ట్ చట్టం, విదేశీయానం చేసే భారతీయులు భారతదేశం సందర్శించే విదేశీయులకు పాస్‌పోర్ట్‌లను తప్పనిసరి చేసింది. బ్రిటిష్ ఇండియన్ పాస్‌పోర్ట్ 1920 లీగ్ ఆఫ్‌నేషన్స్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ పాస్‌పోర్ట్స్ ఆమోదిత నమూనా ఆధారంగా రూపొందించబడింది. ప్రారంభంలో పాస్‌పోర్ట్‌లు బ్రిటిష్ సామ్రాజ్యం ఇతర నిర్దిష్ట ప్రాంతాలలో ప్రయాణించేలా పరిమిత వినియోగాన్ని కలిగి ఉండేవి. అప్పట్లో, పాస్‌పోర్ట్‌లు అక్షరాస్యత పరీక్ష ఆధారంగా గౌరవనీయమైన వ్యక్తులకు మాత్రమే మంజూరు చేయబడేవి. అంతేకాదు, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా సభ్యులకు పాస్‌పోర్ట్‌లు నిరాకరించబడేవి. భారత రాజ్యాంగం ప్రకారం పాస్‌పోర్ట్ జారీ కేంద్ర అంశం" అయినప్పటికీ, 1954 వరకు ఈ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించబడింది. మొదటి ఐదు ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయాలు ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, నాగ్‌పూర్‌లలో స్థాపించబడ్డాయి. 1959లో సెంట్రల్ పాస్‌పోర్ట్ ఎమిగ్రేషన్ ఆర్గనైజేషన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధీన కార్యాలయంగా ఏర్పాటు కాగా, 1967లో పార్లమెంట్ పాస్‌పోర్ట్‌ల చట్టాన్ని అమలు చేసింది. భారతదేశంలో 2001లో యంత్రం చదవగలిగే (మెషిన్ రీడబుల్) పాస్‌పోర్ట్‌లనుప్రవేశపెట్టే వరకు కూడా చేతితో రాసిన పాస్‌పోర్ట్‌లు జారీ చేయబడేవి. భారతదేశంలో 37 ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయాలు 93 పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలతోపాటు 424 పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలున్నాయి. ఇవి కాకుండా విదేశాలలో 197 భారతీయ మిషన్లు పోస్టుల నెట్‌వర్క్ ద్వారా భారతీయ పౌరులకు పాస్‌పోర్ట్‌లను జారీ చేయడానికి విదేశాంగ మంత్రిత్వశాఖ బాధ్యత వహిస్తుంది. భారతీయులకు అంతర్జాతీయ ప్రయాణానుభవాన్ని సులభతరం చేయడం, జాతీయ భద్రతను బలోపేతం చేయడంతోపాటు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగాలనే లక్ష్యంతో భారత ప్రభుత్వం పాస్‌పోర్ట్ సేవా కార్యక్రమం వెర్షన్ 2.0లో భాగంగా ఏప్రిల్ 1, 2024న భారతదేశ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారికంగా ఈపాస్‌పోర్ట్‌ల జారీకి శ్రీకారం చుట్టింది. ఈపాస్‌పోర్ట్ కాగితం ఎలక్ట్రానిక్ పాస్‌పోర్ట్‌ల సమ్మిళితం. సాంప్రదాయ పాస్‌పోర్ట్‌లకు రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడి) చిప్ యాంటెన్నా పొందుపరచడం ద్వారా ఈపాస్‌పోర్ట్ రూపొందించబడింది. ఇది పాస్‌పోర్ట్‌దారు వేలిముద్రలు, ముఖచిత్రాలు వంటి బయోమెట్రిక్ సమాచారం, ఇతర వ్యక్తిగత వివరాలను నిల్వచేసి, మెరుగైన భద్రత క్రమబద్ధమైన వలసలకు ఆస్కారం కల్పిస్తుంది. పబ్లిక్ కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (పికెఐ) ఈపాస్‌పోర్ట్‌లోని సున్నితమైన సమాచారాన్ని రక్షించడంలో సహాయపడుతుంది. ప్రామాణీకరణ కోసం ఈ పాస్‌పోర్ట్‌లలో పాస్‌పోర్ట్‌దారు సమాచారం భౌతిక రూపంలో బుక్‌లెట్‌పై ముద్రించబడడమే కాకుండా ఎలక్ట్రానిక్ చిప్‌లో డిజిటల్ రూపంలో కూడా అందుబాటు




లో ఉంటుంది. దీనివలన నకిలీ పాస్‌పోర్ట్‌ల బెడదతోపాటు పాస్‌పోర్ట్‌లోని వివరాలను మార్పులు చేర్పులు చేసే అవకాశం పూర్తిగా సమసిపోతుంది. ఈపాస్‌పోర్ట్‌ను ముఖచిత్రం కింద ముద్రించిన చిన్న, బంగారు రంగు చిహ్నం ద్వారా సులభంగా గుర్తించవచ్చు. మొట్టమొదటగా నాగ్‌పూర్, భువనేశ్వర్, జమ్మూ, గోవా, సిమ్లా, రాయ్‌పూర్, అమృత్‌సర్, జైపూర్, చెన్నై, హైదరాబాద్, సూరత్, రాంచీ వంటి ఎంపిక చేసిన నగరాల్లో ప్రారంభమైన ఈపాస్‌పోర్ట్ జారీ ప్రక్రియ దశలవారీగా దేశవ్యాప్తంగా అమలు చేయబడుతోంది. 2025 మధ్యనాటికి దేశవ్యాప్తంగా ఈపాస్‌పోర్ట్‌లను అమలు చేయాలని విదేశాంగ మంత్రిత్వశాఖ యోచిస్తోంది. ఇక మీదట పాస్‌పోర్ట్ కోసం కొత్తగా వచ్చే దరఖాస్తులతో వాటితో పాటు రెన్యువల్ కోసం వచ్చే వారికి ఈపాస్‌పోర్ట్‌లను మాత్రమే జారీ చేయాలనీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇపాస్‌పోర్ట్ లేదా ఎలక్ట్రానిక్ పాస్‌పోర్ట్‌లో ఆటోమేటెడ్ గుర్తింపు ధృవీకరణ సౌలభ్యం ఉండడంతో ఇమ్మిగ్రేషన్ తనిఖీ ప్రక్రియ వేగవంతంగా జరపడానికి అవకాశం ఏర్పడుతుంది. అంతేకాదు, వేలిముద్రలు ముఖ గుర్తింపు వంటి బయోమెట్రిక్ సమాచారంతో సహా వ్యక్తిగత వివరాలు కలిగి ఉండడంతో మోసపూరిత ప్రయత్నాలను అరికడుతుంది. ఎలక్ట్రానిక్ పాస్‌పోర్ట్‌లో చిప్ పాస్‌పోర్ట్ ప్రామాణీకరణను తారుమారు చేస్తే అది పూర్తిగా విఫలమవుతుంది. సాధారణ పాస్‌పోర్ట్ లాగా కాకుండా ఇపాస్‌పోర్ట్ గల ప్రయాణీకులను అత్యంత వేగవంతంగా కేవలం కొన్ని సెకన్లలో స్కాన్ చేసే వెసులుబాటు ఉండడంతో తక్కువ సమయంలో ఎక్కువ మంది ప్రయాణీకుల ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను చేపట్టవచ్చు. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసిఏఒ) ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించబడడం ఇపాస్‌పోర్ట్ అతి ముఖ్యమైన సానుకులాంశం. దరఖాస్తుదారులు పాస్‌పోర్ట్ సేవా వెబ్‌సైట్ ద్వారా ప్రస్తుత ఆన్‌లైన్ విధానాన్ని అనుసరించవచ్చు. దరఖాస్తుదారులు ఈపాస్‌పోర్ట్‌లు అందుబాటులో ఉన్న నగరంలో కొత్త పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకున్నా లేదా పాత పాస్‌పోర్ట్‌ను రెన్యువల్ చేసుకోవాలనుకున్నా, వారు అప్‌గ్రేడ్ చేసిన వెర్షన్‌ను అందుకుంటారు. దేశవ్యాప్తంగా ఈపాస్‌పోర్ట్‌ల జారీ కోసం మౌలిక సదుపాయాలను విస్తరించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది. సాంప్రదాయ పాస్‌పోర్ట్‌లు వాటి గడువు తేదీ వరకు చెల్లుబాటులో ఉంటాయి కనుక ఇప్పటికే సాంప్రదాయ పాస్‌పోర్ట్ కలిగి కాలపరిమితి ఉన్న వారు వెంటనే ఈపాస్‌పోర్ట్‌కి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. అయితే, కొత్త దరఖాస్తుదారులు ఈపాస్‌పోర్ట్ అమలులో ఉన్న నగరాల్లో పునరుద్ధరణల కోసం దరఖాస్తు చేసుకునే వారు దరఖాస్తు ప్రక్రియలో భాగంగా ఈపాస్‌పోర్ట్‌లను పొందవచ్చు. పాస్‌పోర్ట్‌దారు గోప్యతను పెంచడానికి ఈపాస్‌పోర్ట్‌లలో ఇకపై పాస్‌పోర్ట్ చివరి పేజీలో నివాస చిరునామా ముద్రించబడదు కానీ చిరునామా సమాచారాన్ని డిజిటల్ రూపంలో (బార్‌కోడ్) నిల్వ చేయబడుతుంది. కేవలం అధీకృత వ్యక్తులు మాత్రమే ఈపాస్‌పోర్ట్‌లోని బార్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సమాచారాన్ని పొందగలుగుతారు. సాంప్రదాయ పాస్‌పోర్ట్‌లో ఉన్నట్లు ఈపాస్‌పోర్ట్‌లో తల్లిదండ్రులు లేదా చట్టపరమైన సంరక్షకుల పేర్లు ఇకపై చేర్చబడవు. భారతదేశం జారీ చేసే పాస్‌పోర్ట్‌లు ప్రధానంగా వాటి కవర్లరంగు ద్వారా వర్గీకరించబడతాయి. భారతదేశంలో అన్ని రకాల పాస్‌పోర్ట్‌లు 10సం॥ కాలపరిమితితో జారీ చేయబడతాయి. 15 సం॥ కంటే తక్కువవయస్సు ఉన్న మైనర్లకు జారీచేయబడే పాస్‌పోర్ట్‌లు 5 సం॥ లేదా వారు 18సం॥ నిండేవరకు మాత్రమే చెల్లుతాయి. 15-18సం॥ మధ్య వయస్సు గలమైనర్లు, 10 సంవత్సరాలు లేదా 18సం॥ నిండేవరకు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ●

# భారత్‌పై మరోసారి నోరుపారేసుకున్న పాకిస్థాన్

## ఆత్మాహుతి దాడికి భారతే కారణం: ఆర్మీ

**న్యూఢిల్లీ,జూన్ 29:** పాకిస్థాన్‌లోని వజీరిస్థాన్‌లో జరిగిన ఆత్మాహుతి కారు బాంబు దాడిపై దాయాది కారు కూతలు కూసింది. ఈ దాడికి ఘటనకు భారత్ కారణమంటూ ఆ దేశ ఆర్మీ నోరు పారేసుకుంది. అయితే ఈ ఆరోపణలను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్ ఆర్మీ చేసిన నిరాధారమైన ఆరోపణలు అని స్పష్టం చేసింది. వజీరిస్థాన్ దాడికి భారత్‌ను నిందించే పాకిస్థాన్ ఆర్మీ చేసిన ప్రకటనను మేం గమనించాం. అలాంటి నిరాధారమైన ఆరోపణలను మేం తీవ్రంగా ఖండిస్తున్నామని భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. ఈ ఆత్మాహుతి దాడిలో మొత్తం 16 మంది పాకిస్థాన్ సైనికులు ప్రాణాలు కోల్పోయారు. పేలుడు పదార్థాలున్న వాహనంతో ఉగ్రవాది ఉదయం సైనిక కాన్వాయ్ పైకి దూసుకెళ్లడం వల్ల భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 13మందిసైనికులు అక్కడికక్కడే మరణించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించగా




చికిత్స పొందుతూ, మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిలో పౌరులు, ప్రభుత్వ అధికారులు సహా 24 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పేలుడు తీవ్రతకు పక్కనే ఉన్న రెండు ఇళ్ల పైకప్పులు కూలిపోవడంతో ఆరుగురు పిల్లలు గాయపడినట్లు అధికారులు పేర్కొన్నారు. దాడిలో దాదాపు 800 కిలోల పేలుడు పదార్థాలు ఉపయోగించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు చెబుతున్నాయి. ఈ పేలుడు సైనిక కాన్వాయ్ లక్ష్యంగా జరగడం గమనార్హం. దాడి సమయంలో ఆ ప్రాంతంలో కర్ఫ్యూ అమలులో ఉన్నప్పటికీ ఈ ఘటన జరిగింది. మరోవైపు పాకిస్థాన్‌లోని తాలిబన్ హాఫీజ్ గుల్ బహదూర్ గ్రూపునకు చెందిన ఉసూద్‌అల్‌హర్బ్ ఈ దాడికి బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించింది. ఇది తహ్రీక్‌ఎ తాలిబాన్ పాకిస్థాన్‌లో ఒక విభాగం. ఈ గ్రూపు ఇప్పటికే పలు మార్లు పాకిస్థాన్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది. టీటీపీ అనేది పలు ఇస్లామిక్ మిలిటెంట్ గ్రూపుల సమాహారం. పాకిస్థాన్ ప్రభుత్వాన్ని కూలదోసి, తాము నమ్మే శరియత్ పాలనను స్థాపించడమే టీటీపీ లక్ష్యం. గతంలో పలు ప్రాణాంతక దాడులకు ఈ గ్రూపు బాధ్యత వహించింది. వజీరిస్థాన్ ప్రాంతమైన ఖైబర్ పఖ్తూన్‌ఖ్వాలో పలు నిషేధిత ఉగ్రవాద గ్రూపులు పనిచేస్తున్నాయి. ఈ గ్రూపులకు అఫ్ఘనిస్తాన్ ఆశ్రయం కల్పిస్తోందని పాక్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. అయితే కాబూల్ మాత్రం ఈ ఆరోపణలను ఖండిస్తోంది. ఇది 2019లో భారత్‌లో జరిగిన పుల్వామా దాడి మాదిరిగానే ఉంది. జైష్ మహ్మద్‌కు చెందిన ఆత్మాహుతి దాడిలో 40 మంది భారత జవాన్లు వీరమరణం పొందారు. ఇప్పుడు అదే పాకిస్థాన్ తమ స్వదేశంలో ఆ విధానంలోనే దాడికి గురైంది. దాదాపు అదే పద్ధతిలో పాకిస్థాన్ సైన్యంపై దాడి జరగడం గమనార్హం. మరోవైపు భారత్ అకారణంగా రెండు సార్లు పాకిస్థాన్‌పై దాడికి పాల్పడిందని ఆ దేశ ఆర్మీ చీఫ్ అసిం మునీర్ నోరుపారేసుకున్నారు. న్యూఢిల్లీకి వ్యూహాత్మక ముందుచూపు కొరవడిందన్నారు. ప్రాంతీయ ఉద్రిక్తతలను రెచ్చగొడుతోందని ఆరోపించారు. మళ్లీ తమపై దాడికి పాల్పడితే నిర్ణయాత్మకంగా ప్రతిస్పందిస్తామని మునీర్ హెచ్చరించారు. కరాచీలోని నేవల్ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మునీర్, ప్రాంతీయ స్థిరత్వాన్ని పాకిస్థాన్ కాపడుతోందన్నారు. భారత్ దుందుడుకు తనానికి పాల్పడితే తమ దేశం ప్రాంతీయశాంతిని దృష్టిలో పెట్టుకొని పరిపక్వంగా వ్యవహరించిందన్నారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా అణచివేసే స్థితిలో పాక్ ఉంటే భారత్ ఉద్రిక్తతలు సృష్టిస్తోందని వ్యాఖ్యానించారు. అంతకుముందు మునీర్ ఇలాంటి నిరాధార వ్యాఖ్యలే చేశారు. ఆర్మీ ఆఫీసర్స్ కామన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న ఆయన, భారత్ ఉగ్రవాదాన్ని పోషిస్తోందని వింత వ్యాఖ్యలు చేశారు. న్యూఢిల్లీ నెట్‌వర్క్‌కు అఫ్గానిస్థాన్ వేదికగా మారిందనీ, అఫ్గాన్ వాసులతో కలిసి పాక్‌లో దాడులు చేస్తోందని ఆరోపించారు. భారత్ పోషిస్తున్న ఉగ్రవాదులకు అఫ్గానిస్థాన్ వేదిక ఇవ్వకూడదని కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# హమాస్‌తో ఒప్పందం చేసుకోండి

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్, జూన్ 29:** గాజాలో జరుగుతున్న యుద్ధాన్ని వేగంగా ముగించి.. సంధి కుదుర్చుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్టు పెట్టారు. 'గాజాలో ఒప్పందం చేసుకోండి. బందీలను వెనక్కి తీసుకురండి' అని పేర్కొన్నారు. ఆయన గతంలో ప్రతిపాదించిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఆమోదించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై ఒత్తిడి తెచ్చినట్లయింది. గాజాలో వచ్చే వారం సంధి కుదురుతుందని ప్రకటించిన కొన్ని గంటల్లోనే మరోసారి సోషల్ మీడియాలో పోస్టు పెట్టడం గమనార్హం. నెతన్యాహుపై కేసులను వదిలేయాలని ఇజ్రాయెల్ ప్రాసిక్యూటర్లను అభ్యర్థించిన కొన్ని గంటల్లోనే ఈ పోస్టు పెట్టడం విశేషం. ఇజ్రాయెల్ ప్రధాని ప్రస్తుతం హమాస్‌తో చర్చలు జరుపుతున్నారని.. ఆ ఒప్పందం కుదిరితే బందీలు వెనక్కి వస్తారని ట్రంప్ పేర్కొన్నారు. గత బుధవారం ట్రంప్ సోషల్ మీడియాలో స్పందిస్తూ ఇజ్రాయెల్ ప్రధానిపై కేసులు కేవలం వేధింపులు అనే అర్థం వచ్చేట్లు పోస్టు పెట్టారు. ఇరాన్‌పై యుద్ధ సమయంలో అమెరికా అధ్యక్షుడి మద్దతుకు నెతన్యాహు ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల కాలంలో ఇజ్రాయెల్‌కు సహాయాన్ని కూడా అగ్రరాజ్యం గణనీయంగా పెంచింది. వాషింగ్టన్ నుంచి ప్రపంచంలో మరే దేశానికి అంత స్థాయిలో ఆర్థిక సాయం అందలేదు. అక్టోబరు 7వతేదీ హమాస్ ఇజ్రా యెల్‌పై దాడి చేసివందల మందిని హత్య చేసింది. 251 మందిని బందీలుగా పట్టుకు పోయింది. వీరిలో కొందరు ప్రాణాలు కోల్పోగా 49 మంది ఇప్పటికీ హమాస్ చెరలోనే ఉన్నట్లు భావిస్తున్నారు.

# హమాస్ సహ వ్యవస్థాపకుడు మఖమ్ మహ్మద్ ఇస్సా అల్ ఇస్సా హతం



**జెరూసలెం,జూన్ 29:** హమాస్, హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూపులపై వరుసబెట్టి దాడులు సాగిస్తూ వస్తోన్న ఇజ్రాయెల్ మరో పురోగతిని సాధించింది. హమాస్ సహ వ్యవస్థాపకుడు మఖమ్ మహ్మద్ ఇస్సా అల్ ఇస్సాను మట్టుబెట్టింది. గాజాపై నిర్వహించిన వైమానిక దాడుల్లో ఆయన మరణించినట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ అధికారికంగా ప్రకటించింది. హమాస్ శిబిరాలపై నిర్వహించిన మిస్సైళ్ల దాడుల సందర్భంగా మహ్మద్ హతమైనట్లు వెల్లడించింది. ఈ దాడుల్లో హతమైంది మఖమ్ మహ్మదేనని నిర్ధారించుకున్నట్లు వివరించింది. గాజా శివార్లలోని సబ్రాలో గల హమాస్ స్థావరాలపై వైమానిక దాడులను నిర్వహించింది ఇజ్రాయెల్. ఐడీఎఫ్ ఇజ్రాయెల్ సెక్యూరిటీ ఏజెన్సీ సంయుక్తంగా వీటిని చేపట్టాయి. హమాస్ స్థావరాలపై బాంబుల వర్షాన్ని కురిపించాయి. ఈ సందర్భంగా మిలిటెంట్ గ్రూప్ హమాస్ సహ వ్యవస్థాపకుడు మఖమ్ మహ్మద్ మరణించాడు. 2023 అక్టోబర్ 7వ తేదీన తమ దేశంపై హమాస్ నిర్వహించిన భయానక దాడులకు అతనే ప్రధాన సూత్రధారిని ఇజ్రాయెల్ ప్రకటించింది. అప్పటిదాడుల్లో 1,200 మందికి పైగా ఇజ్రాయెల్ పౌరులు మరణించారు. 250 మంది సరిహద్దు ప్రాంతాల ప్రజలను హమాస్ మిలిటెంట్లు కిడ్నాప్ చేశారు. ఇప్పటికీ 50 మందికి పైగా ఇజ్రాయెలీలు వారి చెరలో బందీలుగా ఉన్నారు. బందీల్లో 28 మంది మరణించి ఉండొచ్చని భావిస్తున్నారు. అలాంటి దాడికి మాస్టర్ మైండ్ మహ్మద్ ను హతమార్చినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. మహ్మద్‌ను హమాస్ లో మిగిలి ఉన్న సీనియర్ మోస్ట్ లీడర్లల్లో ఒకడిగా పరిగణిస్తోంది ఏడాదిన్నర కాలంలో గాజాపై సాగించిన దాడుల్లో హమాస్ కు చెందిన పలువురు సీనియర్ నాయకులను మట్టుబెట్టింది ఇజ్రాయెల్. యాహ్యా సిన్వర్, ఆయన తమ్ముడు మహ్మద్ సిన్వర్, హసన్ నస్రల్లా, ఇస్మాయిల్ హనియె, సమీ తాలెబ్ అబ్దుల్లా, ఫతా షరీఫ్, మర్వాన్ ఇసా, ఇబ్రహిం వకీల్, అహ్మద్ వహ్బా.. వంటి సీనియర్ నాయకులు, కమాండర్లు హతం అయ్యారు. హాషెమ్ షఫియొద్దీన్, హుస్సేన్ అలీ హాజీమాను మట్టుపెట్టింది ఇజ్రాయెల్.

# కుట్రకోణంలో కూడా దర్యాప్తు జరుగుతోంది


## కేంద్ర విమానయానశాఖ సహాయ మంత్రి మురళీధరన్

**పూణె,జూన్ 29:** అహ్మదాబాద్ లో ఎయిర్‌ఇండియా దుర్ఘటనలో కుట్రకోణంనుంచి కూడా దర్యాప్తుచేస్తున్నట్లు కేంద్ర మంత్రి మురళీధరన్ చెప్పారు. ఈ ఉదంతంలో కుట్ర కోణంపై కూడా దృష్టి సారించినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తును ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) చేపట్టిందని, అన్ని కోణాల్లోనూ విచారణ జరుపుతోందని ఆయన స్పష్టం చేశారు. పుణెలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. విమానం నుంచి స్వాధీనం చేసుకున్న బ్లాక్‌బాక్స్‌ను విశ్లేషణ కోసం విదేశాలకు పంపుతున్నారంటూ వస్తున్న ఊహాగానాలను మంత్రి మురళీధర్ పూర్తిగా ఖండించారు. "బ్లాక్‌బాక్స్ మన దేశంలోనే, దర్యాప్తు సంస్థల వద్దే సురక్షితంగా ఉంది. దానిని ఎక్కడికీ పంపే ప్రసక్తే లేదు" అని ఆయన తేల్చిచెప్పారు. ఇది చాలా విషాదకరమైన ఘటన అని, ఏఏఐబీ దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభించిందని తెలిపారు. సీసీటీవీ ఫుటేజీని విశ్లేషించడంతో పాటు పలు ఏజెన్సీలు సమన్వయంతో పనిచేస్తున్నాయని వివరించారు. రెండు ఇంజిన్లు ఒకేసారి విఫలం కావడం అనేది అత్యంత అరుదైన విషయమని మంత్రి పేర్కొన్నారు. "ఇది చాలా ప్రత్యేకమైన కేసు. అసలు రెండు ఇంజిన్లు విఫలమయ్యాయా లేక ఇంధన సరఫరాలో ఏమైనా సమస్య తలెత్తిందా అనేది దర్యాప్తు నివేదికతోనే స్పష్టత వస్తుందని అన్నారు. బ్లాక్‌బాక్స్‌లోని కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో పైలట్ల సంభాషణలు నిక్షిప్తమై ఉంటాయని, దర్యాప్తులో అది కీలకం కానుందని తెలిపారు. మరో మూడు నెలల్లో నివేదిక వచ్చే అవకాశం ఉందని, కాబట్టి ఇప్పుడే దీనిపై ఏమీ మాట్లాడటం తొందరపాటు అవుతుందని మురళీధర్ అభిప్రాయపడ్డారు.

# ఉగ్రవాదం మా చట్టబద్ధమైన పోరాటం

## పాక్ మిలిటరీ-చీఫ్ ఆసిమ్ మునీర్

**కరాచి,జూన్ 29:** టెర్రరిజంను చట్టబద్ధమైన పోరాటంగా పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ అభివర్ణించారు. పాకిస్థాన్ పై భారత్ దాడులకు పాల్పడుతోందని మరోసారి నోరు పారేసుకున్నారు. ఇలానే కొనసాగితే భారత్ ను విడిచిపెట్టేది లేదంటూ వార్నింగ్ ఇచ్చారు. భారత్ ప్రాంతీయ ఉద్రిక్తతలను రెచ్చగొడుతోందని, పాకిస్థాన్ మాత్రం ప్రాంతీయ స్థిరత్వాన్ని కాపాడుతోందని విమర్శలు చేశారు. అంతేకాక భారత్ చేతిలో హతం అయిన టెర్రరిస్టులను అమరవీరులుగా అభివర్ణించారు మునీర్. ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ పెంచి పోషిస్తుందన్న పచ్చి నిజం మరోసారి బట్టబయలు అయింది. కరాచీలోని నేవల్ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ ఉగ్రవాదంపై కీలక వ్యాఖ్యలు చేశారు. టెర్రరిజంను చట్టబద్ధమైన పోరాటంగా అభివర్ణించారు. భారత్ చేతిలో హతం అయిన టెర్రరిస్టులను అమరవీరులుగా అభివర్ణించారు మునీర్. ఆయన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈనెల 28 వతేదీ వజీరిస్థాన్‌లో జరిగిన ఆత్మాహుతి దాడి వెనక భారత్ హస్తం ఉందని అసిమ్ మునీర్ నోరు పారేసుకున్నారు. భారత్ ప్రాంతీయ ఉద్రిక్తతలను రెచ్చగొడుతుందని పాకిస్థాన్ మాత్రం ప్రాంతీయ స్థిరత్వాన్ని కాపాడుతోందని నోటికొచ్చింది మాట్లాడారు. అయితే పాకిస్థాన్ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. అవన్నీ తప్పుడు, నిరాధారమైన ఆరోపణలని తేల్చేసింది.



ఎలాంటి హెచ్చరికలు చేయకుండానే నాలుగు సార్లు భారత్ దాడులకు పాల్పడిందని పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ కనుక మరోసారి పాక్‌పై దాడి చేస్తే తమ ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని వివరించారు. భారత్ ప్రాంతీయ ఉద్రిక్తతలను రెచ్చగొడుతోందన్నారు. అయితే పాకిస్థాన్ మాత్రం ప్రాంతీయ స్థిరత్వాన్ని కాపాడుతోందని అన్నారు. వజీరిస్థాన్‌లో జరిగిన ఆత్మాహుతి దాడికి భారత్ కారణం అంటూ అసిమ్ మునీర్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ సూసైడ్ ఎటాక్ వెనుక భారత్ హస్తం ఉందన్నారు. అయితే మునీర్ ఆరోపణలను భారత్ తిప్పికొట్టింది. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పాకిస్థాన్ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈనెల 28న దాదాపు 800 కిలోలు ఉన్న భారీ పేలుడు పదార్థాలతో ఓ వాహనం వజీరిస్థాన్ లోని ఓఉగ్రవాది సైనిక కాన్వాయ్‌ను ఢీ కొట్టింది. ఈ దాడిలో 13 మంది పాక్ సైనికులు మృతి చెందారు. మరో 24 మందికి తీవ్రగాయాలయ్యాయి.

# పూరీ రథయాత్ర దుర్ఘటన.. సర్కారుపై మాజీ సిఎం విమర్శలు

**భువనేశ్వర్, జూన్, 29:** పూరీలో జరిగిన జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర బిజెపి ప్రభుత్వంపై ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ దుర్ఘటనలో ముగ్గురు భక్తులు మరణించగా, 50 మందికిపైగా గాయపడ్డారు. ఈ ఘటన గుండిచా ఆలయం సమీపంలో జరిగింది. ఇది ప్రధాన జగన్నాథ ఆలయం నుంచి దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ఘటనపై బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం, నవీన్ పట్నాయక్ బిజెడి పార్టీ మధ్య ప్రస్తుతం వాడీవేడీ చర్చ కొనసాగుతోంది.

**పట్నాయక్ ఏమన్నారంటే..** ఈ సందర్భంగా నవీన్ పట్నాయక్ ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేసి స్పందించారు. ఈ ఘటనను ప్రభుత్వ అసమర్థతగా అభివర్ణించారు. రథయాత్రలో జన సమూహం నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ దుర్ఘటన భక్తులకు శాంతియుత పండుగను అందించడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టం



చేస్తుందన్నారు. రథయాత్ర రోజు నందీఘోష రథాన్ని లాగడంలో జాప్యం జరిగిందని, దీనిని ప్రభుత్వం మహాప్రభు ఇచ్ఛ అని సమర్థించుకుందని నవీన్ పట్నాయక్ ఆరోపించారు. ఈజాప్యం ప్రభుత్వం బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తుం దన్నారు.

**సిబ్బంది కూడా లేరని..** దీంతోపాటు ఈ ఘటన సమయంలో భారీ జన సమూహాన్ని నియంత్రించడదానికి ప్రభుత్వ సిబ్బంది కూడా అక్కడ లేరని ఆయన విమర్శించారు. దీంతోపాటు రథయాత్రలో భాగంగా కీలక ఆచారాలైన అడప బిజె, బహుదా, సునాబేషా వంటివి సజావుగా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో మరణించిన భక్తుల కుటుంబాలకు నవీన్‌పట్నాయక్ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

**బిజెపి స్పందన..** ఒడిశా న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, నవీన్ పట్నాయక్ పేరును ప్రస్తావించకుండా, బిజెడి పార్టీపై ప్రతివిమర్శలు చేశారు. గతంలో బిజెడి ప్రభుత్వం రథయాత్ర నిర్వహణలో తప్పిదాలు చేసిందన్నారు. జగన్నాథస్వామిని అవమానించిందని ఆయన ఆరోపించారు. 1977 నుంచి రథాలు ఎల్లప్పుడూ రెండో రోజున గుండిచా ఆలయానికి చేరుకుంటాయని హరిచందన్ అన్నారు. బిజెడి పచ్చకామెర్లతో రాజకీయ వ్యాఖ్యలు చేస్తోందన్నారు. పండుగ సమయంలో రాజకీయాలు చేసవారు ఈరోజు కాకపోతే రేపు ఫలితాలను ఎదుర్కొంటారని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపిస్తామని హరిచందన్ హామీ ఇచ్చారు.

# సిబిడిటి ఛైర్మన్‌గా రవిఅగర్వాల్ పునర్నియామకం



**న్యూఢిల్లీ,జూన్ 29:** కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను శాఖ పరిధిలోని కేంద్ర ప్రత్యక్షపన్నుల బోర్డు ఛైర్మన్‌గా ఇప్పటివరకూ కొనసాగుతున్న ఛైర్మన్ రవి అగర్వాల్‌నే కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆదాయపు పన్ను విభాగంలో సిబిడిటి అత్యున్నత స్థాయి నిర్ణయాత్మక సంస్థగా కొనసాగుతోంది. కేబినెట్ నియామకాల కమిటీ కూడా రవి అగర్వాల్ నియామకాన్ని ధృవీకరించింది. ఏడాదికాలం పాటు ఆయన పదవిలో ఉంటారు. 2026 జూన్30 వరకూ కొనసాగుతారని ఉత్తర్వుల్లో వెల్లడించారు.

# హెచ్1బి వీసాల్లో బ్యాంకింగ్, బీమా కంపెనీల్లోనే ప్లేస్‌మెంట్లు ఎక్కువ!

**వాషింగ్టన్,జూన్ 29:** హెచ్ 1బీ వీసాల జారీ అనగానే అమెరికన్ టెక్ కంపెనీలే గుర్తుకొ స్తాయి. ఎందుకంటే ఆ వీసాల ద్వారా ఏటా భారీగా రిక్రూట్‌మెంట్‌లు చేసుకునేది సిలికాన్ వ్యాలీ దిగ్గజ సంస్థలే. 2020 మే నుంచి 2024 మే మధ్యకాలంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. హెచ్ 1బీ వీసా ఉద్యోగుల భర్తీలో బ్యాంకింగ్, టెలికాం రంగ సంస్థల్లోనే ఎక్కువ ప్లేస్‌మెంట్‌జరిగింది. సిటీ గ్రూప్, క్యాపిటల్ వన్, ఏటీ అండ్ టీ, వాల్‌మార్ట్, యూఎస్ఏఏ, వేరిజాన్ లాంటి కంపెనీలు హెచ్1బీ వీసాలతో దూకుడుగా నిపుణులను భర్తీ చేసుకున్నాయి. దీంతో ఉద్యోగాల భర్తీలో సిలికాన్ వ్యాలీలోని దిగ్గజ టెక్ కంపెనీలు వెనుకంజలో ఉండిపోయాయి. అసలు హెచ్1బీ వీసా వ్యవస్థను అమెరికా ప్రభుత్వం అందు బాటులోకి తెచ్చిందే టెక్ దిగ్గజ కంపెనీల కోసం. భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా సహా వివిధ దేశాల్లోని టెక్ నిపుణులకు అమెరికా కంపెనీలు రెడ్ కార్పెట్ పరిచేందుకు ఊతమివ్వ డమే ఈ వీసా వ్యవస్థ లక్ష్యం. ఈ వీసాలను వినియోగించుకునే విషయంలో టెక్ కంపెనీలను టెలికాం, బ్యాంకింగ్ కంపెనీలు దాటేశాయి. 2020 మే నుంచి 2024 మే మధ్యకాలంలో బ్యాంకింగ్ సేవల సంస్థ సిటీ గ్రూప్ 3వేల మందికిపైగా హెచ్1బీ వర్కర్లను రిక్రూట్ చేసుకుంది.




# ఎమర్జెన్సీ విధించినవారు ఓడిపోయారు..

## భద్రాద్రి మహిళల మిల్లెట్ మ్యాజిక్ బిస్కెట్లపై ప్రశంసలు

## ప్రపంచవ్యాప్తంగా యోగాడే అభ్యాసాలు సంతోషకరం

## భారత్‌కు ట్రకోమా నుంచి విముక్తి

## మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీ




**న్యూఢిల్లీ, జూన్ 29:** దేశంలో ఎమర్జెన్సీ విధించిన వారు రాజ్యాంగాన్ని హత్య చేసి, న్యాయ విభాగాన్ని బానిసగా మార్చుకోవాలనుకున్నారని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. నాడు జార్జిఫెర్నాండెజ్‌ను సంకెళ్లతో బంధించారని గుర్తు చేశారు. కానీ, భారత ప్రజలు శక్తిమంతమైన వారు కావడంతో ఎమర్జెన్సీ తొలగిపోయిందని, అత్యయిక స్థితి విధించినవారు ఓడిపోయారని గుర్తు చేశారు. దేశంలో ఎమర్జెన్సీకి 50 ఏళ్ల పూర్తవడాన్ని మన్‌కీబాత్‌లో ప్రస్తావించిన ప్రధాని, ఎమర్జెన్సీపై పోరాడిన మొరార్జీ దేశాయ్, వాజ్‌పేయి, బాబూ జగ్జీవన్ రామ్ వంటి నేతల ప్రసంగాలను మోదీ ప్రస్తావించారు. ఎమర్జెన్సీపై పోరాడిన వారిని కచ్చితంగా స్మరించుకోవాలనీ అది రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి మనల్ని ప్రేరేపిస్తుందన్నారు. భారత జనాభాలో 64 శాతం కన్నా ఎక్కువ మంది దాదాపు 95 కోట్లమంది ఏదో ఒక సామాజిక రక్షణ పథకంతో లబ్ధి పొందుతున్నట్లు అంతర్జాతీయ కార్మికసంస్థ తెలిపిందని ప్రధాని నరేంద్రమోదీ వివరించారు. 2015లో సామాజిక రక్షణ ఫలాలు కేవలం 25 కోట్ల మందికి అందేవని , శాశ్వత అంధత్వానికి దారితీసే ట్రాకోమా వ్యాధి నుంచి భారత్ పూర్తిగా విముక్తి పొందినట్లు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ డబ్ల్యుహెచ్ఓ నిర్ధారించిందని 123వ మన్‌కీబాత్ ఎపిసోడ్‌లో మోదీ తెలిపారు. ఇటీవలి అంతర్జాతీయ యోగా డేను యావత్ ప్రపంచం జరుపుకుందనీ, అందరి జీవితాల్లో యోగా భాగమవుతోందని మోదీ హర్షం వ్యక్తం చేశారు. 21న జరిగిన యోగా డే కార్యక్రమాల్లో దేశ, ప్రపంచ వ్యాప్తంగా లక్షల మంది పాల్గొన్నారని గుర్తు చేశారు. దాదాపు 10 ఏళ్ల క్రితం మొదలైన ఈ కార్యక్రమం ఏటేటా మరింత విస్తరిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. చాలాకాలం తర్వాత అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైందన్న మోదీ, యాత్రికులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ భద్రాచలం ప్రాంతంలో మహిళలు మిల్లెట్లతో బిస్కెట్లు తయారు చేస్తున్నారనీ అవి లండన్‌కు కూడా ఎగుమతి అవుతున్నాయని చెప్పారు. ఆదివాసి మహిళలు 'భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్' పేరిట బిస్కెట్లు తయారు చేస్తు వాటిని హైదరాబాద్ నుంచి లండన్‌కు కూడా ఎగుమతి చేస్తున్నారని ప్రధాని వెల్లడించారు. వాళ్లే పర్యావరణహితమైన గిరి శానిటరీ ప్యాడ్స్‌ను ఉత్పత్తి చేస్తున్నారనీ, 3నెలల్లోనే 40వేల ప్యాడ్స్‌ను తయారుచేశారని మోదీ ప్రశంసించారు. ఫుట్‌బాల్ ఆటగాళ్లకు కేంద్రంగా బోడోల్యాండ్ మారిందని ప్రధాని మోదీ అభినందించారు. పరిమిత వనరులతోనే సాధన చేసి అద్భుతంగా రాణిస్తున్నారని, దేశంలోని చిన్నారులకు వీరు ఆదర్శంగా మారారని కొనియాడారు. ఫిట్‌నెస్, ఊబకాయం తగ్గించుకోవడానికి ఆహారంలో నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించుకోవాని సలహా ఇచ్చారు. మేఘాలయ ఎరీసిల్క్‌కు జీఐ ట్యాగ్ లభించిందని ప్రశంసించారు. పురుగులను చంపకుండా వస్త్రాన్ని తయారు చేయడం దీని ప్రత్యేకతని తెలిపారు.

# ఆస్కార్ కమిటీలో కమల్, ఖురానా: మొత్తం 19 విభాగాల్లో 11,120 మంది సభ్యులు

**లాస్‌ఏంజెల్స్,జూన్ 29:** ఆస్కార్ అవార్డుల కమిటీలో భారతీయ నటులకు సభ్యత్వం లభించింది. బహుభాషా నటుడు, నిర్మాత కమల్‌హాసన్‌తోపాటు, బాలివుడ్‌నటుడు ఆయుష్మాన్ ఖురానాలను ఈసారి ఆస్కార్‌పరిధిలోని అకాడమీ ఆఫ్‌మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ విభాగం కమిటీలోకి ఆహ్వానించింది. ఈ కమిటీలో ప్రముఖ హాలివుడ్ బాలివుడ్‌నటుల తోపాటు టెక్నీషియన్లు, వివిధ విభాగాల్లో అత్యున్నతస్థాయి ప్రమాణాలు పాటించిన ప్రముఖులను ఆస్కార్ నామినేట్‌చేస్తుంది. ఈవిభాగంలో ఇప్పటివరకూ 534 మంది సభ్యులుగా ఉన్నారు. వీరితోపాటే ఆరియానా గ్రాండే, సెబాస్టియన్‌స్టాన్, జెరెమీ స్ట్రాంగ్



వంటివారిని కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా ఆస్కార్ అకాడమీ ఆహ్వానించింది. ఇప్పటికే ఆస్కార్‌లోని వివిధ విభాగాల్లో భారత్‌నుంచి డైరెక్టర్ కరన్ మాల్లీ, సినిమాటోగ్రాఫర్ రణ్‌బీర్ దాస్, కాస్ట్యూమ్ డిజైనర్ మాగ్జిమా బసు, డాక్యుమెంటరీ నిర్మాత స్మృతి ముంద్రా, నిర్మాత పాయల్‌కపాడియాలు కూడా ఉన్నారు. ఆస్కార్‌కు నామినేట్ అయిన అన్ని చిత్రాలను వీక్షించి వారు వోటింగ్ ఇస్తారు. వీరితోపాటే హాలివుడ్‌నుంచి దేవ్ బాటిస్టా, జాసన్ మమోవా, ఆబ్రే ప్లాజా, డేనియల్లీ డెడ్‌వైలర్, ఆండ్రూ స్కాట్‌తదితరులున్నారు. గిలియన్ ఆండర్సన్‌న నావోమి ఆకీ, మోనికా బార్బరో, ఓడీ కామర్ వంటి వారు కూడా సభ్యులుగా ఉన్నారు. ఆస్కార్ విన్నర్ మైకీ మ్యాడిసన్, ఆడ్రియానా పాజ్, సెబాస్టియన్ స్టాన్‌లు కూడా ఆస్కార్ ఆకాడమిలో సభ్యులే. కొత్తగా నామినేట్ అయినవారితో కలిపి ఇపుడున్న ఆస్కార్ కమిటీల సభ్యత్వాలు 10,143 నుంచి 11,120కి పెరిగింది. మొత్తం 19 విభాగాల్లో వీరంతా కొనసాగుతారు.



# ఉక్రెయిన్‌పై రష్యా అతిపెద్ద గగనతల దాడి

## 477 డ్రోన్లు, 60 క్షిపణులు ప్రయోగించిన రష్యా

**కీవ్, జూన్ 29:** యుద్ధం మొదలైన నాటి నుంచి అతి పెద్ద గగనతల దాడి ఉక్రెయిన్‌పై శనివారం రాత్రి జరిగింది. రష్యా మొత్తం 537 ఆయుధాలను ప్రయోగించింది. వీటిల్లో 477 డ్రోన్లు, 60 క్షిపణులు ఉన్నాయని ఉక్రెయిన్ వాయుసేన వెల్లడించింది. వీటిల్లో 249ని కూల్చేశామని.. మరో 226 ఎలక్ట్రానిక్ జామింగ్ వ్యవస్థల ప్రభావంతో కూలిపోయాయని తెలిపింది. ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్స్ కమ్యూనికేషన్ కమాండర్ యూరీ ఇహ్నాట్ మాట్లాడుతూ గత రాత్రి అతిపెద్ద దాడి జరిగిందని వెల్లడించారు. ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని రష్యా ఆయుధాలను ప్రయోగించినట్లు చెప్పారు. పోలాండ్ గగనతల రక్షణ కోసం మిత్రదేశాల యుద్ధ విమానాలు రంగంలోకి దిగినట్లు పేర్కొన్నారు. ఖెర్సాన్ ప్రావిన్స్‌లో జరిగిన దాడుల్లో ఒకరు మరణించినట్లు అక్కడి గవర్నర్ వెల్లడించారు. ఈదాడిలో ఉక్రెయిన్‌కు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానం కూలిపోయి అందులోని పైలట్ ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి మిలిటరీతెలిపింది. ఇప్పటివరకూ ఈ యుద్ధంలో మూడు ఎఫ్-16లను రష్యా కూల్చివేసింది.

ఇక ఉక్రెయిన్ తీరప్రాంత నగరమైన ఒడెసాలోని ఓ అపార్ట్‌మెంట్‌పై రష్యా శుక్రవారం రాత్రి చేసిన డ్రోన్ దాడిలో భార్యాభర్తలు మరణించారు. ఈ దాడిలో 17 మంది తీవ్రంగా గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. అపార్ట్‌మెంట్‌లోని మూడు అంతస్తులు దెబ్బతిన్నాయి. మరోవైపు పశ్చిమ రష్యా, క్రిమియాపై ఉక్రెయిన్ ప్రయోగించిన 40 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది.

రష్యాలో వేర్పాటువాదాన్ని పశ్చిమ దేశాలు ప్రోత్సహిస్తున్నాయని, ఉక్రెయిన్‌తో చేస్తున్న యుద్ధంలో జోక్యం చేసుకుంటున్నాయని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆరోపించారు. బెలారస్ రాజధాని మిన్స్క్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 'రష్యాకు వ్యతిరేకంగా ఇస్లామిక్ స్టేట్ పనిచేస్తున్నంత కాలం ఎవరూ దానిపై దృష్టి సారించరు. మాస్కోలో పేలుళ్లు నేటికీ జరుగుతున్నాయి. మా దేశంలో వేర్పాటువాదాన్ని ప్రోత్సహించి, మాపై పోరాటానికి ఉగ్రవాదాన్ని సాధనంగా ఎంచుకున్న పశ్చిమ దేశాల విషయంలో కూడ ఇదే జరిగింది. నాటో విస్తరణ, ఉక్రెయిన్‌తో వివాదాన్ని పరిష్కరించడం వంటి వాగ్దానాలు ఇచ్చి వాటిని నిలబెట్టుకోకుండా పశ్చిమ దేశాలు రష్యాను పదేపదే మోసం చేస్తున్నాయి' అని పుతిన్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

# ఉత్తరకాశీలో వరదల బీభత్సం

## కుప్పకూలిన టూరిస్టు హోటల్, ఇద్దరు మృతి, మరో ఏడుగురు గల్లంతు

## చార్‌ధామ్ యాత్ర 24 గంటలపాటునిలిపివేత



**డెహ్రాడూన్,జూన్ 29:** ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో సంభవించిన అకస్మిక వరదల కారణంగా ఓ హోటల్ కుప్పకూలింది. దీంతో అక్కడే పనిచేస్తున్న 9మంది కార్మికులు గల్లంతయ్యారు. వారిలో ఇద్దరి మృతదేహాలు వెలికితీయగా, మరో ఏడుగురి కోసం ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు భారీ వర్షాలు కారణంగా చార్ ధామ్ యాత్రను 24 గంటల పాటు నిలిపివేశారు. అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం, శనివారం బార్‌కోట్‌యమునోత్రి మార్గంలోని సిలాయ్ బాంద్‌లో భారీ వర్షాలు కురిశాయి. ఆకస్మిక వరదలు కూడా సంభవించాయి. దీంతో నిర్మాణంలో ఉన్న ఓ హోటల్ ధ్వంసం కావడం వల్ల అక్కడే పనిచేస్తున్న 9మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వారిలో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ఉన్నాయి. గల్లంతైన కార్మికులు నేపాల్ పౌరులుగా గుర్తించారు. ప్రమాద సమయంలో కార్మికులు గుడారాల్లో ఉన్నారని అధికారులు తెలిపారు. హోటల్ నిర్మాణం కోసం వచ్చిన కార్మికులకు యజమాని సమీపంలోనే క్యాంపును ఏర్పాటు చేశారని వెల్లడించారు. డెహ్రాడూన్, తెహ్రీ, పౌరి, హరిద్వార్, చంపావత్, నైనిటాల్, ఉధమ్ సింగ్ నగర్‌లోని కొన్ని ప్రదేశాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అంచనావేసింది. చమోలి, పౌరి, డెహ్రాడూన్, రుద్రప్రయాగ్, ఇతర జిల్లాలతో సహ అనేక జిల్లాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. నదులు ప్రమాదకరంగా ఒడ్డున ఉప్పొంగుతున్నది. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి స్పందించారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన కార్మికుల కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, సంబంధిత అధికారులతో తాను నిరంతరం సంప్రదిస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# పెద్దారెడ్డి రాకను ఆక్షేపించిన పోలీసులు

**గుట్టు చప్పుడు కాకుండా తాడిపత్రి నివాసానికి చేరుకున్న పెద్దారెడ్డి**

**జె.సి నివాసానికి పెద్దఎత్తున చేరుకున్న టిడిపి శ్రేణులు**

**ప్రస్తుత పరిస్థితుల్లో రక్షణ కల్పించలేం పోలీసులు స్పష్టీకరణ**



పెద్దారెడ్డిని పోలీసులు తరలిస్తున్న దృశ్యం, పెద్దారెడ్డి ఇంటి వైపు వెళుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి

**తాడిపత్రిటౌన్, జూన్ 29 ప్రభాతవార్త:** తాడిపత్రి పట్టణంలో శనివారం నుండి చిన్నపాటి ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి భగత్‌సింగ్‌నగర్‌లోని సొంత ఇంటి నిర్మాణ విషయంలో నిబంధనలను అతిక్రమించారని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ విషయమై జె.సి ప్రభాకర్‌రెడ్డి పలుమార్లు పాత్రికేయుల సమావేశాల్లో ప్రసారా మాధ్యమాలు వేదికగా గట్టిగా ఆరోపిస్తూ వస్తున్నారు. ఎట్టకేలకు శనివారం ఉదయం పోలీస్ బందోబస్తు మధ్య మున్సిపల్, రెవిన్యూ అధికారులు ఇంటి కొలతలు నిర్వహించి మార్కింగ్ వేశారు. దీంతో పట్టణంలో పెద్దారెడ్డి ఇంటి నిర్మాణంలోని ఆక్రమణలను తొలగిస్తున్నారన్న వార్త పట్టణంలో చర్చనీయాం శంగా మారింది. కొలతలు నిర్వహించిన శనివారం, మరుసటి రోజు ఆదివారం కావడంతో పెద్దారెడ్డి కోర్టును ఆశ్రయించే అవకాశం లేకపోయింది. ఈ నేపథ్యంలో ఈ పరిస్థితిని అడ్డు కునేందుకు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఆదివారం ఉదయం నివాసానికి చేరు కున్న పెద్దారెడ్డి ఇంట్లో తిష్ట వేసుకుని కూర్చు న్నారు. విషయం తెలుసుకున్న వైసిపి శ్రేణులు కొంతమంది పెద్దారెడ్డి నివాసానికి చేరుకున్నారు. ఉలిక్కిపడ్డ పోలీసు యంత్రాంగం ఒక్కసారిగా అప్రమత్తమై బృందాలుగా విడిపోయి జె.సి నివాసం వద్దకు, కళాశాల క్రీడా మైదానంలో మరి కొంతమంది, పెద్దారెడ్డి నివాసం వద్దకు చేరుకొని గట్టి బందోబస్తు నిర్వహించారు. ఇరువు వర్గాలకు చెందిన కార్యకర్తలు గుమి కూడకుండా చూశారు. అప్పటికే విషయం తెలుసుకున్న టిడిపి శ్రేణులు జె.సి నివాసం వద్దకు పెద్దఎత్తున తరలిరావడం పెద్దారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం జె.సి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దారెడ్డి ఇంటి వైపు దూసుకుపోయే ప్రయత్నం చకచక జరుగుతుం డగానే పెద్దారెడ్డి నివాసానికి చేరుతున్న పట్టణ సిఐ సాయిప్రసాద్, రూరల్ ఎస్ఐ ధరణిబాబులు పెద్దారెడ్డిని నివాసంలోని పై అంతస్తు నుండి క్రిందకు వచ్చి ఏఎస్‌పితో చర్చలు జరపాలని విజ్ఞప్తి చేశారు. పెద్దారెడ్డితో సిఐ మాట్లాడుతూ ముందస్తు సమాచారంతో నివా సానికి వస్తే పై అధికారులతో మాట్లాడి రక్షణ కల్పించే ప్రయత్నం చేస్తామని తక్షణం బయటికి వచ్చిసహకరించాలని కోరారు. పెద్దారెడ్డి ససేమిరా అనడంతో కాస్త ఆలస్యమైన పెద్దారెడ్డిని బుజ్జగించి ఎట్టకేలకు కిందికి దింపారు పోలీసులు. ఏఎస్‌పి రోహిత్ కుమార్‌చౌదరి ఆధ్వర్యంలో పోలీసు బృందం పెద్దారెడ్డిని చాకచక్యంగా పోలీసు వాహనంలో ఎక్కించుకుని తీసుకుని వెళ్ళి పోయారు. పెద్దారెడిని పోలీసులుతరలించారు అన్న విషయం తెలుసుకున్న టిడిపి శ్రేణులు శాంతించడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండాపోలీసులు ప్రణాళిక బద్ధంగా వ్యవహరించడంలో సఫలీకృతులయ్యారు.

## 10న తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల మెగా సమావేశం

**విజయవాడ, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగాసమావేశాన్ని జులై 10న నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ విద్యా శాఖ డైరెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. విద్యార్థుల అకాడమిక్ ప్రోగ్రెస్ తెలుసుకునేందుకు ఈ సమావేశం ఉపయోగపడుతుందని, హోలిస్టిక్ ప్రోగ్రెస్ తెలుసుకునేందుకు ఈ సమావేశం ఉపయోగపడుతుందని, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను అందించాలని సూచించారు.

## వంశీకి ముందస్తు బెయిల్‌పై సుప్రీంలో ప్రభుత్వం అప్పీల్

**విజయవాడ, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** గనుల అక్రమ తవ్వకాలకు పాల్పడి ప్రభుత్వ ఖజానాకు రూ.195 కోట్ల నష్టం చేసిన కేసులో నిందితుడు, వైకాంగ్రెస్‌పార్టీ నేత మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ముందస్తు బెయిలు మంజూరుచేస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేయాలని రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన న్యాయనిపుణులతో చర్చించిన మీదట ఈ దిశలో తక్షణం చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టులోని రాష్ట్రప్రభుత్వం అడ్వొకేట్ ఆన్ రికార్డ్ కార్యాలయ ప్రత్యేక అధికారిని ఆదేశించింది. రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ తదనుగుణంగా ఉత్తర్వులు జారీచేశారు. వైకాంగ్రెస్‌పార్టీ హయాంలో గన్నవరం నియోజకవర్గం పరిధిలోని బాపులపాడు, గన్నవరం విజయవాడ గ్రామీణ మండలాల పరిధిలో వల్లభనేని వంశీ ఆయన అనుచరులు గనులను కొల్లగొట్టి ప్రభుత్వ ఖజానాకు రూ.195 కోట్లకు పైగా నష్టంకలిగించారంటూ కృష్ణా జిల్లా గనులశాఖ అధికారి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఫోర్జరీ పత్రాలు సృష్టించి సహజ వనరులను దోచుకున్నారని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా గన్నవరం పోలీసులు వంశీ తదితరులపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిలు కోసం వంశీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది మే 29న ఈ పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ విచారణ జరిపారు. వంశీకి ముందస్తు బెయిలు మంజూరుచేశారు. హైకోర్టు ఉత్తర్వులపై రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ వేయాలని నిర్ణయించింది.

## బదలీల నుంచి సచివాలయాల ఉద్యోగులకు మినహాయింపు

**విజయవాడ, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** స్వర్ణాంధ్ర-2047 లో భాగంగా జిల్లా, నియోజకవర్గస్థాయి విజన్ కార్యాచరణ ప్రణాళికల తయారీలో భాగస్వాములైన గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగులను బదిలీల నుంచి మినహాయిస్తూ గ్రామ వార్డు సచివాలయాల శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. పలువురు ఉద్యోగులు ఆన్ డ్యూటీ విధానంలో కార్యాచరణ ప్రణాళికల తయారీలో భాగస్వాములయ్యారు. వీరిని బదిలీ చేయడం ద్వారా పనులకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు వీరి బదిలీలలను మినహాయించారు. గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలలు పారదర్శ కంగా నిర్వహించడంలేదని కొన్ని జిల్లాల్లో ఉద్యోగులు కౌన్సెలింగ్ ప్రక్రియను బహిష్కరించినట్లు సమాచారం. ఉద్యోగుల అభిప్రాయాలు తెలుసుకోకుండా అధికారులు ఏకపక్షంగా వ్యవ హరిస్తున్నారని ఆందోళనవ్యక్తంచేశారు. ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలకు ప్రాధాన్యమిస్తున్న కారణంగా అర్హులైన ఉద్యోగులకు బదిలీల్లో అన్యాయం జరుగుతోందని ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు.

## విద్యుదుత్పత్తి కేంద్రాలకు రాయితీ నిబంధనల సడలింపు!

**విజయవాడ, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** వ్యర్థాలతో విద్యుత్తు ఉత్పత్తి చేసే కేంద్రాలకు అందించే రాయితీ నిబంధనలను కేంద్ర ప్రభుత్వం సవరించింది. ఇదివరకు 80% విద్యుదుత్పత్తి సామర్థ్యం అందుకున్న కేంద్రాలకు మాత్రమే ఆర్థిక సాయం అందించేవారు. ఇప్పుడు 50శాతానికి పైగాఉత్పత్తి సామర్థ్యాన్ని అందుకున్న ప్లాంట్లకూ నిష్పత్తి ఆధారంగా రాయితీ ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. సవరించిన నిబంధనల ప్రాకారం కేంద్ర ఆర్థిక సాయాన్ని రెండు దశల్లో విడుదల చేస్తారు. ప్రాజెక్టు పనితీరు ఆధారంగా మొత్తంగారాయితీలో 50% మొత్తాన్ని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలినుంచి నిర్వహణ ధ్రువపత్రం అందుకున్న వెంటనే విడుదల చేస్తారు. మిగిలిన మొత్తాన్ని ఆ విద్యుత్తు కేంద్రం 80% ఉత్పత్తి సామర్థ్యం చేసుకున్న తర్వాత ఇస్తారు. ఉత్పత్తి సామర్థ్యం 50%లోపు ఉంటే మాత్రం ఈ సాయం అందదు. 80% ఉత్పత్తి స్థాయిని చేరుకోకపోయినా అది ఎంత శాతం ఉత్పత్తి చేస్తోందో దాని ప్రకారమే కేంద్ర సాయాన్ని చెల్లిస్తారు.

## గ్రంథాలయాలకు పునర్జీవనం, ప్రగతికి సోపానం

**ఎపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్**

**మూతపడుతున్న గ్రంథాలయాలను పునరుద్ధరించిన నాయకుడు మధుసూదనరాజు**

**విజయవాడ,జూన్29,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రంథాలయాలకు పునర్జీవనం, ప్రగతికి సోపానమని ఎపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్అన్నారు. గ్రంథాలయాల సంస్థ సంచాలకులు మధుసూధనరాజు ఉద్యోగ పదవీ విరమణ కార్యక్రమంలో ఎపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సాధారణ ఉద్యోగి విరమణకీ, ఒక నాయకుడి ఉద్యోగ విరమణకీ ఎంతో వ్యత్యాసం వుంటుందన్నారు ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్. ఆదివారం విద్యాధరపురంలోని ఎన్. కన్వెన్షన్ హాలులో డా కళ్ళేపల్లి మధుసూదనరాజు ఉద్యోగ పదవీ విరమణ సందర్భంగా ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యాసాగర్ మాట్లాడుతూ గ్రంథాలయ శాఖలో చిరు ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించిన మధుసూదనరాజు అంచెలంచెలుగా ఎదిగి గ్రంథాలయ ఉద్యోగుల సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేయడం అసాధారణ విషయమన్నారు. మధుసూదనరాజుతో మూడు దశాబ్దాల అనుబంధ ముందన్నారు. నేను జిల్లా నాయకుడిగా పని చేసిన ఇన్నాళ్ళూ నాతో నడిచి, ఇప్పుడు నేను ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించగానే ఆయన పదవీ విరమణ చేయడం నాకు ఎంతో నష్టంగా భావిస్తున్నానన్నారు. మరో అతిథి లైలా గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ కళ్ళేపల్లి మధుసూదనరాజు గ్రంథాలయాల పురోభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఆ కృషిలో నన్ను కూడా భాగస్వామ్యుణ్ని చేయడం నాకెంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. మరో అతిధి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేయడమే కాకుండా ప్రభుత్వంతో చర్చించి మూతపడుతున్న స్థితిలో వున్న గ్రంథాలయాలను కూడా పునరుద్ధరించిన నాయకుడు మధుసూదనరాజు అని అన్నారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ పూర్వ ఛైర్మన్ బండారు హనుమంతరావు, హీరో శోభన్బాబు మేనల్లుడు వేగి రాజా, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ డీడీ పీర్ అహ్మద్, ఆంధ్రప్రదేశ్ జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం, ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం, రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్స్ అసోసియేషన్, స్టేట్ వైడ్ శోభన్ సిండికేట్ నాయకులు, వివిధ జిల్లా గ్రంథాలయ సంస్థల నాయకులు, హీరో శోభన్ బాబు అభిమానులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అనంతరం మధుసూదనరాజుశ్రీమతి పార్వతి దంపతుల్ని ఘనంగా సత్కరించారు.




మధుసూదన్ పదవి విరమణ సభలో ప్రసంగిస్తున్న ఎపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్

## రసాభాసగా వార్డు సచివాలయ సర్వేయర్ల బదలీ ప్రక్రియ

**బహిరంగ వసూళ్లకు దిగిన సత్యసాయి జిల్లా సర్వే శాఖ ఏడి**



**అనంతపురం కలెక్టరేట్, జూన్ 29 ప్రభాతవార్త:** అనంతపురం ఉమ్మడి జిల్లా వార్డు సచివాలయ సర్వేయర్ల బదిలీ ప్రక్రియ రసాబాసగా సాగింది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి 624 మంది బదిలీల కోసం దరఖాస్తు చేయగా వారిలో 150 మంది అనారోగ్య కారణాలు, భాగస్వామి బదిలీ ఎంచుకున్నారు. మిగిలిన సర్వేయర్ల వేకెన్సీ పొజిషన్ సక్రమంగా చూపడం లేదంటూ సర్వేయర్లు ఆందోళనకు దిగారు. అధికారులు నిర్లక్ష్యంగా బదిలీ ప్రక్రియను నిర్లక్షేత్రంతో తప్పుగా వర్తిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే సర్వేయర్లను అవమానపరిచేట్టుగా మాట్లాడుతుండడం మంచిది కాదని వాళ్ల నిరసన వ్యక్తం చేశారు. ప్రక్రియను అడ్డదారులు నియమించడానికి అవకాశం తీసుకుని సత్యసాయి జిల్లా సర్వే శాఖ ఏడి విజయశాంతిబాయి డబ్బు తీసుకోని అనుకూలమైన స్థానాలను కేటాయిం చారని పలువురు సర్వేయర్లు ఆందోళనకు దిగారు. బదిలీ ప్రక్రియ పర్యవేక్షించిన జిల్లా రెవెన్యూ అధికారి కేవలం ప్రేక్షపాత్ర వహిస్తూ ప్రతి ఒక్కరిపై అసహనం వ్యక్తం చేయడం కనిపించింది. ఉద్యోగుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా క్లియర్ వేకెన్సీ పొజిషన్ తెలియజేయకుండా బదిలీ ప్రక్రియ చేపట్టడాన్ని ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకించి బదిలీ ప్రక్రియను బహిష్కరించారు. ఉద్యోగుల సమస్యలు పట్టనట్టుగా జిల్లా రెవెన్యూ అధికారి సర్వే శాఖ జిల్లా అధికారులు బదిలీ ప్రక్రియను కొనసాగించారు.

బదిలీ ప్రక్రియకు వచ్చే ఉద్యోగులకు కనీస సౌకర్యాలు సైతం కల్పించలేదని పలువురు మహిళలు సర్వేయర్లు వాపోయారు. మంచినీటి వసతిని సైతం ఏర్పాటు చేయలేదన్నారు.

## అక్రమ ఆక్రమణల తొలగింపు

**ఇంద్రకీలాద్రి, జూన్ 29, పభాతవార్త :** ఆలయ ఈవో వికె శీనా నాయక్ ఆలయ రికార్డులను పరిశీలించి దేవస్థానం సేవాకేంద్రం ఏర్పాటు చేయడానికి నిర్ణయించిన సుమారు 2కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన దేవస్థానం స్వంత స్థలం గురించి ఆలయ సిబ్బందిని విచారణ చేసి సుధాకర్ హోటల్ స్థలం కొనుగోలు విషయం 2019 నుండి ఆక్రమణ విషయం బయటకు రాగా,ఆక్రమణ దారులను ఖాళీ చేయవలసినదిగా తెలియపరచినప్పటికి ఆక్రమణదారులు ఖాళీ చేయనందున డిసిపి రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4గంటలకు ప్రారంభమైన తొలగింపు ఆదివారంఉదయం 4 గంటల వరకు అనగా 12గంటల పాటు కొనసాగింది.

**అన్న ప్రసాద విరాళ దాతలు :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిత్యము నిర్వహించే నిరతాన్న పథకమునకు విజయవాడకు చెందిన కె శివ సుతేజ రూ.1,01,116/-లు విరాళాన్ని ఆలయ అధికారులకు అందచేశారు. దాతలకు శ్రీ స్వామిఅమ్మవార్ల దర్శనం, అనంతరం ఆశీర్వచనం అందచేయడం జరిగింది.

## కాపుల న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలి





మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కెఆర్‌పిఎస్ రాష్ట్ర కన్వీనర్స్ రావి శ్రీనివాస్, చనమల ప్రసాద్‌రావు

**విజయవాడ, జూన్ 29, ప్రభాతవార్త :** కాపు రిజర్వేషన్ పోరాట సమితి (కెఆర్‌పిఎస్) రాష్ట్ర కన్వీనర్స్ రావి శ్రీనివాస్, చనమల ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బిసిలకు ఇటు ఈడబ్ల్యుఎస్ లోని ఇతర ఓసిలకు గాని ఏ విధమైన నష్టం లేకుండా కాపు తెలగ బలిజ ఒంటరి కులాల వారికి జనాభా ప్రతిపధికగా మహారాష్ట్రలోని మరాఠాలకు ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేస్తున్న మాదిరిగా ఏపిలో కూడా 12% ప్రత్యేక రిజర్వేషన్‌లు కల్పించాలని, ఈ ఏకైక డిమాండ్ సాధనే లక్ష్యంగా కాపు రిజర్వేషన్ పోరాట సమితి తీర్మానాలు కాపు తెలగ బలిజ ఒంటరి కులాల వారికి జనాభా ప్రాతిపదికగా12% ప్రత్యేక రిజర్వేషన్ సత్వరమే కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిసిలకు స్థానిక సంస్థలు నామినేటెడ్ పోస్టులతో పాటు విద్యా ఉద్యోగాల్లో కూడా 34% రిజర్వేషన్ కల్పించాలి. ఈడబ్ల్యుఎస్‌లోని ఇతర ఓసిలకు అనగా బ్రాహ్మణ క్షత్రియ వెలమ ఆర్యవైశ్య రెడ్డి కమ్మ తదితరాల్లోని పేదలకు ఈడబ్ల్యుఎస్ 10% రిజర్వేషన్ కొనసాగించాలని, జులై 4న అమరజీవి వంగవీటి మోహన్‌రంగా జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా గల రంగా విగ్రహాలకు కాపు రిజర్వేషన్ల వినతి పత్రాన్ని సమర్పించాలి. అలాగే ముఖ్యమంత్రికి కూడా వినతిపత్రాలను మెయిల్, రిజిష్టర్ పోస్టు ద్వారా సమర్పించాలి.

ఈ న్యాయమైన డిమాండ్‌ను 6నెలలో వ్యవధిలో ప్రభుత్వం స్పందించని సందర్భంలో డిసెంబర్ 26 రంగా వర్ధంతి సందర్భంగా ఛలో విజయవాడ కార్యక్రమానికి పిలుపు నివ్వాలని తీర్మానించడం జరిగింది. జులై 4న రంగా జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కెఆర్‌పిఎస్ పక్షాన బహిరంగ ప్రశ్నావళిపై అనుమతిస్తే ముఖాముఖి చర్చలకు మేము సిద్దమని సవినయంగా తెలియచేస్తూ 1994-95 నుండి నేటి వరకు అనేక పర్యాయాలు ముఖ్యమంత్రిగా కొనసాగినప్పటికి మీరు సవతితల్లి ప్రేమను చూపించడం వాస్తవం కాదా ? హైకోర్టు సమర్ధించిన జీవో నె.30ని మొదటగా 1994 నుండి 2004వరకు తుంగలో తొక్కేసింది మీరు కాదా ? 2014 ఎన్నికల సందర్భంగా రాజకీయ అవసరాల కోసం సుమారుగా 20సం॥ల అనంతరం కాపు రిజర్వేషన్ల సమస్యను మరల తెరమీదకు తీసుకొచ్చింది మీరు కాదా ? జీవో 30ని తుంగలో తొక్కేసిన మీరు ముస్లీంల విషయంలో హైకోర్టు రెండు పర్యాయాలు కొట్టేసిన జీవోను ఏ విధంగా సమర్ధిస్తున్నారు. ఇదేనా మీ సమధర్మం, సమన్యాయం, ఇదేనా మీ పారదర్శక పాలన, ఇదేనా మీ గుడ్ గవర్నెన్స్ ఇది న్యాయమేనా.. ప్రతిపక్షంలో ఉండగా మీ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ప్రస్తుత ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మచిలీపట్నం కేంద్రంగా ఉన్న కృష్ణాజిల్లాకు వంగవీటి మోహన్ రంగా కృష్ణాజిల్లా అని నామకరణం చేయాలని పోరాటం చేయించారు.

అధికారంలో వున్నపుడు ఒకనీతి, ప్రతిపక్షంలో ఉన్నపుడు మరొక నీతా? ఇదేనా మీ రాజనీతి కాపుల ఓట్లు మాత్రం కావాలి కాపుల ప్రయోజనాలు ఏమాత్రం పట్టవా అని తమరిని సూటిగా ప్రశ్నిస్తున్నాం. మీ పాలన పారదర్శక పాలన గుడ్ గవర్నెన్స్ అని నిరూపించుకోవాలని కెఆర్‌పిఎస్ పక్షాన మేము డిమాండ్ చేయుచున్నాము. కార్యక్రమంలో మెర్ల నాగ సత్యనారాయణ కాకిలేని హరినాథ్ రాష్ట్ర కాపు జెఏసి ఛైర్మన్ రాష్ట్ర అధ్యక్షులు అర్జా రామకృష్ణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల తిరుమ లరావు, రాయల సేన అధ్యక్షులు కోరుమావిల్ల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో భారత్ మహిళ అదృశ్యం



**వాషింగ్టన్, జూన్ 29:** పెద్దలు కుదిర్చిన పెళ్లి కోసం అమెరికా వెళ్లిన భారతీయ మహిళ అదృశ్యమైంది. దీంతో అమెరికా పోలీసులు ఆమె కోసం వెతుకుతున్నారు. భారత్‌లోని ఆ మహిళ కుటుంబ సభ్యులను సంప్రదిం చేందుకు ప్రయత్నిస్తున్నారు. భారత్‌కు చెందిన 24 ఏళ్ల సిమ్రాన్ జూన్ 20న అమెరికా చేరుకున్నది. పెద్దలు కుదిర్చిన వివాహం కోసం ఆ దేశానికి వచ్చినట్లు అమెరికా అధికారులకు తెలియజేసింది. కాగా, అమెరికా వచ్చిన కొన్ని రోజులకే సిమ్రాన్ అదృశ్యమైనట్లు న్యూజెర్సీ అధికారులు తెలిపారు. జూన్ 25న ఆమె చివరిసారి కనిపించిన ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించినట్లు చెప్పారు. మొబైల్ ఫోన్ చూస్తున్న ఆమెలో ఎలాంటి ఆందోళన కనిపించలేదని అన్నారు. మరోవైపు కుదిర్చిన పెళ్లి కోసం కాకుండా ఫ్రీగా ట్రావెల్ చేసేందుకు సిమ్రాన్ అమెరికా వచ్చి ఉంటుందని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. సిమ్రాన్ ఇంగ్లీష్ మాట్లాడలేదని, అమెరికాలో ఆమెకు బంధువులు ఎవరూ లేరని తెలిపారు. భారత్‌లోని ఆమె బంధువు లను సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేదన్నారు. సిమ్రాన్ రూపురేఖలు, మిస్సింగ్‌కు ముందు ఆమె ధరించిన దుస్తులు, ఇతర వివరా లను వెల్లడించారు. ఆమె ఆచూకీ గురించి ఎవరికైనా తెలిస్తే సమాచారం ఇవ్వాలని లిండెన్‌వోల్డ్ పోలీస్ డిటెక్టివ్ జో టోమసెట్టి కోరారు.

## ఆగస్టు 3న బహుజన ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సన్మానం



అంబేద్కర్, జ్యోతిరావుపూలే విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**విజయవాడ, జూన్ 29, ప్రభాతవార్త :** అనంతపురం జిల్లా కేంద్రంలో ఆగష్టు 3న జరిగే బహుజన ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమును జయప్రదం చేయాలనే కార్యక్రమంలో భాగంగా విజయవాడ కేంద్రంలో మహనీయులు మహాత్మా జ్యోతిరావుపూలే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు నివాళులర్పిస్తూ కరపత్రం విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు డా.పోతుల నాగరాజు మట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో జనాబా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో సమాన వాటాకోసం బహుజనులు ఉద్యమం చేయాలని పిలుపునిస్తూ 56శాతం ఉన్న బిసిలకు చట్టసభలలో రిజర్వేషన్ కల్పించాలని విద్య ఉద్యోగాల్లో స్థానిక సంస్థల్లో 44శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ, రాజకీయ పార్టీలు బహుజన ప్రజా ప్రతినిధులు మద్దతుగా నిలవాలని అభ్యర్థిస్తూ దళిత గిరిజన రిజర్వేషన్ వారి ధామాషా ప్రకారం పెంచాలని, అత్యున్నత న్యాయస్థానాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, అత్యున్నత విద్యాసంస్థల్లో రిజర్వేషన్లను రద్దు చేయడం జరిగింది. వాటిని వెంటనే అమలు చేయాలి. కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణను ఆపి, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ పద్దతిలో పని చేయుచున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు బ్యాక్‌లాగ్ పోస్టు భర్తీ చేయాలని ఆగష్టు 3న జరిగే డిమాండ్ చేస్తూ 2027లో జరిగే జనాభా లెక్కల్లో కులాల వారీగా జనాభా లెక్కలు చేపట్టాలని కేంద్ర క్యాబినేట్ తీసుకున్న నిర్ణయంను స్వాగతిస్తూ ఈ డిమాండ్ కు మద్దతుగా నిలిచిన ఉద్యమ నాయకులను, బహుజన ప్రజా ప్రతినిదులను, రాజకీయ పార్టీల అధ్యక్షులను అబినందించాలని నిర్ణనం తీసుకుని ఈ కార్యక్రమంను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఆర్పిఎస్ జాతీయ నాయకులు శివరాం యాదవ్, రైల్వే ఓబిసి ఉద్యోగుల నాయకులు సత్యనారాయణ,ప్రసాద్,శ్రీనివాసులు, ఆర్ఇఫ్ రాష్ట్ర కో కన్వీనర్ హరివర్మ, మావటి శ్రీరాములు తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మలగన్న అమ్మకు బంగారు బోనాలు

**బోనాల సమర్పణ ఊరేగింపులో పాల్గొన్న మంత్రి ఆనం నారాయణరెడ్డి**

**ఇంద్రకీలాద్రి, జూన్ 29, పభాతవార్త :** ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో ఆషాడమాసం ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు సోదర భావముతో అభివృద్ధి బాటలో సాగాలని భూలోకంలో సకాలంలో వర్షాలు పడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు రైతులు సంతోషంగా ఉండాలనే సంకల్పముతో ప్రతి సంవత్సరం మహంకాళీ జాతర అమ్మవారి బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ హైదరాబాద్ వారిచే ఆదివారం ఉదయం బంగారు బోనము సమర్పించడం జరిగినది. ఈ బంగారు బోనాలు సమర్పణ ఊరేగింపులో మంత్రి ఆనం నారాయణరెడ్డి పాల్గొన్నారు. సుమారు 500మంది కళాకారులు విచిత్ర వేషాలు పోతురాజులు డప్పులు కోలాటాలతో బ్రాహ్మణ వీధి నుండి ఘాట్‌రోడ్డు మీదుగా దుర్గమ్మ చెంతకు బంగారు బోనాలు చేరుకు న్నాయి. ఆ క్రమంలో ఆలయ ఈవో బోనాల సమర్పణకు చేసిన ఏర్పాట్లనుమంత్రి ఆనం నారాయణరెడ్డి ప్రశంసించారు.

**ఆషాడం సారె సమర్పణకు టోల్‌ఫ్రీ నెంబర్ :** కనకదుర్గమ్మను ఇంటి ఇలవేల్పుగా ఆడపడచుగా భావించి ఆషాఢ సారె సమర్పణ చేయడానికి టోల్ ఫ్రీ నెంబర్ 18004259099ను సంప్రదించి పేరు నమోదు చేసుకుంటే ఏర్పాట్లు సులభమవుతాయని ఈవో వికె శీనా నాయక్ తెలిపారు.



## మత్స్య, ఆక్వారంగ అభివృద్ధికి నిధి

**ఎన్‌ఎఫ్‌డీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ బీకే బెహారా**

**విజయవాడ, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** మత్స్య ఆక్వా మౌలిక సౌకర్యాల అభివృద్ధి నిధి ఉపయోగించుకుని హ్చరీలు ,ఫీడ్‌మిల్స్, ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చని జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ బీకే బెహారా తెలిపారు. కొత్త ప్రాజెక్టులతోపాటు విస్తరణకు సంబంధించి తీసుకునే రుణాలపై 3% వడ్డీ రాయితీ ఉంటుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వవిద్యాలయం , మత్స్య అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆక్వా రంగంలో మౌలిక సౌకర్యాల అభివృద్ధి నిధి ద్వారా ప్రాజెక్టుల ఏర్పాటు క్రెడిట్ గ్యారంటీ స్కీమ్స్‌పై చర్చించారు. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ ద్వారా మత్స్య రంగంలో మౌలిక వసతుల కల్పనకు నిదులు సమకూరుస్తున్నామని ఎన్‌సీడీసీ ప్రాంతీయ డైరెక్టర్ గోస్వామి వివరించారు. సమావేశంలో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మత్స్యశాఖ కమిషనర్ రాంశంకర్ నాయక్, మత్స్య విశ్వవిద్యాలయ ఓఎస్‌డీ సుగుణ తదితరులు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

సోమవారం 30 - జూన్ - 2025




# గిల్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్లో జగ్గంపేట జట్టు విజయం

**జగ్గంపేట, జూన్ 29 , ( ప్రభాతవార్త ) :** జగ్గంపేటలో ఈనెల 12వ తేదీన ప్రారంభమైన కోరాడ సాయిరాం శ్రీనివాస్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ టోర్నమెంట్లో 34 టీంలు పాల్గొనగా జగ్గంపేట టీం విన్నర్స్ గా, గుర్రప్పాలెం టీం రన్నర్స్ గా నిలిచారు. ఈ సందర్భంగా గుర్రపాలెం రోడ్డులోని బాలాజీ రైస్ మిల్ ఎదురుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ప్రాంగణం వద్ద విజేతలకు బహుమతుల ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగ్గంపేట టిడిపి మండల అధ్యక్షులు మారిశెట్టి భద్రం హాజరయ్యారు. క్రికెట్ పై ఎంతో మక్కువతో ఉండే జగ్గంపేటకు చెందిన యువకుడు ఇటీవల మృతి చెందడంతో ఆ యువకుడు తండ్రి కోరాడ సుబ్బారావు, కుటుంబ సభ్యులు, స్నేహితుల ఆధ్వర్యంలో క్రీడాభిమానులు కోరాడ సాయిరాం శ్రీనివాస్ (గిల్) పేరుతో నిర్వహించిన ఈ యొక్క క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా సాయిరాం శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా విన్నర్స్ గా నిలిచిన జగ్గంపేట టీంకు షీల్డ్ తో పాటురూ 25 వేల 5 వందల 55లు నగదు



బహుమతి అందజేశారు. అదేవిధంగా రన్నర్స్ గా నిలిచిన గుర్రపు పాలెం టీంకు రూ 15 వేల 555 లు నగదు తో పాటు షీల్డ్ ను అందజేశారు. 3వ ప్రైజ్ మనీరూ 5వేల 555 లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండ్రోతు శ్రీను, కొండ్రోతు పైడియ, ప్రేమ స్వరూప్ బుజ్జి, ఆర్గనైజింగ్ టీం ఆలీషా, కిరణ్, పీలా మణికంఠ, జాన్, పప్పీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నిర్మించే వసతి గదుల నిర్మాణానికి రూ.9 లక్షల 90 వేలు విరాళం

**ఆత్రేయపురం, జూన్ 29 , ( ప్రభాతవార్త ) :** ఏడు వారాల వెంకన్న గా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి ఆదివారం ఆషాఢ మాసం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తుల గోవిందనామస్మరణతో మార్మోగాయి. ఉదయం లక్ష్మీ ఐశ్వర్య హోమం ,గోపూజ, అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం బాలభోగం నివేదన తదితర కార్యక్రమాలను అర్చకులు రమణీయంగా జరిపించారు. శ్రీ స్వామి వారిని దర్శించుకొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి వారం వారం పెరుగుతున్న భక్తులరద్దీ కారణంగా వారి సౌకర్యార్థం నిర్మించేందుకు నూతనంగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వసతి గదులు (కాటేజ్ రూమ్స్) నిర్మాణానికి విశాఖపట్నం, కె ఆర్ ఎం కాలని చెందిన కీ.శే. కుమారి బలభద్రుని వెంకట నాగ సత్య సాయి సిరి అంజన, మాధవరావు , విజయలక్ష్మి దంపతులు



వారి కుటుంబ సభ్యులు రూ. 9. 90లక్షలు శ్రీ స్వామి వారి వసతి గదులు (కాటేజ్ రూమ్స్) నిర్మాణానికి విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు, సూపరిడెంట్ రాపాక శ్రీనివాస్ లు శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదాలు అందజేశారు.

# ఆదిత్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ రాజశేఖర్‌కు ఘన సన్మానం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జూన్ 29 , ( ప్రభాతవార్త )** ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు మరియు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల సంయుక్త ఆధ్వర్యంలో ఆదిత్య విద్యాసంస్థల అధ్యక్షుడు నల్లమిల్లి శేషారెడ్డి అధ్యక్షతన, ఇటీవల శాసనమండలి సభ్యులుగా విజయం సాధించిన పేరాబత్తుల రాజశేఖర్ కి ఘనమైన పౌరసన్మాన మహోత్సవం ఆదిత్య విద్యాసంస్థల ప్రాంగణం, శ్రీనగర్లో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు ప్రముఖులు, విద్యా సంఘాల నాయకులు, రాజకీయ నేతలు రాజశేఖర్ నిబద్ధత, నిజాయితీ, ప్రజల పట్ల ఉన్న కమిట్మెంట్ను ప్రశంసిన్నారు, ఆయనను ప్రజానీకంలో ఆదర్శంగా కొనియాడారు. సభాధ్యక్షులు నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ "రాజశేఖర్ అంకితభావం, విశ్వసనీయతే ఆయన్ను విజయపథంలోకి నడిపించాయి. ఇది ప్రతి



విద్యావేత్తకు గర్వకారణం," అని పేర్కొన్నారు. డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ, "నిజాయితీతో నిండి ఉన్న నాయకులకు ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉంటారు. రాజశేఖర్ విజయం నిబద్ధతకి నిదర్శనం" అన్నారు. బిజెపి కాకినాడ అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వర రావు మాట్లాడుతూ, "రాజశేఖర్ లో ఉన్న సమగ్రత, సమర్థత వలనే విజయం సాధ్యమైంది," అని కొనియాడారు. ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ ఎన్. సతీష్ రెడ్డి మాట్లాడుతూ, "నైతిక విలువలతో కూడిన రాజకీయ జీవితం ఎప్పుడూ ప్రజల మదిలో నిలుస్తుంది. రాజశేఖర్ ఆ మార్గంలో సాగుతున్నారు" అన్నారు. ఆదిత్య డిగ్రీ & పీజీ కళాశాల డైరెక్టర్ ఎన్. సుగుణ రెడ్డి మాట్లాడుతూ, "రాజశేఖర్ సమన్వయంగా అందరితో ముందుకెళ్లాలనే తపన కలిగి ఉండటమే ఆయన ప్రజాదరణకు కారణం" అని అభినందించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. సన్మాన గ్రహీత, ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్.ఎల్.సి. పేరాబత్తుల రాజశేఖర్ తన ప్రసంగంలో, "ఇంత ప్రేమతో, ఆత్మీయతతో పిలిచి సత్కరించిన ఆదిత్య విద్యాసంస్థల అధినేతకు, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులకు, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాల నేతలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నా నన్నారు. ఈ ఘనత నాకు కాకుండా, మీ అందరి ఆశీర్వాదానికి ఫలితం," అని పేర్కొన్నారు.

# గోదావరి మత్స్య సంపదకు ప్రోత్సహించేలా చర్యలు



**మామిడికుదురు, జూన్ 29 , ( ప్రభాతవార్త ) :** గోదావరి నుంచి వచ్చే మత్స్య సంపదకు మరింత విలువ కల్పించే దిశగా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని గోదావరి ఫిష్ ఫార్మర్స్ చైర్మన్ కొల్లు శివరామ్ తెలిపారు. పాశర్లపూడి గ్రామంలోని శ్రీరామ్ పేట లో ఆదివారం గోదావరి ఫిష్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సభ్యత్వం పై అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రతీ ఒక్క మత్స్య కారుడు సొసైటీలో విధిగా సభ్యత్వం తీసుకుని సొసైటీలో భాగ్యస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొన్నమండ దుర్గా ప్రసాద్,పొన్నమండ ధర్మరాజు,ఆక్సిజన్ అస్సోసియేషన్ సభ్యుడు కటికిరెడ్డి గంగాధారం, సోసైటీ సిఇఓ తరుణ్ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులు కళల నైపుణ్యం ద్వారా సులువుగా ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చు : ప్రముఖ మనస్తత్వవేత్త శ్యామ్ జాదూగర్

**ఆత్రేయపురం, జూన్ 29 , ( ప్రభాతవార్త )** విద్యార్థులు వారి చదువుతో పాటు వారికి ఇష్టమైన కళలలో నైపుణ్యం పొందడం ద్వారా వారు చేరుకోవాలనే లక్ష్యాలు సులువుగా చేరుకోవచ్చుని ప్రముఖ మనస్తత్వవేత్త చింతా శ్యామ్ కుమార్(శ్యామ్ జాదూగర్) అన్నారు. డాన్స్ లో విశేష ప్రతిభ కనబరుస్తూ అందరి చేత మన్ననలను పొంది ఈ మధ్యకాలంలో పదో తరగతిలో ఉత్తమమైన ఫలితాలను సాధించి త్రిబుల్ ఐటీ కి ఎంపిక అయిన అను సకల కళల ఉచిత శిక్షణా కేంద్రం చిన్నారులు పెండం నాగేశ్వరి, కోపెల్ల భారతి లు రుజువు చేశారని వీరిని నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని శ్యామ్ నేటి విద్యార్థులకులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారిని అన్నపూర్ణ డే కేర్ హోమ్ లో ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యా



ర్థులు భారతి, నాగేశ్వరిలు మాట్లాడుతూ మేము ఒక ప్రక్క డాన్స్ నేర్చుకుం టూ మాలోని మానసిక ఒత్తిడి తగ్గించుకుని సరైన ప్రణాళిక తో మేము త్రిబుల్ ఐటీ లో సీట్ సాధించ గలిగామని అన్నారు. అనంతరం చిన్నారులు వృద్ధులకు మ్యాజిక్ ఫ్యామిలీ ఏర్పాటుచేసిన అల్పాహారాన్ని సేవ చేసి వారి ఆనందాన్ని వృద్ధులతో పంచుకున్నారు. కార్యక్రమంలో మ్యాజిక్ ఫ్యామిలీ సభ్యులు శ్యామ్, అన్నపూర్ణ, డాక్టర్ మోహిత్, తేజశ్రీ లు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**మామిడికుదురు , జూన్ 29 , ( ప్రభాతవార్త ) :** నగరం గ్రామంలోని భారత్ నగర్ కు చెందిన దేవ పెద్దిరాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. నిరుపేద కుటుంబం అయిన పెద్దిరాజు కుటుంబానికి స్థానిక వైసీపీ నాయకుడు నీతిపూడి గణేష్ బాబు రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందించారు. ఈ మొత్తాన్ని మృతుని కుమారుడు అబ్రహం పేరున బ్యాంకులో ఫిక్సడ్ డిపోజిట్ చేసి ఆ బాండ్ ను మృతుని భార్య దేవ సువర్ణకుమారికి అందించారు. ఆమెకు దుస్తులు కూడా అందించారు. ఈ కార్యక్రమంలో నీతిపూడి గణపతిరావు,దేవ ప్రసాద్, యాలంగి శేషగిరిరావు,దేవ గంగాధర్, శ్రీనుబాబు, యల్లమిల్లి సత్యనారాయణ,బత్తుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తలుపులమ్మ లోవకు పోటెత్తిన భక్తులు

**తుని ( రౌతులపూడి ) , జూన్ 29 , ( ప్రభాతవార్త ) :** తుని మండలంలోని శ్రీ తలుపులమ్మ తల్లి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయం తెరుచు సమయములో ఉదయం గం.6.00 ల నుండి సాయంత్రం గం.6.00 ల వరకు మాత్రమే సుమారు 35,000 మంది శ్రీ అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రసాదముల విక్రయం ద్వారా రూ 3,58,840లు, పూజా టిక్కెట్లు ద్వారారూ 3,42,440లు,కేశకండన టిక్కెట్లు ద్వారా రూ25,720లు వాహనపూజలు టిక్కెట్లు ద్వారా రూ13,290 లు,కాటేజీలు ద్వారారూ 1,09,692లు ఇతర మిసిలేనియస్ డొనేషన్లు ద్వారా రూ1,50,324లు వెరసి మొత్తం రూ 10,00,306లు ఆదాయం వచ్చినదని కార్య నిర్వహణాధికారి



**కోర్ట్ మూవీ హీరోయిన్ అమ్మవారు దర్శనం చేసుకోవడం జరిగింది**

పి.విశ్వ నాథరాజు తెలిపారు. ఆదివారం కోర్టు మూవీ హీరో యిన్ అమ్మవారిని దర్శించుకున్నారు. వేద పండితులు ఆమెకు ఆశీర్వచనం చేశారు. అమ్మవారి చిత్రపటాన్ని ఈవో విశ్వనాథరాజు అందజేశారు.

# జగ్గంపేటలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



**జగ్గంపేట, జూన్ 29 , ( ప్రభాతవార్త ) :** జగ్గంపేటలో ఎస్సై రఘునాథరావు తన సిబ్బందితో ఆదివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడితే కోర్టు ద్వారా ఒక్కొక్కరికి పదివేల రూపాయల ఫైన్ విధించడం జరుగుతుందన్నారు. ఫైన్ కట్టలేని పక్షంలో జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనంపై ప్రయాణించే ఇద్దరు వ్యక్తులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ద్విచక్ర వాహనానికి నెంబర్ బోర్డు,రికార్డు, డ్రైవర్ కు లైసెన్స్ ఉండాలన్నారు. బైక్ త్రిబుల్ రైడింగ్ చేసిన, మైనర్లకు బైకులు ఇచ్చిన కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రఘునాథరావు హెచ్చరించారు.

# సత్యదేవుని ప్రసాదానికి క్యూలైన్లలో బారులు తీరిన లోవ భక్తులు





**అన్నవరం, జూన్ 29 , ( ప్రభాతవార్త ) :** అన్నవరం మీదుగా తుని మండలం తలపులమ్మ తల్లి లోవ ఆలయానికి వెళ్ళి మొక్కులు చెల్లించుకుని తిరుగు ప్రయాణంలో భక్తులు అధిక సంఖ్యలో సత్యదేవుని ప్రసాదం కొనుగోలు చేస్తుంటారు. ఆషాడ మాసంలో లోవ నుండి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఆషాడ మాసం ఆదివారాల రోజు బైపాస్ రోడ్ నందు గల రెండు ప్రసాదం కౌంటర్లతో పాటు స్వామి వారి మెట్లమార్గం వద్ద గల ప్రసాదం విక్రయ కేంద్రాలు వేలాది భక్తులతో రద్దీగా మారతాయి. ఆషాడ మాస మొదటి ఆదివారం సందర్భంగా తలుపులమ్మ లోవ నుండి వివిధ వాహనాల ద్వారా తిరిగి వచ్చే భక్తులతో అన్నవరం బైపాస్ రోడ్డు ప్రాంతం అనేక వాహనాలతో కిటకిటలాడింది. సత్యదేవుని పాత నమూనాలయానికి ప్రసాదం కొరకు వచ్చే భక్తుల తాకిడి అధికమైంది. బారీ క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామి వారి ప్రసాదం కొనుగోలు చేసారు. ఈ ఒక్క కౌంటర్ ద్వారా సుమారు 25 వేలకు పైగా ప్రసాదం ప్యాకెట్లు విక్రయించారు. కొండపైన, కొండదిగువ, బైపాస్ రోడ్డు నందుగల ప్రసాదం విక్రయ కేంద్రాల ద్వారా సుమారు 75 వేల ప్రసాదం ప్యాకెట్లు భక్తులు కొనుగోలు చేసారు. భక్తుల రద్దీకి అనుగుణంగా, ప్రసాదం విభాగం అధికారి పోల్నాటి లక్ష్మీ నారాయణ విక్రయ కేంద్రాల వద్ద ప్రసాదం ప్యాకెట్లు సిద్ధం చేసారు. ఎక్కడా కొరత రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. బైపాస్ రోడ్డు ప్రాంతంలో అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

# గోపాలపురంలో జర్నలిస్టుల నిరసన ర్యాలీ, ధర్నా

**గోపాలపురం, జూన్ 29 , ( ప్రభాతవార్త ) :** మహా న్యూస్ ఛానెల్‌పై జరిగిన దాడిని గోపాలపురం ప్రెస్ క్లబ్ సభ్యులు, నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు ఖండించారు. దాడికి నిరసనగా ఆదివారం మండల కేంద్రమైన గోపాలపురంలో ర్యాలీ చేపట్టారు. స్థానిక చెక్ పోస్ట్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు 'జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి, సేవ్ జర్నలిజం' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పోలీసులకు అందజేశారు. ఈ నిరసన ర్యాలీలో జనసేన నియోజకవర్గ ఇన్ ఛార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు పాల్గొని మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం మీడియాకు నాలుగవ స్థంభంగా విలువనిచ్చిందని, అలాంటి భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడం బాధకరమన్నారు. పొరపాటు జరిగితే న్యాయబద్ధంగా పోరాడలే తప్ప, దాడులకు దిగడం



సరైనది కాదన్నారు. ఏఎంసీ డైరెక్టర్ కూనపోం ప్రసాద్ మాట్లాడుతూ.. మీడియాపై దాడికి ప్రోత్సహించిన వారిని, దాడి చేసిన వారిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భౌతిక దాడులకు దిగడం సరైనది కాదని, తెలుగుదేశం పార్టీ తరపున దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానికి మీడియా ప్రతినిధులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయుడు భాస్కరరావుని ఆదర్శంగా తీసుకోవాలి



**గండేపల్లి , జూన్ 29 , ( ప్రభాతవార్త ) :** గండేపల్లి మండలం ఎన్ టి రాజాపురం గ్రామంలో మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న ఉండవల్లి సూర్య భాస్కరరావుని ప్రతీ ఉపాధ్యాయుడు ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని పదవి విరమణ సభలో పలువురు వక్తలు అన్నారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ బెంగళూరు, బొంబాయి, చెన్నై,విశాఖపట్నం, హైదరాబాద్ వంటి మహానగరాల నుండే కాకుండా విదేశాల నుంచి కూడా నా చిన్ననాటి మిత్రులు, గురువులు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు వృత్తి కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పని చేయాలన్నారు. ఎంతో మందిని తీర్చిదిద్దే అవకాశం ఒక ఉపాధ్యాయ వృత్తికే ఉందన్నారు. తాళ్లూరు, రంగంపేట,కోటపాడు, ఎన్టీరాజా పురం తదితర గ్రామాలలో పని చేశానని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాయక్,కోర్పు లచ్చయ్య దొర, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, పాల్గొన్నారు.

# దాడిశెట్టి రాజా తో ముద్రగడ సమాలోచనలు

**తుని ( రౌతులపూడి ) , జూన్ 29 , ( ప్రభాతవార్త ) :** కష్టకాలంలో పార్టీని అభివృద్ధి పరచే విధముగా కార్యకర్తలను సమాయత్తం చేయాలని దాడిశెట్టి, ముద్రగడ సమాలోచనలు చేశారు. ఆదివారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజాను తన స్వగృహంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిఎసి సభ్యులు ముద్రగడ పద్మనాభం, ప్రతిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు ఇచ్చిన బాబు షూరిటీ, మోసం గ్యారెంటీ ని ప్రజల్లోకి తీసుకెళ్లే విధానాన్ని వారిరువురూ చర్చించారు. కూటమి ప్రభు



త్వం ఇచ్చిన హామీలుఏడాది పాలనలో నెరవేర్చ లేకపోయిందని, గ్రామాల్లోప్రజలకు తెలియజేస్తే భవిష్యత్తు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దేనని అన్నారు. మరల ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టే వరకు పార్టీకి అండగా నిలవా లన్నారు. ఈయన వెంట నరిశే శివాజీ, గౌతు స్వామి ఉన్నారు.

# గుంతలు పూడ్చిన సామర్లకోట ట్రాఫిక్ ఎస్సై గరగారావు



**సామర్లకోట, జూన్ 29 , ( ప్రభాతవార్త ) :** సామర్లకోట మండలం మాధవపట్నం జంక్షన్ వద్ద గుంతలు పడటంతో వాహనదారులు ప్రమాదాల కు గురవుతున్నారని సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు స్పందించి ఆయన తన సిబ్బందితో కలిసి రైల్వే కాంట్రాక్టర్ తో చర్చించి రెండు లారీలు గ్రావెల్ రెండు లారీలు ప్లైయాష్ తో గుంతలు పూడ్చి వేశారు. వాహందారులు ఆయనకు అభినందనలు తెలియజేశారు ఇంత క్రితం కూడా సామర్లకోట ఫ్లైఓవర్ దగ్గర గుంతలు పూడ్చారు ఆయన సేవాభావాన్ని అందరూ మెచ్చుకుని అభినందిస్తున్నారు.


Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# మహిళా కేడెట్‌లకు ఆమె స్ఫూర్తి..




సృష్టి దక్ష నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీఏ) చరిత్రలో తనకంటూ ప్రత్యేక పేజీ రాసుకుంది. ఎన్డీఏ 148వ స్నాతకోత్సవంలో బీఏ డిగ్రీ 59మంది పట్టా పొందగా వారిలో టాపర్‌గా విజయం సాధించింది. చదువులోనే కాదు ఇతర విభాగాల్లోనూ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి అంకితభావం, పట్టుదల, ప్రతిభకు లింగ వేదం ఉండదని నిరూపించింది. 'మిలిటరీ శిక్షణ, చదువు తర్వాత అయినా బ్యాలెన్స్ చేసుకోవడం కఠినమైన సవాలుగా ఉంది. అయినా మొదటి సెమిస్టర్ నుంచీ సమ ప్రాధాన్యత ఇచ్చి అంకితభావంతో పనిచేశాను.

అదే నన్ను క్లాస్‌లో ముందుండేలా చేసింది అని చెప్పే సృష్టి పదో తరగతిలో 95 శాతం ఇంటర్మీడియట్‌లో 98 శాతం మార్కులతో పాసైంది. సృష్టి తండ్రి వింగ్ కమాండర్(రిటైర్డ్) యోగేష్ కుమార్ ఆయన ఎన్డీడిఎ కేడెట్ శిక్షణలో ఉన్నారు. తీసుకున్న హంటర్ స్క్వాడ్రన్‌నే తనూ ఎంపికచేసుకుంది. 'హంటర్ స్క్వాడ్రన్‌లో చేరతానన్నప్పుడు ఎంతో గర్వంగా పీలయ్యా కానీ దానికున్న ఘనమైన చరిత్రను గుర్తుచేసి శారీరక శిక్షణ కఠినంగా ఉంటుందని చెప్పా కానీ ఆమె అందరినీ అధిగమించడమే కాదు, నాకంటే 'ఎక్కువ ప్రశంసలు అందుకుంది' అంటూ ఆనంద బాష్పాలు రాల్చారు యోగేష్ ఎన్డీడిఎలో చేరాలనుకుంటున్నట్టు సృష్టి చెప్పినప్పుడు ఆమె నోయిడా3లోని ఒక మైదానానికి తీసుకెళ్లి కొన్ని రౌండ్లు పరిగెత్తమన్నారట యోగేష్. అప్పటికి ఆమె ఫిట్‌నెస్ అంత గొప్పగా లేదు. కానీ కొద్ది వారాల్లోనే ఎంతో మెరుగుపడింది. మూడేళ్ల కిందట తొలిసారిగా ఎన్‌డిఎలో లో చేరడానికి మహిళల్ని అనుమతించారు. 17 మంది మహిళా కేడెట్‌లు తొలి బ్యాచ్‌లో శిక్షణ ముగించుకుని తాజాగా పట్టా అందుకున్నారు. త్వరలో వీరంతా సైనికులతో చేరనున్నారు. భవిష్యత్తులో మరింత మంది అమ్మాయిలు ఎన్‌డిఏలో చేరేందుకు సృష్టి, ఇతర మహిళా కేడెట్‌లు స్ఫూర్తిగా నిలుస్తారనడంలో సందేహం లేదు.

**చెలి చిట్కా**

★ మిక్సీలో ఎండుద్రాక్ష వేసేటపుడు కొద్దిగా నిమ్మరసం కలపితే ద్రాక్షలు బ్లేడ్‌కు అంటుకోకుండా వుంటాయి.
★ కొత్తమీర పొడికి కొద్దిగా ఉప్పు నిల్వవుంచితే ఎక్కువ కాలం తాజాగా వుంటుంది.
★ అమ్లేట్ లావుగా రావాలంటే సొన గిలకొట్టాక కొద్దిగా నీరు కలపాలి.

# సంప్రదాయ విధానంతో వ్యాపారం

**ఆరోగ్యం కోసం సేంద్రియ కాయగూరలు, ఆకుకూరల వైపు మొగ్గు చూపుతున్న వారెందరో! అవి మాత్రమే చాలా? వంటకు ఉపయోగించే నూనెలూ స్వచ్ఛమైనవి అయితేనే కదా ఆరోగ్య ప్రయోజనాలు అందేది. ఇదే ఆలోచించారు బొబ్బల జ్యోతి సంప్రదాయ విధాన తీస్తూ ఉపాధినీ అందుకుంటున్నారు.**



భర్త ప్రకృతి వ్యవసాయం చేస్తారు. ఇంట్లో వంటకాలు వాటితోనే అయినా జీర్ణ సంబంధ సమస్యలు తప్పలేదు జ్యోతి కుటుంబానికి అప్పుడే గానుగ నూనెపై అవగాహన వచ్చిందామెకు. అయితే వాటిని తన కుటుంబానికే కాదు, ఇతరులకూ అందిస్తే ఉపాధినీ పొందొచ్చు అనుకున్నారు. అందుకే జ్యోతి నేచురల్ ఫార్మింగ్. ఈమెది నల్గొండ జిల్లాలో రాములబండ ఆలోచన రాగానే దాని గురించి తెలుసుకోవడం మొదలుపెట్టారు యంత్రాలతో తీసేవి ఖర్చు ఎక్కువ కాబట్టి సంప్రదాయ పద్ధతిలో ఎద్దులను తిప్పుతూ తీసేందుకు ప్రయత్నించారు. ఇప్పటికీ ఈ ప్రదర్శన వారి వద్దకు వెళ్లి అవగాహన తెచ్చుకున్నాడు. ఆపై వసాయంతో చెక్క గానుగలు, రోళ్లు సిద్ధం చేసుకున్నారు. వ్యవసాయ కుటుంబమే కాబట్టి సాగు పనికొస్తుందని 11 ఎద్దులను కొనుగోలు చేశారు. మూడు గ్రామాలకు మూడు ఎద్దులు పనిచేస్తాయి. గంటకోసారి వీటి స్థానాన్ని వేరేవి భర్తీ చేసేలా ప్లాన్ చేసుకున్నాడు. పల్లీ, నువ్వులు, కొబ్బరి.. నుంచి నూనె తీకాక వచ్చే పిట్టు వంటివి ఎద్దులకే దాణాగా పెడతారు దీంతో వాటికీ ఆరోగ్యకరమైన ఆహారం. జ్యోతి ఇంటర్ కూడా పూర్తిచేయలేదు. ఇద్దరు చిన్నపిల్లలు చూసుకుంటూనే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఉదయం నాలుగింటికే లేచి పనులన్నీ చకచకా పూర్తిచేసు కొని ఏడింటికలా నూనె పరిశ్రమకి వస్తారు. సాయంత్రం ఆరింటివరహా ఇక్కడే ఎదులను శుభ్రం చేయడం, రాజా, నీరు పెట్టడం.. ఎద్దులను శుభ్రం చేయడం, దాణా, నీరు పెట్టడం, ఎద్దుమోపుపై చెక్క గానుకను బిగించి తిప్పడం.. వంటివన్నీ పనివాళ్లతోపాటు ఆమె కూడా చేస్తారు. చెక్క గానుగను బిగించి తిప్పడం. వంటివన్నీ పనివాళ్లతోపాటు ఆమె కూడా చేస్తారు.

**రూ. 30 లక్షల వ్యాపారం ..**

73 కిలోల పల్లీలకు 55 లీటర్ల నూనె వస్తుంది. దీన్ని మూడుగంటలకు పైగా ఎండలో ఉంచుతాం. అప్పుడు తెట్టులా తేలుతుంది దాన్ని తొలగించి, సీసాలలో పోసి నూనె అమ్ముతాం దీనికోసం రెండు గంటల పాటు దాదాపు వందల సార్లు ఒక ఎద్దు గానుగ చుట్టూ తిరుగుతుంది. ఎద్దును అదుపు చేయడానికి ఈ యంత్రం మీద నేనూ కూర్చుంటా. ఎండ వేడికి తోడు ఎద్దుతో పాటు గుండ్రంగా తిరగడంతో కళ్లు తిరిగి పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. నెమ్మదిగా అలవాటు చేసుకున్నా అనే జ్యోతి. ఆముదం, కుసుమ, సన్‌ఫ్లవర్, అవిసె, తెల్ల/నల్ల నువ్వులు, ఆవాల నూనెలు సైతం తయారు చేస్తారు. ఏడాదికి దాదాపు రూ.30లక్షలు వ్యాపిస్తున్నారు. మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు.

# సువాసన రోజ్‌మేరీ !



సన్నటి ఈనెల్లాంటి ఆకులతో ..

**గాఢమైన పరిమళాన్ని పంచే మొక్క రోజ్‌మేరీ. మధ్యధరా వంటకాల్లో ఎక్కువగా వాడే ఈ ఆకులకు, కొమ్మలకు ఆరోగ్య ప్రయోజనాలెక్కువట. అందుకే వీటితో చేసే హెర్బల్‌టీ తాగమంటున్నారు పోషకాహార నిపుణులు.**

★ తాజా రోజనమేరీ ఆకులతోపాటు ఎండిన వాటతో టీ తయారు చేసుకుని తాగొచ్చు. ఇందులోని యంటీ ఆక్సిడెంట్లు, ఫాలీఫెనాల్స్.. జీర్ణశక్తికి తోడ్పడి ఎంజైమ్‌ల ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. అజీర్తి, ఉబ్బరం, గ్యాస్ వంటివి అదుపు చేస్తాయి. జీవక్రియల్ని వేగాన్ని పెంచుతాయి. అంతేకాదు, అతిగా తినే అలవాటుతో పాటు బరువుని తగ్గించే గుణాలూ దీనికి ఉన్నాయి. ★ రోజ్‌మేరీలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా వీటిల్లోని రోస్మరినిక్ యాసిడ్, కార్నోసిక్ యాసిడ్ చాలా శోక్తిమంతమైనవి. ఇవి శరీరానికి హానికలిగించే ఫ్రీరాడికల్స్‌తో పోరాడతాయి. దాంతో వ్యాధుల ముప్పు తగ్గుతుంది. ఈ మూలికా మొక్కలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అధికం. ఒంట్లోనివాపుల్నీ, కీళ్లూ, కండరాల నొప్పుల్ని తగ్గించే సుగుణాలు ఇందులో ఉన్నాయి. నొప్పుల్నీ నియంత్రిస్తాయి. ★. మనసు అలజడిగా ఉన్నప్పుడో, పని ఒత్తిడితో అలసటగా అనిపించి నప్పుడో ఓ కప్పు రోజ్‌మేరీ చాయ్ తాగి చూడండి. ఎంత హాయిగా ఉంటుందో! ఇందులో పుష్కలంగా ఉండే థయామిన్ నరాల పనితీరుని మెరుగుపరు స్తుంది. హాయిగా నిద్రా పడుతుంది.

# కురులు వేగంగా పెరగాలా?



పుట్టు కుచ్చులా అందంగా, పొడవుగా ఉండే కురులు.. కోరుకోని అమ్మాయి ఉంటుందా? కానీ ఈ సంప్రదించేవారు. మరి ఇప్పుడు? అరచేతిలోనే సమాచారం. దాని సలహాతో ఇష్టారీతిన సప్లిమెంట్లను వాడేస్తున్నారు. మీదీ అదే ధోరణా? ఇవి మేలు చేయకపోగా చేటు చేస్తాయి. వాటి ప్రభావం తొలుత పడేది చర్మం, కురులపైనే! నిపుణుల సలహా లేనిదే వాడకపోవడమే మేలు. త్వరగా పెరగవు అని చాలామంది కురులను కత్తిరించడానికి వెనకాడతారు. కానీ రెండు నెలలకో సారైనా ట్రిమ్ చేసుకోవాలి. చిట్లడం, చివర్లు పొడిబారడం కూడా కురుల పెరుగుదలకు అవరోధంగా మారతాయి. కాబట్టి, వాటిని తొలగించడం తప్పనిసరి. జిడ్డు, సమయం లేదని బద్ధకించక వారానికి రెండుసార్లు గోరువెచ్చని నూనెతో తలకు మర్దనా చేయండి. మాడుకి రక్తప్రసరణ బాగా జరుగుతుంది. అలాగే కండిషనర్ వాడకం కూడా తప్పనిసరి. ఇది వాతావరణ పరిస్థితుల నుంచి కురులకు సంరక్షిస్తుంది. దిండు కూడా కేశాల పెరుగుదలపై ప్రభావం చూపుతుందని తెలుసా? సరైన గలేబులను వాడకపోతే అవి కురుల్లోనే సహజ నూనెలను పీల్చేయడమే కాదు, రాపిడికి గురిచేసి వెంట్రుకలు తెగేలానూ చేయగలవు. కాబట్టి, శాటిన్ రకాలనే ఎంచుకోండి. చిన్నవే కదూ.. అందమైన, ఆరోగ్యకరమైన కురుల కోసం పాటించండి మరి.

కాలుష్యానికి ఊడటమే కానీ పెరగడం ఎక్కడుంది? ఈ చిన్న చిట్కాలను పాటిం చండి. వేగంగా పెరుగుతాయి అంటున్నారు నిపుణులు. అవేంటో చూద్దామా? తల ఆరోగ్యంగా ఉండాలంటే తరచూ దాన్ని శుభ్రం చేయడం తప్పని సరి. కానీ ఆరబెట్టడమే పెద్ద పని. అందుకే చాలామంది డ్రైయ్యర్‌ని వాడుతుంటారు. కానీ దాని వేడి కురుల పెరుగు దలను అడ్డుకుంటుందని తెలుసా? స్టైలింగ్, స్టైలింగ్, స్ట్రెయిట్‌నింగ్ కోసం వాడేవే కాదు.. ఎండలో అతిగా తిరగడం, జడను లాగి వేయడం, తువాలుతో తడిపోవాలని కొట్టడం వంటివీ చేటు చేసేవే. వీటికి దూరంగా ఉండండి. కండిషనర్ వెంట్రుకలకు బాగా పడుతుంది. ఇప్పుడైతే చిక్కులు బాగా వస్తాయి. అని తడి తలమీద దువ్వెన ఉపయోగిస్తున్నారా? మేలు చేయడం మాట అటుంచితే కుదుళ్లకు హాని. ఫలితమే కురులు రాలడం. కాబట్టి, తడి వెంట్రుకలు ఆరేవరకూ ఆగండి. తరవాతే దువ్వండి. ఒకప్పుడు సమస్యేదైనా నిపుణులను

## మసాజ్ మంచిదే !

ముఖం మీద స్క్రబ్ రాసుకోవటం మంచిదే. దీనివల్ల మృత కణాలు తొలగి పోతాయి. ముఖ్యంగా దుమ్ము, ధూళి కారణంగా ముఖం మీద అట్టకట్టిన ట్లుంది. దీనివల్ల సిబం ఉత్పత్తి అయి చర్మం జిడ్డుగా మారి రకరకాల సమస్యలు వస్తాయి. అందుకే స్క్రబర్స్‌తో ముఖాం రుద్దుకోవాలి. స్క్రబ్ చేసే ముందు కచ్చితంగా ముఖాన్ని గోరు వెచ్చటి నీటితో కడిగేయాలి. ఆ తర్వాత మెత్తని టవ్‌లో తుడుచుకోవాలి. ఇలా స్మూత్‌గా ఉన్నప్పుడే స్క్రబ్ చేసుకోవాల్సి ఉంటుంది. బొప్పాయి స్క్రబ్, గ్రీన్ టీ స్క్రబ్, కోకనట్-నిమ్మ స్క్రబ్, కుకుంబర్ మింట్ స్క్రబ్. లాంటి చల్లని స్క్రబ్స్ మాత్రమే ముఖం మీద అప్లై చేయాలి. ఇలా చేయటం వల్ల చర్మం చల్లగా ఉంటుంది. స్క్రబర్స్‌తో మరీ గట్టిగా చర్మాన్ని రుద్దుకూడదు.

# ప్రకృతిలోంచి వచ్చిన అందాలు





కాయలూ, పండ్లూ.. సహజంగానే బోలెడంత అందంగా ఉంటాయి. వాటిని ఇంకాస్త అందంగా పేర్చి, చిన్నచిన్నగా కత్తిరించి.. చెట్టుచేమలుగా, బుజ్జి జీవాలుగా తీర్చిదిద్దితే.. వారెవా.. ఎంత సొగసు, సోయగం! ప్రకృతిలోంచి వచ్చిన ప్రకృతిని చూసి ఆనందించండి.










# భక్తి, ఆచారం

**భక్తి, ఆచారం**

మనమంతా కోరుకునేది ఆనందాన్ని. అందుకు మన శ్శాంతినిచ్చే పూజలూ, ఉపవాసాలూ ఎంతగానో తోడ్పడ తాయి. ఉపవాసం గురించి ఆధ్యాత్మికవేత్తలు మనసు ఎంత నిలకడలేనిదో నాలుక కూడా అంతే చంచలమైంది. అది ఎన్నెన్నో రుచులు కోరుకుంటుంది. ఏవేవో తినాలను కుంటుంది. అలాంటి జిహ్వాచాపల్యాన్ని తగ్గిస్తుంది ఉపవాసం. అంటే కేవలం ఆహారం తీసుకోకపోవ డమే కాదు, పుణ్య దినాల్లో దైవాన్ని స్మరిస్తూ గడపటం. భక్తి పేరుతో అనుసరిస్తున్న ఈ ఆచారం శాస్త్ర ప్రకారమూ మంచిదే. 'ఉపవాసం ఉపకారి' అని మనం గుర్తుంచు కోవాలి. ఉపవాసం శారీరకంగా, మానసికంగా చురుగ్గా ఉండేలా చేస్తుంది. ఉపవాసం పూర్తయ్యాక భక్తిశ్రద్ధలతో దైవాన్ని స్మరించు కోవాలి. తర్వాత.. ఆయా కాలాలకు తగ్గట్టు ఆహారం తీసుకోవాలి. పూర్వ రుషులు కందమూలాలు మాత్రం తిని, సరోవరంలో తేటనీరు సేవించి సంవత్సరాల తరబడి తపస్సు చేసుకునేవారు. ఉపవాసం మంచి దైనప్పటికీ బాలలు, వృద్ధులు, రోగులు అభోజనంగా ఉండకూడదు అంటూ హితవు పలికారు. ఉపవాసం తో తోటివారి ఆకలి బాధ అర్థమవుతుం దనే ఆంతర్యమూ ఉంది. దాంతో అన్న దానం చేయాలనే స్ఫూర్తి కలుగుతుంది. ఇది అత్యుత్తమ దానం. ఆకలితో ఎవరూ తపించ కూడదన్నదే ఉద్దేశం. సాటి మనుషులే కాదు, చుట్టూ ఉన్న మూగజీవాల ఆకలి తీర్చడమూ కర్తవ్యమే. అన్నం మినహా పండ్లు, ఫలహారాలూ అతిగా సేవించడం ఉపవాసం అనిపించుకోదు. ఇది పెద్ద ఉద్దేశానికి ఆటంకమే. అలాగే దేవుడికి కొబ్బరికాయ, పండ్లు, బెల్లం లాంటివి నైవేద్యంగా సమర్పించడంలో ధర్మసూక్ష్మం ఉంది. అవి ప్రసాదంగా తీసు కోవడం వల్ల నీరసం పోయి శక్తి చేకూరుతుంది. ఆహారం అధికమయ్యే కొద్దీ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. పొట్టలో కొంతభాగం ఖాళీగా ఉంటే జీర్ణప్రక్రియ సవ్యంగా ఉంటుంది. అనారోగ్యాలు దరిచేరవు. తామసుగుణాన్ని పెంచే ఆహారం కూడదు. సూర్యా స్తమయం తర్వాతతినకూడదు లాంటివి భక్తి, ఆచారం పేరుతో శ్రేయోదాయకం.

**ఆధ్యాత్మికం**

# పిల్లలకు పంచుకోవడం నేర్పించాలి

**ఎంతో ఇష్టంగా ఆడుకొనే తన బొమ్మను చింటూ మరెవ్వరికీ ఇవ్వడు. కానీ.. పక్కింటి రాహుల్ కారు కావాలని పేచీ పెడుతుంటాడు. పిల్లలు చిన్నప్పటి నుంచి తమవద్ద ఉన్నదాన్ని తోటివారితో పంచుకోవడానికి ఇష్టపడుతూన్నరా లేదా.. తల్లిదండ్రులు గుర్తిస్తుండాలి.** ఎందుటివారి నుంచి తీసుకోవడమే కాకుండా తనవద్ద ఉన్న దాన్నివ్వడం కూడా నేర్పించాలి. లేదంటే ఇది భవిష్యత్తులో వారి వ్యక్తిత్వ లోపమయ్యే ప్రమాదం ఉంది.

పిల్లలు తమ బొమ్మలతో ఇతర పిల్లలనూ ఆడుకోనివ్వాలని చెబితే ఒప్పుకోకపోవచ్చు ఈ అలవాటు రావాలంటే తగిన వాతావరణాన్ని తల్లిదండ్రులు కల్పించాలి. నలుగురైదుగురిని బృందంగా ఒకచోట ఆడుకునేలా ప్రోత్సహించాలి. ఆ సందర్భాన్ని వేదికగా తీసుకున్న ఒకరి బొమ్మలను మరొకరు కలిసి పంచుకోవడమెలాగో నేర్పించాలి. అందరం ఒక్కటే అనే భావన వచ్చేలా చేయాలి. దీంతె తనకెంతో ఇష్టమైన బంతి లేదా కారు బొమ్మను మరొకర పిల్లాడు తీసుకెళ్లి పోతాడేమో అనే భయం నెమ్మదిగా వారిలో దూరమవుతుంది. ఆవతలివాడి వల్ల ఉన్న అందమైన బొమ్మ తన వద్ద లేదనే అసూయా తగ్గుతుంది. ఇతరుల వస్తువులను తీసుకవోడమే కాదు.. తన బొమ్మల్ని వారితో పంచుకునే అలవాటూ ఏర్పడుతుంది.



**సరదా ప్రాజెక్టులు..** ఇంట్లో లేదా మైదానంలో అందరూ కలిసి ఆడుకునేటప్పుడు బాబు చేతిలో అందరికీ సరిపడా బిస్కెట్లో, చాక్లెట్లో ఇచ్చి అందరికీ సమానంగా పంచమన్నాలి. అది వారిలో ఐకమత్య భావనను తెస్తుంది. ఎదుటివారికి ఏదైనాఇచ్చినప్పుడు కలిగే సంతోషం వారికర్థమవుతుంది. పిల్లలందరినీ ఒక చోటచేర్చి క్లే బొమ్మలు వేసిసరంగులేయడం చిత్రలేఖనాలు గీయడం వంటి ఆర్ట్ ప్రాజెక్టులను సరదాగా చేయించాలి. సమష్టిగా చేయించే తోటపని వారి మధ్య స్నేహ బంధానాన్ని పెంచుతుంది. సాయం చేస్తూ .. స్నేహితులతో ఆటవస్తువులు పంచుకోవడమే కాదు తెలియని వారికి సాయం చేయడమెలాగో కూడా బాల్యం నుంచే నేర్పాలి. నెలకోసారైనా అనాథాశ్రమాలకు తీసుకెళ్లి ఆ పిల్లలను పరిచయం చేయాలి. ప్రత్యేక దినాల్లో వారికి కానుకలిచ్చేలా ప్రోత్సహించాలి. ఈ అలవాటు కష్టంలో ఉన్నవారికి సాయం చేయాలనే ఆలోచనలకు చిన్నవయసులోనే బీజం పడేలా చేస్తుంది. ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా దక్కే ఆనందం ఎలా ఉంటుందో కూడా తెలుసుకోగలుగుతారు.

# వీగన్ గుడ్డు !

***ప్రతి ఏడాదీ కొన్ని ఫుడ్ ట్రెండ్స్ మనల్ని పలకరిస్తుంటాయి కదా!*** అలా ఈ సంవత్సరం వచ్చిన వాటిల్లో వీగన్ గుడ్డు ఒకటి. వంటకాల్లో గుడ్డుకు ప్రత్యామ్నాయంగా ఈ వీగన్ వాటిని వాడుతున్నారు. పోషకాలు కూడా అదే స్థాయిలో అందుతాయి.

సాధారణ గుడ్లు తినడానికి ఇష్టపడని వారికి రెస్టరంట్లలో ఈ వీగన్ గుడ్లని ఇప్పటికే ప్రత్యా మ్నాయంగాం వాడుతున్నారు. కోళ్లతో గుడ్డు పెట్టించేందుకు హార్మోన్లని వాడటం, యాంటీబయాటిక్‌లు ఉపయోగించడం, ఈకొలి బ్యాక్టీరియా విస్తరాంచడం, పర్యావరణానికి చేటు వంటి కారణాలతో చాటామంది సాధారణ గుడ్లకి దూరమవుతున్న వేళ ఈ వీగన్ గుడ్లకి ప్రాధాన్యం పెరుగుతోంది. జస్ట్ ఎగ్, జీరోఎగ్, వీగన్ ఎగ్ వంటి సంస్థలు ఈ



ఉత్పత్తులని అందిస్తున్నాయి. టోఫు, అవిసె గింజలు వంటి వాటితో వీటిని చేస్తున్నారు వినియెగించుకోవడమూ తేలిక.

# 'కన్నప్ప' చిత్రానికి అద్భుత విజయాన్ని అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు: థాంక్స్ మీట్‌లో మోహన్‌బాబు



**విష్ణు మంచు** డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' ప్రస్తుతం పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ చిత్రానికి మంచి స్పందన లభించింది. అవా ఎంటర్టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద డా. ఎం. మోహన్ బాబు నిర్మించిన ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్ వంటి భారీ తారాగణం నటించిన ఈ చిత్రం ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది. ఈ మేరకు చిత్రయూనిట్ థాంక్స్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో డా. ఎం. మోహన్‌బాబు మాట్లాడుతూ,ఆ భగవంతుడు ఆశీస్సులతోనే 'కన్నప్ప' చిత్రానికి ఇంత గొప్ప విజయం దక్కింది. మా ట్రైంలో ఓ సినిమాకు ఇన్ని సభలు పెట్టేవాళ్లం కాదు. నటుడిగా 50 ఏళ్లు అవుతోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు నా అభిమానులు నా వెన్నంటే ఉండి నన్ను ముందుకు నడిపిస్తున్నారు. వారికి నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. 'కన్నప్ప' సక్సెస్ తరువాత వాళ్లంతా ఫోన్లు చేసి అభినందనలు తెలియజేస్తున్నారు. వారి ప్రేమకు నేను తిరిగి ఏం ఇవ్వగలను. ఈ చిత్రం కోసం అందరూ ప్రాణం పెట్టి పని చేశారు. అందరికీ హృదయ పూర్వక అభినందనలు. ఆ భగవంతుడి ఆజ్ఞతోనే ఈ సినిమాను తీశామనిపిస్తుంది. అందరి ప్రోత్సాహం ఉండబట్టే ఇక్కడి వరకు రాగలిగాం. వినయ్ లేకపోతే.. కన్నప్ప చిత్రం ఉండేది కాదు. ఈ సినిమాకు పని చేసిన ప్రతీ ఒక్కరికీ హృదయ పూర్వక అభినందనలు అని అన్నారు. విష్ణు మంచు మాట్లాడుతూ,మాలాంటి ఆర్టిస్టులకు ప్రేక్షకులే దేవుళ్లు. వారి ఆదరణ, ప్రేమతోనే మేం ఈ స్థాయికి వస్తాం. 'కన్నప్ప'కు అద్భుతమైన స్పందన వస్తోంది. ఇదంతా శివలీల. 'కన్నప్ప' ను ఇంత గొప్ప సక్సెస్ చేసిన ఆడియెన్స్‌కు థాంక్స్ అని అన్నారు. ముఖేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, 'కన్నప్ప' సినిమా మీద అందరూ ప్రేమను కురిపిస్తున్నారు. ఇంకా సినిమాను చూడాల్సినవాళ్లు చాలా మంది ఉన్నారు. అందరూ ఈ మూవీని చూడండి. మోహన్ బాబు , విష్ణు పదేళ్లుగా ఈ సినిమా కోసం కష్టపడుతూ వచ్చారు. ప్రతీ ఒక్కరూ ప్రాణం పెట్టి ఈ మూవీకి పని చేశారు. అందరికీ ధన్యవాదాలు అని అన్నారు.

మైత్రి శశి మాట్లాడుతూ,కన్నప్పకి అన్ని చోట్లా హౌస్ ఫుల్స్ పడుతున్నాయి. మారు మూల గ్రామాల్లో ఎక్కువగా హౌస్ ఫుల్స్ పడుతున్నాయి. సలార్, పుష్ప లాంటి చిత్రాల తరువాత 'కన్నప్ప'కి కల్వకుర్తి వంటి ఊర్లో థియేటర్లు నిండుతున్నాయి. మల్టీప్లెక్స్, సింగిల్ స్క్రీన్స్ ఇలా అన్ని చోట్లా ప్రభంజనం సృష్టిస్తోంది. 'కన్నప్ప' చిత్రం మున్ముందు భారీ విజయాన్ని నమోదు చేయనుంది. క్లైమాక్స్ చూసి నాకు కన్నీళ్లు వచ్చాయి. విష్ణు అద్భుతంగా నటించారు. ఇప్పుడున్న తరం చూడాల్సిన చిత్రమిది. ఇలాంటి సినిమాను తీసుకు వచ్చిన మోహన్ బాబుకి, విష్ణుకి ధన్యవాదాలు అని అన్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ వినయ్ మహేశ్వరి మాట్లాడుతూ,మోహన్ బాబు ఫ్యామిలీతో నాకు ఎంతో మంచి సంబంధం ఉంది. కన్నప్ప చిత్రం అద్భుతం చేసింది. ఇంతటి ప్రేమను 'కన్నప్ప' దక్కించుకుంది. అందరూ తప్పకుండా చూడాల్సిన చిత్రమిది. విష్ణు ఈ మూవీ కోసం చాలా కష్టపడ్డారు. ఇది అతని డ్రీమ్ ప్రాజెక్ట్. ఇది తరతరాలు నిలిచిపోయే సినిమా అవుతుంది అని అన్నారు. అర్పిత్ రంకా మాట్లాడుతూ, 'కన్నప్ప' కోసం మూడేళ్లుగా విష్ణు, మోహన్ బాబుతో ప్రయాణిస్తున్నాను. వారిని ఎప్పుడూ కూడా ఇంత సంతోషంగా చూడలేదు. అక్కడే మా 'కన్నప్ప' ఎంత సక్సెస్ అయిందో అర్థం అవుతోంది. చాలా నెగెటివిటీని వారు ఎదుర్కొన్నారు. మహాదేవుడు ఎన్నో కష్టాలు పెడుతుంటాడు. కానీ చివరకు ఇలాంటి విజయాన్ని అందిస్తారు. ఈ మూవీ క్లైమాక్స్ చూసి అందరూ ఏడ్చేస్తున్నారు. ఇలాంటి చిత్రాలు అరుదుగా వస్తాయి. అందరూ కన్నప్ప మూవీని చూడండి అని అన్నారు. శివ బాలాజీ మాట్లాడుతూ, 'కన్నప్ప'కి వస్తున్న ప్రేమను చూస్తే నాకు మాటలు రావడం లేదు. విష్ణు ఈ మూవీ కోసం చాలా కష్ట పడ్డారు. తల్లి దండ్రులంతా పిల్లలకు ఇలాంటి చిత్రాలను చూపించాలి అని అన్నారు.

## జులై 3న 'హరి హర వీరమల్లు' ట్రైలర్ విడుదల

**సినీ అభిమానులు** ఎంతగానో ఎదురుచూస్తున్న ప్రకటన వచ్చేసింది. భారతీయ సినిమా చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మకమైన చిత్రాలలో ఒకటైన 'హరి హర వీరమల్లు' ట్రైలర్ ను జులై 3వ తేదీన విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మునుపెన్నడూ చూడని శక్తివంతమైన చారిత్రక యోధుడు వీరమల్లు పాత్రలో కనువిందు చేయనున్నారు. మొఘల్ శక్తిని ధిక్కరించిన ఓ ధైర్యవంతుడి ప్రయాణాన్ని ఈ చిత్రంలో చూడబోతున్నాం.

క్రిష్ జాగర్లమూడి నుంచి 'హరి హర వీరమల్లు' చిత్ర దర్శకత్వ బాధ్యతలు అందుకున్న దర్శకుడు ఎ.ఎం. జ్యోతి కృష్ణ.. వెండితెరపై అద్భుతాన్ని సృష్టించడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారు. తుది మెరుగులు దిద్దుకుంటున్న ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి కూడా తన సహకారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని కలిగించడమే లక్ష్యంగా పని చేస్తూ.. ప్రతి ఫ్రేమ్ విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకుంటోంది చిత్ర బృందం. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన నాలుగు గీతాలకు విశేష స్పందన లభించింది. 'మాట వినాలి', 'కొల్లగొట్టినాదిరో', 'అసుర హననం', 'తార తార' గీతాలు ఒక దానిని మించి మరొకటి శ్రోతలను మెప్పించాయి.

బాబీ డియోల్, నిధి అగర్వాల్‌తో పాటు ఎందరో ప్రముఖ నటీనటులు 'హరి హర వీరమల్లు'లో ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి జ్ఞాన శేఖర్ వి.ఎస్., మనోజ్ పరమహంస ఛాయాగ్రాహకులుగా వ్యవహరిస్తున్నారు. ప్రవీణ్ కె.ఎల్. ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రముఖ కళా దర్శకుడు తోటతరణి నభూతో నభవిష్యతి అన్నచందాన అద్భుతమైన సెట్‌లను రూపొందించారు. ప్రతిభగల సాంకేతిక బృందం సహకారంతో ఈ చిత్రం ఒక దృశ్య కావ్యంగా రూపుదిద్దుకుంటోంది.



ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్న 'హరి హర వీరమల్లు' చిత్రం జూలై 24వ తేదీన తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. చారిత్రాత్మక నేపథ్యంలో అద్భుతమైన నాటకీయత, శక్తివంతమైన ప్రదర్శనలు, ఉత్కంఠభరితమైన యాక్షన్‌తో 'హరి హర వీరమల్లు' చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాలోని ప్రతి సన్నివేశం ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోతుందని చిత్ర బృందం ఎంతో నమ్మకంగా ఉంది. తారాగణం: పవన్ కళ్యాణ్, నిధి అగర్వాల్, బాబీ డియోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్, జిషు సేన్‌గుప్తా, నాజర్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు, నరా ఫతేహి. దర్శకత్వం: జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి, నిర్మాత ఎ.దయాకర్ రావు, సమర్పణ: ఎ. ఎం.రత్నం, బ్యానర్: మెగా సూర్య, ప్రొడక్షన్స్, సంగీతం: ఎం.ఎం. కీరవాణి, ఛాయాగ్రహణం: మనోజ్ పరమ హంస, జ్ఞాన శేఖర్, వి.ఎస్, కూర్పు: ప్రవీణ్ కె.ఎల్, సాహిత్యం: సిరివెన్నెల సీతారామశాస్త్రి, చంద్రబోస్, పెంచల్ దాస్,

## సినిమాల్లోకి రావాలనుకునే వారికోసం 'దిల్ రాజు డ్రీమ్స్': విజయ్ దేవరకొండ

**ఇండస్ట్రీలోకి** రావాలనుకునే కొత్తవారికి సరైన వేదిక అవుతుందనే ఆలోచనతో దిల్ రాజు డ్రీమ్స్ వెబ్‌సైట్‌ని లాంచ్ చేస్తున్నాం కొత్త దర్శకులు, కొత్త నిర్మాతలు, ఆర్టిస్టులు టెక్నీషియన్స్‌కి ఇండస్ట్రీలోకి రావాలని ఉంటుంది. వాళ్లకి సరైన గైడెన్స్ ఉండదు. అలాంటప్పుడు ఏం చేస్తే బాగుంటుందని వచ్చిన ఆలోచనే ఈ దిల్ రాజు డ్రీమ్స్. దిల్ రాజు డ్రీమ్స్ వెబ్ సైట్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ, రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా హాజరై వెబ్ సైట్‌ని లాంచ్ చేశారు.



'దిల్ రాజు డ్రీమ్స్' లాంచింగ్ ఈవెంట్‌లో రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, 13 ఏళ్ల క్రితం పొద్దున లేచిన వెంటనే డాట్ కామ్ అనే వెబ్సైట్‌ని ఓపెన్ చేసే వాడిని. ఎక్కడైనా కాస్టింగ్ కాల్స్ ఉన్నాయా అని చెక్ చేసుకునే వాడిని. ఆ రోజుల్లో ఇంత ఇంటర్నెట్, సోషల్ మీడియా లేదు. శేఖర్ కమ్ముల లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ సినిమా కాస్టింగ్ కాల్ అందులో చూడడం నాకు ఇంకా గుర్తుంది. దానికి అప్లై చేశాను. దాదాపు 6 నెలలు టెన్షన్ పడ్డాను. ఆ టెన్షన్ కూడా ఒక తృప్తిని ఇచ్చేది. ఒక ప్రయత్నం చేస్తున్నాం. ఒక ఆపర్చునిటీ ఉందనే ఆనందం ఉండేది. 16 వేల అప్లికేషన్స్ ఆ సినిమాకి వచ్చాయి. 11 మందిని సెలెక్ట్ చేశారు. అందులో నేను ఉన్నాను. ఆ సినిమా నా జీవితంలో పెద్ద రోల్‌ని ప్లే చేసింది. దిల్ రాజు డ్రీమ్స్‌ని దిల్ రాజుకి ఎందుకు లాంచ్ చేయాలని అనిపించిందో నాకు తెలియదు కానీ ఇది లక్షలాది మందికి ఒక హోప్‌ని ఇచ్చింది. అప్లై చేసిన ప్రతి ఒక్కరికి బెస్ట్ ఆఫ్ లక్. ఇందులో ఒక్కరి కల నెరవేరినా ఈ వెబ్సైట్ లాంచ్ చేయడానికి న్యాయం జరిగినట్టే. ఐదేళ్ల తర్వాత మీలో కూడా ఎవరో ఒకరు ఇలా స్టేజ్ మీద నిలబడి దిల్ రాజు డ్రీమ్స్ ద్వారా తమ డ్రీమ్‌ని నెరవేర్చుకున్నామని చెప్తే చాలా ఆనంద పడతాను. ఇంత అద్భుతమైన ప్లాట్ ఫామ్ క్రియేట్ చేసిన దిల్‌రాజుకి అభినందనలు అన్నారు. రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ మాట్లాడుతూ, ఒక క్రియేషన్ ఒకరి కల. ఆ కలని సాకారం చేసుకోవడానికి సపోర్ట్ చేసేవారికంటే నిరుత్సాహపరిచే వారు ఎక్కువ మంది ఉంటారు. అయితే మన పక్కనున్న వాళ్ళు మనల్ని నిరుత్సాహపరిస్తే మనలో ఒక ఫైర్ రావాలి. ఎంతమంది నిరుత్సాహపరిచినా మీ కలని మీరు నమ్మితే ముందడుగు వేసుకుంటూనే వెళ్ళండి. దానికి బిగ్గెస్ట్ ఎగ్జాంపుల్ దిల్ రాజు, శిరీష్, విజయ్ దేవరకొండ. మన కలని మన లక్ష్యాన్ని మనమే నమ్మాలి. మీ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్. దిల్ రాజు డ్రీమ్స్ అనేది ఒక అద్భుతమైన వేదిక. యాక్టర్స్ డైరెక్టర్స్ టెక్నీషియన్స్‌తో పాటు ప్రొడ్యూసర్స్ కూడా ఒకకాలమ్ కేటాయిం చడం గొప్ప విషయం. ఇది మీ అందరికీ ఒక గొప్ప ప్లాట్ ఫామ్. అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్ అన్నారు.

ప్రొడ్యూసర్ శిరీష్ మాట్లాడుతూ, ఇంతమందిని ఆశీర్వదించడానికి వచ్చిన దేవిశ్రీ ప్రసాద్‌కి, విజయ్ దేవరకొండకి థాంక్యూ. ఇక్కడికి ఎంతోమంది టాలెంట్ ఉన్న వాళ్ళు వచ్చారు. మీ ట్యాలెంట్‌తో ఎదిగిన తర్వాత ఇండస్ట్రీని మర్చిపోవద్దు. ఇది ప్రామిస్ చేసి ఎంటర్ అవ్వండి. మీరు సక్సెస్ అవుతారు. థాంక్యూఅన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, విజయ్, దేవి థాంక్యూ. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ మీద దిల్ సినిమా తర్వాత ఎంతోమంది కొత్త దర్శకుల్ని లాంచ్ చేసాం. వాళ్ళు ఈరోజు సక్సెస్‌ఫుల్ డైరెక్టర్స్‌గా ఇండస్ట్రీలో ఉన్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌లో 57 సినిమాలు పూర్తయ్యాయి. నేను, శిరీష్ కథ విని బాగుందన్న తర్వాతనే స్క్రిప్ట్ నెక్స్ట్ లెవెల్‌కి వెళుతుంది.హర్షిత్ హన్సిత దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్ పెట్టి బలగం వేణుతో పాటు నలుగురు కొత్త దర్శకుల్ని పరిచయం చేశారు. వాళ్లు కూడా కొత్త దర్శకులతో అన్ని రకాల సినిమాలు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్త దర్శకులు కొత్త నిర్మాతలు ఆర్టిస్టులు టెక్నీషియన్స్ ఇండస్ట్రీ ఇండస్ట్రీలోకి రావాలని ఉంటుంది. వాళ్లకి సరైన గైడెన్స్ ఉండదు. అలాంటప్పుడు ఏం చేస్తే బాగుంటుందని వచ్చిన ఆలోచన ఈ దిల్ రాజు డ్రీమ్స్. దిల్ డ్రీమ్స్ సంస్థని ఒక యంగ్ జనరేషన్ టీంతో ఫామ్ చేసాము. చాలామంది నిర్మాతలుగా రావాలనుకుంటారు. వాళ్ళు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు గాని సినిమాని ఎలా మొదలు పెట్టాలి ఎలా కంప్లీట్ చేయాలో క్లారిటీ ఉండదు. కొంతమంది సినిమా తీశాము వీడియో చూడండి అని చూపిస్తుంటారు. సినిమా తీయడం ముఖ్యం కాదు సినిమాని తీసి ప్రేక్షకులు దగ్గరికి తీసుకెళ్లడం పెద్ద టాస్క్, అందరికీ సినిమాల్లోకి రావాలని పాషన్ వుంది. కానీ రైట్ ప్లాట్ ఫామ్ వాళ్లకి దొరకదు. అలాంటి రైట్ ప్లాట్ ఫామ్‌ని క్రియేట్ చేయడానికి దిల్ రాజు డ్రీమ్స్ వెబ్సైట్ లాంచ్ చేస్తున్నాం. సినిమాలోకి రావడం ఇక్కడ రాణించడం అంత ఈజీ కాదు. వందమంది దర్శకులు కావాలని ప్రయత్నిస్తే అందులో ఐదు మందికి ఛాన్స్ వస్తుంది.ఒకరు హిట్ సినిమా తీస్తారు. అంటే ఇక్కడ సక్సెస్ అనేది అది మీరు దృష్టిలో పెట్టుకోవాలి. సినిమా కోసం మీరు చేస్తున్న వర్క్‌ని విడిచిపెట్టకండి. సినిమా వల్ల మన ఫ్యామిలీ ఎఫెక్ట్ అవ్వకూడదు. మేము కూడా ఇక్కడ స్ట్రగుల్స్ పడ్డాం. అయితే వదలకుండా ప్రయత్నించాం. సాధించాం. నిజానికి సినిమా ఇండస్ట్రీలో మనం రాణించగలుగుతామా లేదా అనేది మీకే తెలియాలి. మీపై మీకు నమ్మకం ఉండాలి. సినిమా అనేది ఒక అట్రాక్షన్. అది లాగుతుంటుంది. జీవితాలు మీద ఇంపాక్ట్ పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీదే. ఎప్పుడైతే మీరు సినిమాలో సక్సెస్ అవుతున్నారని మీకు అర్థం అవుతుందో అప్పుడు మీరు 24 గంటలు కష్టపడాలి. సినిమా అంటేనే హార్డ్ వర్క్. 'దిల్‌రాజు డ్రీమ్స్' ద్వారా మేము ఒక ప్లాట్‌ఫామ్ క్రియేట్ చేస్తున్నాం. దీనికి మీరు అప్లికేషన్స్ ఇవ్వచ్చు. దానిలో టీమ్ స్క్రూటినీ చేసి మెజారిటీ పీపుల్ లైక్ చేసిన తర్వాత మా దగ్గర పంపిస్తారు. మేము టైం స్పెండ్ చేసి దాన్ని ఒకే చేస్తాము. కానీ చాలామంది రిజెక్ట్ అవ్వచ్చు. అంతమాత్రాన నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదు. మీలో కాన్ఫిడెన్స్‌ని దృష్టిలో పెట్టుకొని మీరు ప్రయత్నిస్తూనే ఉండాలి. అప్పుడే సక్సెస్ వస్తుంది. 'దిల్ రాజు డ్రీమ్స్' లో ఒక ప్రొడ్యూసర్ కాలమ్ కూడా పెడుతున్నాం. ఈవెంట్‌కి రావడానికి పదివేల రిజిస్ట్రేషన్ వచ్చాయి. వరల్డ్ వైడ్‌గా లక్ష నుంచి రెండు లక్షల మంది సినిమా ఇండస్ట్రీలోకి రావడానికి ఈ ప్లాట్ ఫామ్ ని వాడుకోవడానికి సిద్ధంగా ఉన్నారని నాకు అర్థం అవుతుంది. అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్‌అన్నారు.

## 'అలలు లేని సముద్రం' ట్రైలర్ లాంచ్

**వసంత్, భాగ్యలక్ష్మి,** రమ్య హీరో హీరోయిన్లుగా దర్శకుడు టి.రాము రూపొందిస్తున్న మూవీ అలలు లేని సముద్రం. ఈ చిత్రాన్ని ప్రొడ్యూసర్ రాం రెడ్డి నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. శనివారం సాయంత్రం హైదరాబాద్ ఫిలింఛాంబర్‌లో అలలు లేని సముద్రం సినిమా ట్రైలర్‌ను గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో అతిథిగా వచ్చిన నిర్మాత బాలాజీ నాగలింగం మాట్లాడుతూ, దర్శకుడు రాము నాకు బాగా పరిచయం. ఆయన ఈ సినిమా చేస్తున్నానని చెప్పినప్పుడు ఇండస్ట్రీలో చిన్న చిత్రాలకు పరిస్థితులు అంత బాగా లేవని చెప్పాను. అయినా పట్టుదలగా ఆయన మూవీ రూపొందించారు. అలలు లేని సముద్రం మూవీ ట్రైలర్ బాగుంది. ఈ సినిమాకు




నా వంతు సపోర్ట్ చేస్తా. అన్నారు. అతిథిగా వచ్చిన వేణు మాధవ్ మాట్లాడుతూ అలలు లేని సముద్రం సినిమా ట్రైలర్ చాలా బాగుంది. సముద్రం అంటే అలలు ఉండాల్సిందే. అలలు లేకుండా సముద్రం ఎలా ఉంటుందో ఈ సినిమాలో దర్శకుడు చూపించబోతున్నారు. అన్నారు. నటి రోజారాణి మాట్లాడుతూ, అలలు లేని సముద్రం సినిమాలో నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో పనిచేస్తున్నప్పుడు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా దర్శకుడు రాము మేము నటించేలా చేశారు. ఈ సినిమా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నానని అన్నారు. అతిథిగా వచ్చిన నిర్మాత రామశర్మ మాట్లాడుతూ ఈ రోజుల్లో చిన్న సినిమా నిర్మించడం అంటే కష్టమైన వ్యవహారం. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని దర్శకుడు రాము అలలు లేని సముద్రం సినిమాను రూపొందించాడు. ఈసినిమా టీమ్ అందిరకీ సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నా అన్నారు. అతిథిగావచ్చిన కర్నూలు జిల్లా బిజెపి నాయకులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ, నేనూ ఆర్టిస్టు అవ్వాలనే కలగన్నాను. అయితే క్రమంగా పాలిటిక్స్ వైపు వచ్చాను. దర్శకుడు రాము సినిమా మీద ప్యాషన్ ఉన్న వ్యక్తి. ఆయనతో నేను త్వరలోనే ఓ సినిమా నిర్మించబోతున్నాను. మంచి కథ తయారు చేసుకోమని చెప్పానుఅన్నారు. దర్శకుడు టి.రాము మాట్లాడుతూ, అలలు లేని సముద్రం సినిమా ట్రైలర్ లాంచ్‌కు వచ్చిన మిత్రులు అందరికీ థ్యాంక్స్. మీరంతా నా బలం. మా మూవీ ట్రైలర్ మీ అందరికీ నచ్చిందనే అనుకుంటున్నాను. సినిమా కోసం మా టీమ్ బాగా సపోర్ట్ చేశారు. నా మీద మా నిర్మాత రాంరెడ్డి పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతాను. ఆయన ఈ రోజు ట్రైలర్ లాంచ్‌కు రాలేకపోయారు. ప్రస్తుతం మా మూవీ చిత్రీకరణ దశలో ఉంది. అక్టోబర్, నవంబర్‌లో చిత్రాన్ని విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం అన్నారు.

## 'జిగ్రీస్' క్రేజీ ఫస్ట్ లుక్ విడుదల



**కృష్ణ బురుగుల,** ధీరజ్ అథేర్య, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో మౌంట్ మెరు పిక్చర్స్ ఓ యూత్‌ఫుల్ క్రేజీ ఎంటర్‌టైనర్‌ని నిర్మిస్తోంది. హరీష్ రెడ్డి ఉప్పుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి కృష్ణ వోడపల్లి నిర్మాత. ఈ చిత్రానికి "జిగ్రీస్" అనే క్రేజీ టైటిల్ ఖరారు చేశారు. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా జిగ్రీస్ టైటిల్, ఫస్ట్ లుక్‌ని లాంచ్ చేసి టీంకి ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో ఒక వింటేజ్ మారుతీ 800 కారు పక్కన నిలబడ్డ నలుగురు ఫ్రెండ్స్‌ని పై నుంచి చూపించడం ఇంట్రస్టింగ్‌గా ఉంది. బోల్డ్ ఆరెంజ్ బ్యాక్‌డ్రాప్, గ్రిట్టీ టైటిల్ టైపోగ్రఫీ, సినిమా ఎంత అడ్వెంచరస్‌గా ఉండబోతోందో తెలియజేస్తోంది. ఈ ఫస్ట్ లుక్, టైటిల్ సోషల్ మీడియాలో మంచి బజ్ క్రియేట్ చేసింది. జిగ్రీస్ చైల్డ్‌హుడ్ ఫ్రెండ్షిప్, నాస్టాల్జియా, క్రేజీ అడ్వెంచర్స్, హిలేరియస్ రోడ్ ట్రిప్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోంది. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. ఈశ్వరాదిత్య డీవోపీ, కమ్రాన్ మ్యూజిక్, చాణక్య రెడ్డి ఎడిటర్. త్వరలోనే మరిన్ని వివరాలు మేకర్స్ తెలియజేస్తారు.




## 'ది పారడైజ్' హైదరాబాద్ షెడ్యూల్‌లో జాయిన్ అయిన నాని



**నేచురల్ స్టార్ నాని** తన ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'ది పారడైజ్' లో అడుగుపెట్టారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సినిమాస్ సుధాకర్ చెరుకూరి ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని భారీగా నిర్మిస్తున్నారు. దసరా బ్లాక్ బస్టర్ తర్వాత నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రం కోసం మరోసారి చేతులు కలిశారు. జూన్ 21న షూటింగ్ ప్రారంభమైంది. నాని ఈరోజు సెట్స్‌లో అడుగుపెట్టారు. వారం పాటు సాగిన కీలకమైన చైల్డ్ వుడ్ సన్నివేశాల షూటింగ్‌తో సినిమా జర్నీ ప్రారంభమైంది. ఇప్పుడు నాని ఎంట్రీ ఇచ్చారు "ధగడ్ ఆగయా!" అంటూ అమెజింగ్ అనౌన్స్‌మెంట్‌తో లుక్ రిలీజ్ చేశారు. ఈ 40 రోజుల హైదరాబాద్ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంతో కూడిన పవర్‌ఫుల్ సన్నివేశాలు షూట్ చేయనున్నారు. ప్రత్యేకంగా డిజైన్ చేసిన గ్రాండ్ సెట్స్‌లో షూటింగ్ జరగనుంది. 'దసరా' సినిమా పాన్ ఇండియా అదరగొట్టింది. 'ది పారడైజ్' గ్లోబల్ లెవెల్‌కు వెళ్లబోతోంది. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ 8 భాషలలో విడుదల కానుంది. టైటిల్ పోస్టర్, గ్లింప్స్‌తో సినిమాపై అంచనాలు పెరిగాయి. ముఖ్యంగా గ్లింప్స్‌లో ఉన్న పవర్‌ఫుల్ డైలాగ్, విజువల్స్, రాక్‌స్టార్ అనిరుధ్ రవిచంద్రన్ మ్యూజిక్, నాని స్ట్రాంగ్ ఎంట్రీ ఇవన్నీ సినిమా పై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. మార్చి 26, 2026న 'ది పారడైజ్' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని మేకర్స్ మరోసారి అనౌన్స్ చేశారు.

## ఎయిర్: 'ఆల్ ఇండియా ర్యాంకర్స్' పెద్ద బ్లాక్ బస్టర్ అవుతుంది: హీరో శివాజీ



**సందీప్ రాజ్** షో రన్నర్‌గా హర్ష రోషన్, భాను, జయతీర్థ ప్రధాన పాత్రల్లో జోసెఫ్ క్లింటన్ దర్శకత్వం వహించిన వెబ్ సిరీస్ 'ఎయిర్: ఆల్ ఇండియా ర్యాంకర్స్'. జూలై 3 నుంచి సిరీస్ ఈటీవి విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. హీరోలు శివాజీ, సుహాస్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో శివాజీ మాట్లాడుతూ, చదువు అనేది చాలా అవసరం.' ఆల్ ఇండియా ర్యాంకర్స్' ఈ టైటిల్ వినగానే ఈటీవీలో 90కి మించి మరో పెద్ద బ్లాక్ బస్టర్ సిరీస్ రాబోతుందని నాకు అనిపించింది. ఎందుకంటే ప్రతి ఒక్కరూ దీనికి కనెక్ట్ అవుతారు. చదువు అనేది నేచురల్‌గా చదవాలి. కేవలం ర్యాంక్స్ కోసం చదవడం అనేది ఒక రకమైన హింస. ఈ సిరీస్ అలాంటి తల్లిదండ్రులకి ఒక గుణపాఠం కావాలి. ఈటీవీ విన్ కొత్తరకంగా కథల్ని చెప్పాలని ప్రయత్నం చేస్తుంది. ఇది కూడా చాలా పెద్ద బ్లాక్ బస్టర్ అవుతుంది. అందరికీ థాంక్యుఅన్నారు.

హీరో సుహాష్ మాట్లాడుతూ, ఇందులో పని చేసిన రోషన్ భాను మిషన్ ఇంపాజిబుల్ నుంచి తెలుసు. చాలా మంచి యాక్టర్స్. ఈ సిరీస్‌కి చాలా అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు సంజిత్. డైరెక్టర్ జోసెఫ్ కి ఆల్ ది బెస్ట్. ఈటీవీ నుంచి అద్భుతమైన కంటెంట్స్ వస్తున్నాయి.ఈ సిరీస్ కోసం నేను ఎంతో ఈగర్‌గా ఎదురు చూస్తున్నాను అన్నారు.

షోరన్నర్ సందీప్ రాజ్ మాట్లాడుతూ, జోసెఫ్ ఈ కథని అద్భుతంగా చెప్పాడు. ఈ కథ వినగానే ఇందులో భాగమవాలనిపించింది. చాలా అద్భుతమైన జర్నీ ఇది. అందరికీ కనెక్ట్ అయ్యే కంటెంట్ ఇది. ఈ ప్రాజెక్టులో భాగమైన ప్రతి యాక్టర్‌కి టెక్నీషియన్స్‌కి థాంక్యూ. ఇంట్లో ఫ్యామిలీతో కలిసి చూడండి. చాలా ఎంజాయ్ చేస్తారుఅన్నారు .

డైరెక్టర్ జోషెఫ్ మాట్లాతూ శివాజీకి, సుహాస్‌కి సందీప్‌కి థాంక్యూ. నా స్క్రిప్ట్ విని నన్ను బిలీవ్ చేసిన సాయి నితిన్ సందీప్‌కి థాంక్యూ. మీ అందరికీ ట్రైలర్ నచ్చిందని అనుకుంటున్నాను. ఈటీవీ విన్లో జులై3న తప్పకుండా చూడండి అన్నారు. ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయి కృష్ణ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టుకి కాంట్రిబ్యూట్ చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఇంకో హిట్ కొడతాం. ఇంకో సక్సెస్ మీట్‌లో మళ్ళీ మాట్లాడదాం అన్నారు. ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ మాట్లాడుతూ, ఆల్ ఇండియన్ ర్యాంకర్స్ అద్భుతమైన విజయం సాధించబోతుంది. సందీప్‌రాజు, సుహాస్ మా అందరికీ ఒక ఇన్స్పిరేషన్. యూట్యూబ్లో క్రియేటివ్ కంటెంట్ చేసి డైరెక్టర్స్, స్టార్స్ కావచ్చుని నిరూపించారు. ఎంతోమందికి ఇన్స్పిరేషన్ ఇచ్చారు. జోసెఫ్ ఈ ప్రాజెక్టుని అద్భుతంగా తీర్చిదిద్దాడు. తనకి చాలా మంచి ఫ్యూచర్ ఉంటుంది. ఇందులో నటించిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. తప్పకుండా ఫ్యామిలీతో కలసి చూడండి చాలా ఎంజాయ్ చేస్తారుఅన్నారు.

యాక్టర్ హర్ష రోషన్ మాట్లాడుతూ, అందరికి నమస్కారం.సుహాస్, శివాజీకి థాంక్యూ. ఈ ప్రాజెక్టులో పార్ట్ కావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకి థాంక్యూ. ఈ సినిమాల్లో పని చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు .ఈ ప్రాజెక్టును చాలా ఎంజాయ్ చేసాం. ఆల్ ఇండియన్ ర్యాంకర్స్ అందరికీ కనెక్ట్ అవుతుంది. కామెడీ ఎమోషన్స్ అన్నీ ఉన్నాయి. కచ్చితంగా మీ అందరికీ నచ్చుతుంది అన్నారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో టీం అందరూ పాల్గొన్నారు.



## బేగంపేట ఎయిర్‌పోర్టులో అమిత్‌షాకు

### బిజెపి నేతల ఘన స్వాగతం

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** రాష్ట్ర పర్యటనలో భాగంగా కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షాకు బేగంపేట విమానాశ్రయంలో బిజెపి నేతలు ఘన స్వాగతం పలికారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, డికె అరుణ, రాజా సింగ్‌తోపాటు పలువురు నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనం తరం కిషన్‌రెడ్డితో కలిసి హెలికాప్టర్‌లో నిజామాబాద్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డును జాతికి అంకితం చేసి, అనంతరం కంఠేశ్వర్ బైపాస్‌కు చేరుకుని మాజీమంత్రి డి శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు.

## ఉద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్న ప్రతిపక్షం

### సొంత రాష్ట్రాన్ని శత్రుదేశంగా పరిగణిస్తూ నష్టపరుస్తున్న బిఆర్‌ఎస్: మంత్రి పొన్నం

**హైదరాబాద్, జూన్ 29,ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల,ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేస్తూ ప్రజల అభివృద్ధి సంక్షేమాన్ని ముందుకు తీసుకుపోతుంటే ప్రతిపక్షం ఉద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శలు చేశారు.గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ గత పదేళ్ళ బిఆర్‌ఎస్ నిరంకుశ ప్రభుత్వానికి చరమ గీతం పాడి ప్రజల ఆశీస్సులతో తెలంగాణలో ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులకే ఈ ప్రభుత్వం పడి పోతుం దని శాపనార్థాలు పెడుతూ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర ప్రతిపక్ష నేతలు చేశారని విమర్శించారు. ఎన్‌జివోలు విజులు ప్రజాస్వామ్యంలో వాళ్ళు పిల్లర్స్ 75 సంవత్సరాల చరిత్ర ఉన్న మీకు గత ప్రభుత్వం ఆశలెన్నో చూపెట్టి ఆచరణలో ఏం ఇవ్వలేకపోయారని గుర్తుచేశారు. ఈరోజు ఆర్థిక సంక్షోభం ఉన్న మా ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం ఆచరణలో చూపెడుతుందని వివరించారు.మీరు మేము వేరు కాదని మేము తీసుకున్న నిర్ణయాలు మీరు అమలు చేస్తారని అన్నారు. అదే విధంగా మీరు సూచించే అంశాలు మేము అమలు చేస్తున్నామని తెలిపారు.ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అనుగుణంగా ముందుకు పోతుందని, గత పాలకులు నిరంకుశత్వంగా పరిపాలించి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు. ప్రతిపక్ష బాధ్యతలు వదిలి శత్రుదేశంగా సొంత రాష్ట్రానికి నష్టం కలిగేలా చేస్తున్నారనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు..పక్క రాష్ట్రంలో రాష్ట్రానికి ఏమైనా సమస్య వస్తె అన్నిపార్టీలు కలిసి వస్తాయి అని ఆయన ఉదరహరించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రతిపక్షం కలిసి రావాలనిహితవు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కలిసి రాకున్నా ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తిలాగా బిజెపితో బిఆర్‌ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారని అన్నారు.తెలంగాణ ప్రయోజనాల కోసం బిజెపి, బిఆర్‌ఎస్ నాయకులు ఏం చేశారని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ బాధ్యత రహితంగా మీరు వ్యవహరించినందుకు మీకు సున్నా సీట్లు ఇచ్చారు.రాబోయే కాలంలో మిమ్మల్ని ప్రజలు కనుమరుగు చేస్తారని బిఆర్‌ఎస్‌ను హెచ్చరిస్తూ మంత్రిపొన్నం జోస్యం చెప్పారు.. పొన్నం ప్రభాకర్ చిట్‌చాట్‌లో మాట్లాడుతూ కొడుకుల కారణంగా డిఎస్ ఆత్మక్షోభిస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో ముఖేష్‌గౌడ్ విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు. బిఆర్‌ఎస్ ఓర్వలేక ప్రభుత్వకార్యక్రమాలపై బురద జల్లుతోందని ఆరోపించారు.

## బిసి గురుకుల పాఠశాలలు అదనంగా 119 మంజూరు చేయాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** బిసి గురుకుల పాఠశాలలకు పెద్దఎత్తున డిమాండ్ ఉన్న దృష్ట్యా ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున అదనంగా 119 బిసి గురుకులాల మంజూరు చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభసభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. పాత గురు కులాల్లో వసతి సౌకర్యమున్నచోట 5 నుంచి 8 తరగతి వరకు అదనపు సెక్షన్లు ప్రారంభించాలని, దరఖాస్తు చేసిన ప్రతి విద్యార్థికి గురుకుల సీట్లు ఇవ్వాలని ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.

'ప్రస్తుతం బిసి గురుకుల పాఠశాల అడ్మిషన్లకు లక్షల సంఖ్యలో దరఖాస్తులు రాగా వేల మందికే సీట్లు ఇచ్చారు. ఇంకా లక్షల సంఖ్యలో విద్యార్థులు సీట్లు లభించక ఇబ్బంది పడుతున్నారన్నారు. బిసి జనాభా రాష్ట్రంలో 56 శాతానికిపైగా ఉన్నారని, అదనంగా 119 బిసి గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలి' అని ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. దరఖాస్తు చేసిన ప్రతి విద్యార్థికి గురు కుల పాఠశాలలో సీట్లు ఇవ్వాలని, ముందుకు వచ్చిన వారిని ప్రోత్సహిం చాలన్నారు. బ్రోకర్లను, పైరవీ కార్లను అరికట్టడానికి పోలీసులకు ఫిర్యాదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి ఆర్.కృష్ణయ్య ముఖ్యమంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

## గోదావరి-బనకచర్లపై జూలై 1న పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్

### ముఖ్యఅతిథులుగా ముఖ్యమంత్రి, డిప్యూటీ హాజరు

### హాజరుకానున్న రాష్ట్ర మంత్రివర్గం

### మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణ

**హైదరాబాద్, జూన్ 29,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తల పెట్టిన గోదావరి బనకచర్ల అంశంపై జూలై 1 న రాష్ట్ర ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించాలని నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర ప్రజాప్రతినిధులందరికి నిజ నిజాలు తెలిపే విదంగా ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వాహించేందుకు నిర్ణయం తీసుకున్నారు.

అందుకు అనుగుణంగా ఆయన నీటిపారుదల రంగ అధికారులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించి ఈ ప్రాజెక్టు నిర్మించడం వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు ఏ రకంగా దెబ్బ తింటున్నాయాన్నది సమగ్రంగా వివరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జులై 1 మంగళవారం రోజున డాక్టర్ జ్యోతిరావు పూలే ప్రజా భవన్ లో మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కు ముఖ్య అతిధులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క లతో సహా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం హాజరు కానున్నారు.

అంతే గాకుండా తెలంగాణా రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యసభ,లోకసభ సభ్యులు,శాసన మండలి,శాసనసభ్యులతో పాటు కార్పొరేషన్ చైర్మన్ లు డైరెక్టర్ లు వివిధ విభాగాలకు చెందిన కమిషన్ల చైర్మన్ లు,సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు

# భూమిలేని వ్యవసాయ కూలీలకు శుభవార్త

### త్వరలో 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'కు నిధుల విడుదల

### ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అధికారులు

**హైదరాబాద్ జూన్ 29 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కూలీలకు జూలై మొదటి వారంలో నిధులు విడుదల చేయనుంది. 4,45,304 మంది అర్హులకు రూ.261 కోట్ల ఆర్థిక సహాయం నేరుగా వారి ఖాతాల్లో జమ కానుంది.ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి, కనీసం 20 రోజులు పనిచేసిన కూలీలు ఈ పథకానికి అర్హులు. ఇది పేద వ్యవసాయ కూలీలకు ఆర్థిక భరోసాను ఇస్తుంది. గతంలో రైతుభరోసా నిధులు కూడా విడుదల చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమి లేని వ్యవసాయ కూలీలకు శుభవార్త. పెండింగ్‌లో ఉన్న నిధులను జూలై తొలి వారంలో విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఈ పథకం కింద, రాష్ట్రంలోని భూమి లేని వ్యవసాయ శ్రామికులకు ఏటా2 విడతలుగా మొత్తం రూ.12 వేలు ఆర్థికసాయం అందిస్తుంది. ఇప్పటికే.. తొలి విడతలో 83,887 మంది లబ్ధిదారులకు రూ.6వేల చొప్పున నిధులు జమ అయ్యాయి.ప్రస్తుతం..మిగిలిన 4,45,304 మంది అర్హులకు సంబంధించిన సుమారు రూ.261 కోట్ల నిధులను విడుదల చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.ఈ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంక్‌ఖాతాలకు జమస్తారు. ఈ పథకానికి అర్హులు కావాలంటే.. ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉండటంతో పాటు, కనీసం 20 పని దినాలు పూర్తి చేసి ఉండాలి.ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం.భూమి లేని నిరుపేద వ్యవసాయ కూలీలకు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడం, వారి జీవితాల్లో ఒక భరోసాను నింపడం. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ పనులు లేని సమయంలో ఈ ఆర్థిక సహాయం వారికి ఎంతో ఆసరాగా నిలుస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లోని పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వారిని పేదరికం నుంచి బయటపడేయడం ద్వారా సామాజిక న్యాయాన్ని అందించడమే ఈ పథకం లక్ష్యం.ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ.. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రాధాన్యత ఇస్తోంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోస్తా పథకం కింద నిధుల విడుదలతో, లక్షలాది మంది వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఉపశమనం లభిస్తుంది.ఇప్పటికే రైతు భరోసా పథకం కింద అర్హులైన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిన విషయం తెలిసిందే.గతంలో ఎన్నడూ లేని విధంగా 9 రోజుల్లో రైతులకు ఎకరాలతో సంబంధం లేకుండా డబ్బులను జమ చేశారు. ఇది ఒక రికార్డుగా మంత్రి భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు.రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నట్లు పేర్కొన్నారు.

## రాజకీయాలపై రమణ వ్యంగ్యాస్త్రాలు నవ్వులతో గుచ్చుకుంటాయి

### ఎపి శాసనసభ ఉపసభాపతి రామకృష్ణంరాజు

### తెలుగు వాకిట ముత్యాలముగ్గు బాపు బొమ్మ, రమణ రాత: ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు



బాపు రమణల కార్యక్రమంలో పాల్గొన్న రామకృష్ణంరాజు, రాఘవేంద్రరావు, అల్లు అరవింద్, మల్లెమాల, జిత్‌మోహన్, సుబ్బరాజు, వర తదితరులు

**హైదరాబాద్ (నాంపల్లి), జూన్ 29, ప్రభాతవార్త :** ప్రముఖ దర్శక రచయిత మిత్రద్వయం బాపు రమణలు నిర్మించిన సినిమా ముత్యాలముగ్గు 50 యేళ్ల పండుగ, ముళ్లపూడి రమణ 94వ జయంతి వేడుకలను పురస్కరించుకొని శ్రీవర ముళ్లపూడి సౌజన్యం, బాపు రమణల అకాడమీ నిర్వహణలో పలువురు సినీప్రముఖుల మధ్య ఘనంగా జరిగిన కార్యక్రమంలో ఎపి శాసనసభ ఉపసభాపతి రామకృష్ణంరాజు మాట్లా డుతూ రమణ రాజకీయాలపై వ్యంగ్యా స్త్రాలు నవ్వులతో గుచ్చుకునే విధంగా ఉన్నాయని తెలిపారు. ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు మాట్లాడుతూ తెలుగువాకిట ముత్యాలముగ్గు బాపు బొమ్మ, రమణ చేవ్రాత అని చమత్కరించారు. బాపు రమణలు సూర్య చంద్రుల వంటివారని వారి వెలుగులు ఎల్లవేళలా విశ్వవ్యాప్తంగా వ్యాపించే ఉంటాయని, తెలుగు లోగిళ్లలో ఎన్నటికీ చెరగని ముగ్గు ముత్యాలముగ్గు అని స్పష్టం చేశారు. నిర్మాత అల్లు అరవింద్ నటుల నుండి ప్రతిభను వెలికితీయడంలో బాపు మాటలను కత్తిలా వ్రాయడంలో రమణ తనకుతానే సాటన్నారు. తన తండ్రి అల్లు రామలింగయ్య కోతిలా నటించి మెప్పించడం అందుకు నిదర్శనమని గుర్తుచేశారు. నిర్మాత శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి బాపు రమణల స్నేహం అందరికీ ఆదర్శనీయం, స్మరణీయన్నారు. ముత్యాలముగ్గు సినిమాలో నటించిన జిత్‌మోహన్‌మిత్రా, సుబ్రహ్మణ్యవర్మ, రావు రమేష్ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని సంస్థ కార్యదర్శి సుబ్బరాజు, ముళ్ళపూడి వర పర్యవేక్షించారు.

## పిసిసి ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు పని విభజన

### పార్లమెంట్ ఇన్‌చార్జీలుగా 17 మంది ఉపాధ్యక్షులు, 51 మంది కార్యదర్శులు

### పార్టీ అనుబంధ సంస్థల ఇన్‌చార్జీలుగా 22 విపిలు, 10 కార్యదర్శులు

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల వేళ పార్టీని మరింత ప్రభావవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు సంస్థాగతంగా పటిష్టరించేందుకు కసరత్తు ప్రారంభించింది. టిపిసిసి కొత్తగా నియామకం చేసిన ఉపాధ్యక్షులకు ,కార్యదర్శులకు పనివిభజన చేసి రానున్న ఎన్నికలలో మెరుగైన ఫలితాలు పొందేందుకు అవసరమైన చర్యలు తీసు కొంటున్నది.

పార్లమెంట్ నియోజకవర్గాలకు కొంత మందిని, పార్టీ అనుబంధ సంస్థలకు కొంతమందిని కేటాయించి పనివిభజన చేశారు. ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక వైస్ ప్రెసిడెంట్, ముగ్గురు జనరల్ సెక్రటరీలను నియమించారు టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అందులోభాగంగా పార్లమెంట్ ఇంచార్జీలుగా 17 మంది ఉపాధ్యక్షులను 51 మంది జనరల్ సెక్రటరీలను నియామకం చేశారు. ఒక్కో పార్లమెంట్‌కు ఒక ఉపాధ్యక్షుడితోపాటు ముగ్గురు జనరల్ సెక్రటరీలు ఇంచార్జీలుగా ఉండి పార్టీని బూతుస్థాయి కార్యకర్తతో సమన్వయం చేసుకుంటు ముందుకుపోవాలనే ఉద్దేశ్యంతో ఈ విధమైన కూర్పును టిపిసిసి అధ్యక్షుడు చేసినట్లు జాబితాను చూస్తే అర్థం అవుతోంది.

ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంకు ఎంపీ రఘువీర్ రెడ్డి ఆయనతోపాటు ముగ్గురు జనరల్ సెక్రటరీలు ఉంటారు. పెద్దపల్లి - గాలి అనిల్ కుమార్ ఆయనతోపాటు ముగ్గురు జనరల్ సెక్రటరీలు పార్టీ కార్యక్రమాలను పర్యవేక్షణ చేస్తారు. కరీంనగర్ - ఎమ్మెల్యే నాయిని రాజేందర్ నాయకత్వంలో ముగ్గురు జనరల్ సెక్రటరీలు ఉంటారు. నిజామాబాద్ ఎమ్మెల్సీ -బాల్మూర్ వెంకట్ తోపాటు ముగ్గురు కార్యదర్శులు, జహీరాబాద్- బండి రమేష్, మెదక్ - నవాబ్ ముజాహిదీన్ ఆలం ఖాన్, మల్కాజ్ గిరి ఎమ్మెల్సీ- బసవరాజు సారయ్య, సికింద్రాబాద్- ఝాన్సీ రెడ్డి,హైదరాబాద్ -సంగమేశ్వర్, చేవెళ్ల - బొంతు రామ్మోహన్,నాగర్ కర్నూల్ - కొండేటి మల్లయ్య, నల్గొండ- మామిండ్ల శ్రీనివాస్, భువనగిరి కోటింరెడ్డి -వినయ్ రెడ్డి వరంగల్- సత్య నారాయణ, మహబూబాబాద్- నాగేశ్వర్ రావు, ఖమ్మం - శ్రవణ్ కుమార్ రెడ్డి మహబూబ్ నగర్ -వేణు గౌడ్‌లు వారితోపాటు ముగ్గురేసి కార్యదర్శులు ఉంటారు.


ఇక పార్టీ అనుబంధ సంఘాల ఇంచార్జీలుగా 22 విపిలను, 10 మంది కార్యదర్శులను నియమించారు.

## పార్టీ సిద్ధాంతాలను నిబద్ధతతో ఆచరించిన గాంధేయవాది డిఎస్

### మంత్రి పొన్నం ప్రభాకర్

### రాజకీయ ఓనమాలు నేర్పిన గురువు డిఎస్: పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్

### గాంధీభవన్‌లో శ్రీనివాస్‌కు మొదటి వర్ధంతి నివాళులు



ఆదివారం మాజీ పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ ప్రథమ వర్ధంతి గాంధీభవన్‌లో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్, జూన్ 29,ప్రభాతవార్త:** కాంగ్రెస్ సిద్ధాంతాలను నిబద్ధతతో ఆచరించిన గాంధేయ వాది డి.శ్రీనివాస్‌ని, 2004లో కేంద్రంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో యుపిఏ-1 ఆయన నాయ కత్వంలోనే ఎన్నికల్లో వెళ్లి అధికారంలోకి వచ్చామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం మాజీ పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ ప్రథమ వర్ధంతి గాంధీభవన్‌లో ఘనంగా జరి గింది. డి శ్రీనివాస్ చిత్ర పటానికి మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హను మంతరావు. పిసి సి అధ్యక్షుడు మహేష్ కుమార్‌లు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ డి.శ్రీనివాస్ మాజీ ఎన్‌ఎస్‌యుఐ అధ్యక్షు డిగా, మాజీ పిసిసి అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సేవలు అందించారని కొనియా డారు. ఆయన గత సంవత్సరం అనారోగ్యంతో మన నుండి దూరం అయ్యారనీడి శ్రీనివాస్ లేకపోవడం పార్టీకి తీరనిలోటని వాపోయారు. టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ మాట్లా డుతూ శ్రీనివాస్ జీవితాంతం కాంగ్రెస్ పార్టీ ఊపిరిగా జీవించారని, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిచొరవతో నేడు నిజామాబాద్‌లో విగ్రహ విష్కరణ జరుగుతున్నా కాంగ్రెస్ నేతలకు ఆహ్వానం లేకపోవడం బాధాకరమని వాపోయారు. నా రాజకీయ గురువు మాజీ పిసిసి అధ్యక్షులు డి.శ్రీనివాస్ వద్దే నేను రాజకీయ ఓనమాలు నేర్చుకున్నా అని గుర్తుచేసుకున్నారు.

మాజీ పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసిన ఎంపీలు, మాజీ ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లు, టిపిసిసి ఉపాధ్యక్షులు, కార్యదర్శులు నివాళులు అర్పించారు.

## గతంలో దాడులు జరగలేదా.. అప్పుడెందుకు స్పందించలేదు?

### ఫోన్ ట్యాపింగ్‌పై సిబిఐ విచారణ చేపట్టండి

### మీడియా సమావేశంలో మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 29, ప్రభాతవార్త:** గతంలో మీడియా సంస్థల మీద దాడులు జరగలేదా..ఫోన్ ట్యాపింగ్ పై విచారణ జరుగుతుంది.. ఇంకా అవసరమైతే కేంద్ర బృందాలతో విచారణ చేయండి.. అంతేకానీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం.. వార్తా కథనాలు అల్లడం సరికాదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మీడియా వాళ్ల కుటుంబ సభ్యులపై ఇలాగే కథనాలు రాస్తే ఊరుకుంటారా అని ప్రశ్నించారు. వ్యక్తుల మీద దాడులు చేయలేదని, నాయకుల మీద అభిమానంతో దాడులు చేశారని చెప్పారు. రాష్ట్రంలో మహిళలను కించపరిచే వ్యాఖ్యానాలు చేసిన.. ఇబ్బందులకు గురిచేసిన ఆ మహిళల కుటుంబ సభ్యులు భరించారు.. ఎంతకైనా తెగిస్తారు అని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ జరిగింది అంటూ విచారణలు చేస్తున్నారు.. అవసరమైతే కేంద్ర బృందాలతోనూ విచారణ జరిపించండి. పరవాలేదు.. కానీ కేటీఆర్ పై అభాండాలు వేస్తూ సొంత కథనాలు.. ప్రసారం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. నిరాధారమైన ఆరోపణలు చేయడంతో బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనలు చేసే క్రమంలో జరిగిన చిన్న గొడవను కొంతమంది రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. ఆ మీడియా సంస్థ కార్యాలయం అద్దం పగలవచ్చు.. కానీ మా నాయకులు.. కార్యకర్తల గుండెలు పగిలేలా కథనాలు, ఇంటర్వ్యూలు ప్రసారం చేయడం ఎంతవరకు న్యాయం అని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. గతంలో అనేక పత్రిక కార్యాలయాలు.. జర్నలిస్టులపై ప్రస్తుత అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు చేయలేదా..!? అని ప్రశ్నించారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు మా హయాంలో ఇండ్లు ఇచ్చాం. ఇంకా కొందరు మిగిలిపోయారు. ఆ ఇండ్లపై విచారణ జరుపుతున్నారు. మిగిలిన వారందరికీ కూడా ఇవ్వవలసింది పోయి ఇండ్లు వచ్చిన వారిపై విచారణ జరుపుతున్నారు.ఇది ఎక్కడి న్యాయం అని మాజీ మంత్రి ప్రశ్నించారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.



## జూలై 4న జై బాపు, జై భీమ్, జై సంవిధానం బహిరంగసభ

### ఎఐసిసి చీఫ్ మల్లికార్జునఖర్గే రాక

### ఎల్‌బి స్టేడియంలో తెలంగాణ గ్రామస్థాయి అధ్యక్షుల సమ్మేళనం: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్

**హైదరాబాద్, జూన్29,ప్రభాతవార్త:** రాజ్యాంగ పరిరక్షణ కోసం జైబాపు,జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంతో గ్రామస్థాయిలో ప్రజలకు చైతన్యం కలిగిచడానికి జూలై4 ఎల్‌బిస్టేడియంలో గ్రామస్థాయి కాంగ్రెస్ అధ్యక్షులతో బహిరంగసభ పెడుతున్నామని దీనికి ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరవుతారని టిసిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ అన్నారు. గాంధీ భవన్ లో ఆదివాకం హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన కాంగ్రెస్ నేతల సమీక్షా సమావేశంలో ముఖ్య అతిథిగా టిపిసిసిచీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగహాజరైనారు.

ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్‌లో పర్యటిస్తున్న సందర్భంగా లాల్ బహదూర్ స్టేడియంలో తెలంగాణ గ్రామ స్థాయి అధ్యక్షుల సమ్మేళనం జరుగుతోందని అన్నారు. జై బాపు, జై భీమ్,జై సంవిధానం కార్యక్రమం తెలంగాణ గ్రామ స్థాయిలో బాగా జరుగుతోందని ఏఐసిసి గుర్తించిందని ఆయన తెలిపారు. కేంద్రంలోని భారతీయ జనతాపార్టీ రాజ్యాంగలోని అనేక అంశాలను మార్పుచేసి మనువాద రాజ్యాంగాన్ని తీసుకొచ్చే పనిలో ఉందని గ్రామీణులకు ఈ అంశంపై మరింత చైతన్యం కల్పించి అప్రమత్తంగా ఉంచాల్సినబాధ్యత లౌకికశక్తులపై ఉందని ఆయన అన్నారు. మల్లికార్జునఖర్గే సమావేశంకు స్వచ్ఛందంగా అనేక మంది ఎల్‌బి స్టేడియంకు హాజరు అయ్యేలా చూడాలని అన్నారు. గాంధీ భవన్ లో జూలై 4 న పొలిటికల్ అఫైర్ సమావేశం కూడా ఉంటుందని.అనంతరం టిపిసిసి విస్తృత స్థాయి కూడా ఉంటుందని. సాయంత్రం ఎల్బీ స్టేడియం లో గ్రామస్థాయి నేతలతో బహిరంగసభ ఉంటుందని ఆయన వివరించారు.జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కమిటీ మీటింగ్ లో బాగంగా ఈ సభ నిర్వహణ..జూబ్లిహిల్స్ లో ఎన్నిక ఎప్పుడు జరిగినా మేము గెలుస్తాం. కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన ప్రతి వారిని గుర్తిస్తామని ఆయన అన్నారు

**జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ విజేత :**

**మంత్రి పొన్నం ఆశాభావం**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.జూలై 4 వ తేదీన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ లో పర్యటిస్తున్న సందర్భంగా సభ ను విజయవంతం చేయాలని హైదరాబాదీ కాంగ్రెస్ శ్రేణులకు ప్రభాకర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ లో ఉన్న అన్ని నియోజకవర్గాల నుండి ముఖ్య నేతలు సభలో పాల్గొనాలని కోరారు. .హైదరాబాద్ నాయకత్వం సభ ఏర్పాట్ల పై ఆక్టివ్ గా పాల్గొనాలి,. హైదరాబాద్ లో పార్టీకి సంబంధించిన ఇష్యూ నా దృష్టికి తీసుకొచ్చాయని ఆయన తెలిపారు. దేవాలయ కమిటీ లు ,కళ్యాణ లక్ష్మి ,షాది ముబారక్ చెక్కులు పంపిణీ ,బోనాల చెక్కుల పంపిణీ తదితర ప్రోటోకాల్ ఇష్యూస్ ఏమైనా పొరపాట్లు మళ్ళీపునరావృతం కాకుండా చూసుకోవాలని ఆయన హితవు చెప్పారు. క్షేత్ర స్థాయిలో పార్టీ కోసం కష్టపడుతున్న వారికి నామినేటెడ్ పోస్టులు ఇస్తామని తెలిపారు.జిహెచ్‌ఎంసి ఎన్నికలకు సిద్ధం కావాలని కార్యకర్తలను కోరారు. ఉప ఎన్నికలలో జూబ్లిలో సత్తా చూపాలని దాని కోసం ఇప్పటి నుండి సన్నద్ధం కావాలని అన్నారు. జీహెచ్ ఎంసీ మేయర్ స్థానం కాంగ్రెస్ కైవసం చేసుకోవాలని కోరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పై ఇప్పటి నుండి గ్రౌండ్ లెవెల్ లో ప్రణాళిక ద్వారా ముందుకు పోవాలని అన్నారు.

# బ్లాక్‌స్పాట్స్‌పై ప్రజలను అప్రమత్తం చేయండి

### తెలంగాణకు రోడ్డు ప్రమాద మరణాల్లో 9వ ర్యాంకు

### రాష్ట్ర పోలీసులకు కేంద్రం లేఖ

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నానాటికీ పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్‌స్పాట్లపై ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు వాటిని సరిచేయడానికి ఆర్‌అండ్‌బి, పోలీసులు సమన్వయంతో పనిచేయాలని కేంద్రప్రభుత్వం హెచ్చరించింది. జాతీయ రహదారులపై అత్యంత ప్రమా దాలు తరుచూ జరిగే ప్రాంతాలను ఆర్‌అండ్‌బి,నేషనల్‌హైవే ఇంజనీర్ల సహాయంతో గుర్తించాలంటూ రాష్ట్ర పోలీసు విభాగానికి కేంద్ర ఉపరితల రవాణా శాఖ లేఖ రాసింది.రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లే కాదు, రోడ్లపై ఉండే పరిస్థితులూ కారణమవుతున్నాయి. రోడ్లు ఇరుగ్గా ఉండటం, జంక్షన్ల వద్ద వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడం, వాహనాల పరిమాణానికి, వేగానికి తగ్గట్టు రోడ్లు నిర్మించకపోవడం ముఖ్యంగా మలుపులు, వంపులు తిరిగి ఉండటంతో ప్రమాదాలు తలెత్తుతున్నాయి.

ఇలాంటి ప్రమాదకరమైన ప్రదేశాలను పోలీస్‌స్టేషన్ల వారీగా వివరాలు సేకరించే పని ప్రారంభమైంది. దీనిలో భాగంగా హైవేలపై అత్యధిక ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తిస్తారు. ప్రమాదాలకు కారణాలను విశ్లేషిస్తారు. తెలంగాణలో జాతీయ రహదారులపై 930 బ్లాక్ స్పాట్లను గుర్తించారు. ఈ వివరాలను కేంద్రానికి పంపుతారు. సిగ్నల్ వ్యవస్థ నెలకొల్పడం, సీసీ కెమెరాల ఏర్పాటు, రోడ్డు వెడల్పు, వాహనాల వేగ నియంత్రణ వంటి చర్యలు చేపట్టనున్నారు. ఆయా ప్రాంతాలకు తగ్గట్టుగా చర్యలు చేపట్టేందుకు కేంద్రం నిధులు మంజూరు చేస్తుంది. దేశంలోనే అత్యధిక రోడ్డు ప్రమాదాలు, మరణాలు జరిగే రాష్ట్రాల జాబితాలో తెలంగాణ కూడా ఉంది.

అత్యధిక ప్రమాదాల్లో 8వ స్థానంలో, మరణాల్లో 9వ స్థానంలో తెలంగాణ ఉంది. పెరుగుతున్న వాహనాలకు అనుగణంగా రహదారుల విస్తరణ లేకపోవడం రద్దీకారణంగా ప్రమాదాలు జరుగుతు న్నాయి. ఒక్క విజయవాడ-హైదరాబాద్ హైవేలోనే ఏకంగా గంటకు వెయ్యికి పైగా వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ఈ రద్దీ ప్రతి సంవత్సరానికీ కనీసం ఐదు శాతం చొప్పున పెరిగిపోతోంది.

రాష్ట్రంలోని హైవేలు అన్నింటిలోనూ ఇదే పరిస్థితి. పండగలు, ఇతర సెలవుల్లో అయితే సాధారణ ట్రాఫిక్‌కు కనీసం 10 రెట్లు ఎక్కువ నమోద వుతుంటుంది. ట్రాఫిక్ పెరుగుతున్న కొద్దీ ప్రమాదాల తీవ్రత కూడా పెరుగుతుంటుంది.

మన రాష్ట్రంలో గత సంవత్సరం 25,934 ప్రమాదాలు జరిగాయి. వాటిలో 7,281 మంది మరణించారు. రాష్ట్రంలో హైవేలపై జరిగే ప్రమాదాల్లో మరణాల సంఖ్య ఎక్కువ. అందుకే ఈ ప్రమాదాల నివారణపై కేంద్రం దృష్టి సారించింది.

### అంతర్జాతీయ టోర్నమెంట్‌లో..

# మెరిసిన భారత్ మహిళా రెజ్లర్లు

### 4 స్వర్ణాలు, 1 కాంస్యంతో రన్నరప్

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ రెజ్లింగ్ వేదికపై భారత మహిళా రెజ్లర్లు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం టర్కీలో జరుగుతున్న ప్రతిష్టాత్మక యాసర్ దోగు అంతర్జాతీయ రెజ్లింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు పతకాల పంట పండింది. భారత్‌కు చెందిన ఆరుగురు మహిళా రెజ్లర్లతో కూడిన బృందం ఈ టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. ఇందులో పాల్గొన్న ఆరుగురు రెజ్లర్లలో, ఐదుగురు భారతీయ మహిళా రెజ్లర్లు పతకాలు సాధించారు, ఇందులో 4 స్వర్ణాలు మరియు ఒక కాంస్య పతకాన్ని దక్కించుకున్నారు. భారత్ రెజ్లర్ పుష్ప 55 కిలోల విభాగంలో స్వర్ణ పతకాన్ని గెలుచుకోగా, నేహా 57 కిలోల విభాగంలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. మనీషా 62 కిలోల విభాగంలో ఆధిపత్యం చెలాయించి స్వర్ణం గెలుచుకుంది. అలాగే హర్షిత 72 కిలోల విభాగంలో మరో స్వర్ణం సాధించింది. 50 కిలోల విభాగంలో నీలం కాంస్యం సాధించి పతకాల సంఖ్యకు దోహదపడింది, దీంతో భారతదేశం మొత్తం జట్టు ర్యాంకింగ్స్‌లో రన్నరప్‌గా నిలిచింది. అంతకుముందు, వియత్నాంలోని వుంగ్ టౌలో జరిగిన అండర్17 ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత అండర్17 రెజ్లర్లు 3 స్వర్ణాలు, 2 కాంస్యాలతో సహా మొత్తం ఐదు పతకాలను సాధించారు, 65 కిలోల విభాగంలో గౌరవ్ పునియా, అర్జున్ రుహిల్ (92 కిలోలు), లాకీ (110 కిలోలు) బంగారు పతకాలు గెలుచుకున్నారు. 45 కిలోల విభాగంలో శివమ్, 51 కిలోల విభాగంలో ధనరాజ్ గణపతి రెండు కాంస్య పతకాలను గెలుచుకున్నారు.

### మహిళల ఆసియా కప్‌లో..

## భారత్ వరుసగా రెండో మ్యాచ్ 4-0తో గెలుపు



**న్యూఢిల్లీ:** ఆసియా కప్-2025 క్వాలిఫయర్స్‌లో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లో విజయాన్ని సాధించింది. ఆదివారం థాయ్‌లాండ్‌లోని చియాంగ్ మాయిలో జరిగిన ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు 4-0 తేడాతో తైమూర్‌ను ఓడించింది. గత వారం మంగోలియాపై 13-0 తేడాతో భారీ విజయాన్ని సాధించి భారత్ అద్భుతంగా ప్రారంభించింది. ఆ తర్వాత ఆరు రోజుల అనంతరం ఆదివారం మ్యాచ్ ప్రారంభంలో మనీషా కళ్యాణ్ అద్భుతమైన ముగింపుతో భారత్ హాఫ్ టైం ముగిసే సమయానికి 1 గోల్ ఆధిక్యాన్ని కొనసాగించింది. భారత జట్టు ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకోవడానికి చాలా పెద్ద అవకాశాలు వచ్చాయి, కానీ రెండు నిరక్ష్యప్లు షాట్లు మరియు తైమూర్ లెస్టే డిఫెన్సివ్ యూనిట్ నుండి దృఢమైన రక్షణాత్మక ప్రదర్శన స్కోరును మార్చకుండా ఉంచాయి. భారత ఫార్వర్డ్ ప్యారీ జాక్సా రెండో అర్థభాగంలో భారత వింగర్లు ఇచ్చిన కొన్ని సులభమైన అవకాశాలను గోల్స్‌గా మార్చలేకపోయింది, దీనివల్ల స్కోరు లైన్ మారలేదు. సంజు ఎడమ పార్శ్వం నుండి అద్భుతమైన క్రాస్ అందించింది. అది తైమూర్ గోల్ కీపర్‌ను సమీప చివరలో ఓడించడంతో రెండవ అర్ధభాగంలో భారత్ ఆధిక్యం 2-0 చేరింది. తైమూర్ లెస్తేతైమూర్ డిఫెన్సివ్ బాక్స్‌లో సంజు మరో అద్భుతమైన క్రాస్ చేశాడు. మనీషా కళ్యాణ్ గోల్ కీపర్ చివరి వైపు శక్తివంతమైన షాట్ కొట్టి తన గోల్ ఖాతాలో మరో గోల్ వేయడంతో ఇండియా స్కోర్ 3-0కు చేరింది. తైమూర్ లెస్తేడాంగ్మే గ్రేస్ అద్భుతమైన నైపుణ్యాలను ప్రదర్శించి తన రెండు మార్కులను అధిగమించి, గోల్ వైపు పరుగెత్తుతున్న లిండా కోమ్‌కు మైనస్ పాస్‌తో దాడి చేసే ఎత్తుగడ వేయడంతో భారత్ ఈ పాస్‌ను గోల్‌గా మార్చడంతో 4-0కు చేరింది. దీంతో రెండు మ్యాచ్‌ల్లో ఆరు పాయింట్లతో భారత్ లీడర్‌బోర్డ్‌లో అగ్రస్థానంలో ఉంది. వారికి ఇరాక్ మరియు థాయిలాండ్‌తో మరో రెండు మ్యాచ్‌లు ఉంటాయి, ఇవి ఆసియా కప్‌లో జట్టు భవితవ్యాన్ని నిర్ణయించనున్నాయి.

ఆట



### యుఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్‌లో

# దూసుకెళ్లిన ఆయుష్, తన్వి

**న్యూఢిల్లీ:** యుఎస్ ఓపెన్-2025 లో యువ భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు తన్వి శర్మ, ఆయుష్ శెట్టి తమ తొలి బిడబ్ల్యూఎఫ్ సూపర్ 300 ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. దీంతో 16 ఏళ్ల తన్వి బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ టూర్‌లో ఫైనల్‌కు చేరుకున్న తొలి భారతీయ మహిళా షట్లర్‌గా కూడా నిలిచింది. ఆయుష్ శెట్టి మూడు గేమ్‌ల థ్రిల్లర్‌లో (21-23, 21-15, 21-14) టాప్ సీడ్ మరియు, ప్రపంచ 6వ ర్యాంకర్ చౌ టియెన్ చెన్‌ను చైనీస్ తైపీని ఓడించగా, తన్వి (21-14, 21-16) ఉక్రెయిన్‌కు చెందిన ఉన్నత ర్యాంక్ పొందిన పోలినా బుహ్రోవాను ఓడించింది. తన్వి మళ్ళీ అద్భుత గేమ్‌ప్లేను ప్రదర్శించి సెమీఫైనల్‌లో ఆధిపత్యం చెలాయించింది. రెండవ గేమ్‌లో బుహ్రోవా ఆలస్యంగా ముందుకు సాగినప్పటికీ, తన్వి సౌకర్యవంతమైన విజయాన్ని సాధించింది. ఆమె ఇప్పుడు ఫైనల్‌లో అనుభవజ్ఞురాలైన అమెరికన్ క్రీడాకారిణి బీవెన్ జాంగ్‌ను ఎదుర్కోనుంది. భారత్ యొక్క మొట్టమొదటి బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్‌ను గెలుచుకోవాలనే లక్ష్యంతో ఉంది. ఇక 20 ఏళ్ల ఆయుష్ కూడా అనుభవజ్ఞుడైన ప్రచారకర్త చో టియన్ చెన్‌పై తన కెరీర్‌లో అతిపెద్ద విజయంతో టోర్నమెంట్ యొక్క శిఖరాగ్ర ఘర్షణకు దూసుకెళ్లాడు. ఆయుష్ మొదటి గేమ్‌లో 19-14తో ఆధిక్యంలో బలంగా ఆడాడు, కానీ చౌ ముందుకు దూసుకెళ్లాడు. అతను డ్యూస్ తర్వాత 23-21తో గెలిచేందుకు పోరాడాడు. అయితే ఆయుష్ దృఢ సంకల్పంతో తిరిగి కీలక సమయంలో సంచలన ప్రదర్శన చేశాడు, తదుపరి రెండు గేమ్‌లలో (21-15, 21-14) ఆధిపత్యం చెలాయించాడు, దీంతో వరల్డ్ టూర్‌లో తన మొట్టమొదటి ఫైనల్‌లో తన స్థానాన్ని దక్కించుకున్నాడు.



### వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌లో..

# టీమిండియాకు ఫైనల్ గండం

### ఊహించని షాకిచ్చిన ఆసిస్.. ఇంగ్లండ్‌పై ఓటమితో లాస్ట్ ర్యాంక్







**న్యూఢిల్లీ:** వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటిసి)-2025-27 సైకిల్ ఉత్కంఠగా కొనసాగుతోంది. ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఓటమి పాలవడంతో పాయింట్ల పట్టికలో దిగువకు దిగజారి కష్టాల్లో పడింది. వెస్టిండీస్‌పై ఆస్ట్రేలియా సాధించిన ఘన విజయం, ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఓటమి తర్వాత పాయింట్ల పట్టికలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం డబ్ల్యూటిసి పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ టాప్‌లో నిలిచాయి. ఈ డబ్ల్యూటిసి సైకిల్‌లో ఆస్ట్రేలియా ఆడిన ఒక మ్యాచ్‌లో విజయంతో 12 పాయింట్లు సంపాదించి 100 శాతం పాయింట్ల పర్సెంటేజీ (పిసిటి)తో అగ్రస్థానంలో ఉంది. వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో 159 రన్స్ తేడాతో విజయం సాధించడంతో ఇది సాధ్యమైంది. అలాగే ఇంగ్లాండ్ సైతం భారత్‌తో ఆడిన ఒక మ్యాచ్‌లోనూ గెలవడంతో 12 పాయింట్లతో, 100 శాతం పిసిటితో 2వ స్థానంలో ఉంది. శ్రీలంక ఇప్పటి వరకూ 2 మ్యాచ్‌లు ఆడగా, అందులో ఒకటి విజయం, మరొకటి డ్రా గా కావడంతో ఆ జట్టు 16 పాయింట్లను సాధించి 66.67 శాతం పిసిటితో 3వ ప్లేస్‌లో నిలిచింది. బంగ్లాదేశ్ 2 మ్యాచ్‌ల్లో ఒకటి ఓటమి చెంది, మరొకటి డ్రా అయి 4 పాయింట్ల 16.67 పాయింట్ల పర్సెంటేజ్‌తో 4వ ప్లేస్‌లో చేరింది. ఇక టీమిండియా ఆడిన ఒక్కటి ఓటమి చెందడంతో ఒక్క పాయింటు కూడా రాకపోవడంతో పట్టికలో 5వ స్థానంలో ఉంది. ఇంగ్లాండ్‌తో తొలి టెస్టులో ఓటమితో పెద్ద ఎదురుదెబ్బ అయింది. వెస్టిండీస్ కూడా ఒకే మ్యాచ్ ఆడి అది ఓడి ఒక్క పాయింటు కూడా లేకుండా చిట్టచివరన ఆరో స్థానంలో ఉంది. ఇక దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, పాకిస్తాన్ ఈ మూడు జట్లు ఈ సైకిల్‌లో ఒక్క మ్యాచ్‌ను కూడా ఇంకా ప్రారంభం కాలేదు. ఈ పరిస్థితుల్లో భారత జట్టు ఫైనల్‌కు చేరుకునేందుకు అవకాశాలు సన్నగిల్లాయి. డబ్ల్యూటిసి ఫైనల్‌కు అర్హత సాధించాలంటే, రాబోయే మ్యాచ్‌లలో భారత్ మెరుగైన ప్రదర్శన కనబరచడం చాలా అవసరం. ఈ 2025-27 డబ్ల్యూటిసి సైకిల్‌లో బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లతో భారత్ ఆడే అవకాశం లేదు. ఇది టీమిండియాకు మరింత కఠిన సవాలుగా మారుస్తోంది. మొత్తంగా ప్రారంభ దశలోనే జట్ల మధ్య హోరాహోరీ పోరు జరుగుతుండటంతో రాబోయే మ్యాచ్‌లలో పాయింట్ల పట్టికలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయో, ఏ జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయో అనేది ఉత్కంఠ కలిగిస్తోంది.

## ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్‌లో కుషారేకు హైజంప్ టైటిల్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్-2025,లో ఫైనల్లో తేజస్విన్ శంకర్‌ను ఓడించి సర్వేష్ కుషారే హైజంప్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. పారిస్ 2024 ఒలింపియన్ కుషారే 2.21 మీటర్లు ఎగిరి శంకర్‌ను వెనక్కి నెట్టి పురుషుల హైజంప్‌లో విజయాన్ని కైవసం చేసుకున్నాడు. జాతీయ రికార్డు 2.29 మీటర్లతో ఉన్న తేజస్విన్ ఆ రోజు 2.19 మీటర్లు దూకి రజతంతో సరిపెట్టుకోగా, ఆదర్శ్ రామ్ 2.13 మీటర్ల ప్రయత్నంతో పోడియంను పూర్తి చేశాడు. పారిస్ 2024 ఒలింపిక్స్‌లో, కుషారే 2.15 మీటర్ల ఎత్తుతో అర్హతలో మొత్తం 25వ స్థానంలో నిలిచాడు. అదే సమయంలో, తేజస్విన్ శంకర్ హైజంప్‌లో కామన్వెల్త్ గేమ్స్ కాంస్య పతక విజేతగా నిలిచాడు. ఇక మహిళల లాంగ్ జంప్‌లో భవానీ యాదవ్ 6.31 మీటర్ల ఉత్తమ జంప్‌తో సాంద్రా బాబుపై విజయం సాధించింది. ప్రారంభ రౌండ్లలో సీజన్‌లో అత్యుత్తమంగా 6.23 మీటర్లతో ముందంజలో ఉన్న సాంద్రా కూడా 6.24 మీటర్ల జంప్‌ను అమలు చేయగలిగింది కానీ భవానీని అధిగమించలేకపోయింది. కుసుమ రవాడ 6.22 మీటర్ల జంప్‌తో కాంస్యం గెలుచుకుంది. ఇక పురుషుల 800 మీటర్ల ఫైనల్‌లో జాతీయ రికార్డు హోల్డర్ మహ్మద్ అఫ్సల్ పి ఎదురుదెబ్బ తగిలింది. సగం దూరం వరకు మైదానంలో ముందుండి నడిపిన అఫ్సల్ గాయం కారణంగా వైదొలగాల్సి వచ్చింది. అంతకుముందు రోజు, కార్తీక్ ఉన్నికృష్ణన్ పురుషుల ట్రిపుల్ జంప్‌ను 16.08 మీటర్ల ప్రయత్నంతో గెలుచుకున్నాడు, విమల్ ముగేష్ (16.01 మీ) మరియు గైలీ వెనిస్టర్



(16.00 మీ)లను అధిగమించారు. షీనా ఎన్వి (13.05 మీ) మరియు ఏంజెల్ సిల్వియా (23.81 సె) కూడా మహిళల ట్రిపుల్ జంప్ మరియు 200 మీటర్ల ఫైనల్స్‌లో వరుసగా విజయాలు నమోదు చేశారు. ట్రాక్‌పై, తమిళ్ అరసు (10.46సె), అభినయ రాజరాజన్ (11.55సె) 100 మీటర్ల రేసుల్లో గెలిచిన తర్వాత మీట్‌లో అత్యంత వేగవంతమైన పురుషుడు, మహిళగా కిరీటాలను గెలుచుకున్నారు.

# పెరుగుతున్న పసిడి రుణాలు..

**న్యూఢిల్లీ, జూన్ 29:** అత్యవసరంగా సొమ్ము అవసరమైనప్పుడు గోల్డ్ లోన్ ఒక ఉపయోగ కరమైన ఎంపికగా ఉంటుంది. చాలా మంది బంగారు ఆభరణాలను సెక్యూరిటీగా తాకట్టు పెట్టి డబ్బు తీసుకుంటారు. చాలా సులభంగా నిధులు పొందడానికి త్వరిత, సులభమైన మార్గంగా గోల్డ్ లోన్స్ ఉంటాయి. బంగారు రుణం అనేది ఒక రకమైన సెక్యూర్డ్ రుణం. గోల్డ్ లోన్ ద్వారా మీ బంగారు ఆభరణాలు, నాణేలు లేదా కడ్డీలను బ్యాంకు లేదా ఆర్థిక సంస్థకు సెక్యూరిటీగా ఇవ్వడం ద్వారా డబ్బు



పొందవచ్చు. అయితే రుణ మొత్తం బంగారం ప్రస్తుత మార్కెట్ విలువపై ఆధారపడి ఉంటుంది. మీరు రుణం, వడ్డీని పూర్తిగా చెల్లించిన తర్వాత మీ బంగారం మీకు తిరిగి ఇస్తారు. మీరు మీ బంగారు ఆభరణాలు లేదా నాణేలతో బ్యాంకు లేదా ఎన్‌బీఎఫ్‌సీను సందర్శించాల్సి ఉంటుంది. వారు స్వచ్ఛత, బరువును తనిఖీ చేస్తారు. 18 నుండి 24 క్యారెట్ల మధ్య బంగారం మాత్రమే తాకట్టుకు తీసుకుంటాయి. రుణదాత మీ బంగారం విలువ ను లెక్కించడానికి బంగారం ప్రస్తుత మార్కెట్ ధరను తనిఖీ చేస్తారు. విలువ ఆధారంగా బ్యాంకులు మీకు రుణం మంజూరు చేస్తాయి. సాధారణంగా మీ బంగారం విలువలో 75 శాతం వరకు ఉంటుంది. అలాగే డబ్బు కూడా అదే రోజు ఖాతాలో వేస్తారు. మీరు లోన్‌ను వివిధ మార్గాల్లో తిరిగి చెల్లించవచ్చు. ఈఎంఐల ద్వారా, నెలవారీ వడ్డీని చెల్లించి, అసలును తరువాత చెల్లించండి లేదా వన్‌టైమ్ బుల్లెట్ చెల్లింపును ఉపయోగించండి. పూర్తి రుణ మొత్తం, వడ్డీ చెల్లించిన తర్వాత మీ బంగారాన్ని అదే స్థితిలో తిరిగి ఇస్తారు. గోల్డ్ లోన్స్‌పై ఆసక్తి ఇందుకే గోల్డ్ లోన్స్ సాధారణంగా ప్రాసెస్ చేసి నగదు నిమిషాల్లో ఇస్తారు. బంగా రాన్ని సెక్యూరిటీగా ఉప యోగిస్తారు కాబట్టి మీరు జీతం స్లిప్‌లు లేదా ఆదాయ పత్రాలను చూపిం చాల్సిన అవసరం లేదు. మీరు 3 నుండి 36 నెలల వరకు రుణ నిబంధనలను ఎంచుకోవచ్చు. వ్యక్తిగత రుణాలతో పోలిస్తే బంగారు రుణాలకు తరచుగా తక్కువ వడ్డీ ఉంటుంది. మీరు తిరిగి చెల్లింపులను మిస్ అయితే తప్ప మీ క్రెడిట్ స్కోర్ సురక్షితంగా ఉంటుంది.

## ఈక్విటీ స్కీమ్స్‌లో ఆ రెండే టాప్..

**ముంబై, జూన్ 29:** ఏఎంఎఫ్ఐ మే 2025 డేటా ప్రకారం మల్టీక్యాప్ ఫండ్స్ నికర ఇన్‌ఫ్లో రూ.2,999.29 కోట్లుగా ఉండగా, ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ రూ.3,841.32 కోట్లుగా వచ్చాయి. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లు భారతీయ పెట్టుబడిదారులలో ఆదరణ పొందుతూనే ఉన్నందున, ఫ్లెక్సీక్యాప్, మల్టీక్యాప్ ఫండ్ల మధ్య వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవడం అనేది పెట్టుబడి నిర్ణయాలకు చాలా ముఖ్యం. మల్టీక్యాప్ ఫండ్లు సెబీ నిర్దేశించిన నిర్మాణాన్ని అనుసరిస్తాయి. అంటే లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ స్టాక్‌లకు కనీసం 25 శాతం కేటాయింపుతో పొదుపు చేస్తాయి. ఈ నియమం కంపెనీ పరిమాణాలలో క్రమశిక్షణ కలిగిన వైవిధ్యతను నిర్ధారిస్తుంది. మార్కెట్ సర్కిల్స్‌లో పనితీరును సమతుల్యం చేయడంలో సహాయ పడుతుంది. అయితే ఈ నిర్మాణం మార్కెట్ మార్పులకు ప్రతిస్పందించడంలో ఫండ్ మేనేజర్‌కు ప్రాముఖ్యతను కూడా పరిమితం చేస్తుంది. ఇది అస్థిర దశలలో రిస్క్‌రివార్డ్ తీవ్రతను పెంచుతుంది. 65 శాతం ఆస్తులు ఈక్విటీల్లో పెట్టుబడి పెట్టబడినంత వరకు ఫ్లెక్సీక్యాప్ ఫండ్లు పూర్తి సౌలభ్యాన్ని అందిస్తాయి. ఫండ్ మేనేజర్లు మార్కెట్ పరిస్థితుల ఆధారంగా కేటాయింపులను సర్దుబాటు చేయవచ్చు. తిరోగమనాల సమయంలో లార్జ్ క్యాప్‌లపై పూర్తిగా దృష్టి పెట్టడం లేదా ర్యాలీల సమయం లో మిడ్‌స్మాల్‌క్యాప్‌లపై దృష్టి పెట్టాలని నిపుణులు చెబుతున్నారు. మార్కెట్ క్యాప్స్ కంటే రంగాలు తరచుగా ముఖ్యమైనవిగా ఉంటాయి. ముఖ్యంగా స్వల్ప నుంచి మధ్యకాలిక



వ్యాపారులకు నగదు అనేది చాలా కీలకంగా ఉంటుంది. అయితే రాబడికి సమయంతో పాటు కేటాయింపుకు సంబంధించిన ప్రాముఖ్యత ఉంటుంది. నియమాల ఆధారిత విధానంతో స్థిరమైన, సమతుల్య వైవిధ్యాన్ని కోరుకునే పెట్టుబడిదారులకు మల్టీక్యాప్ ఫండ్లు అనువైనవని నిపుణులు చెబుతున్నారు. మార్కెట్ ట్రెండ్‌ల ఆధారంగా డైనమిక్ కేటాయింపును కోరుకునే వారికి ఫ్లెక్సీక్యాప్ ఫండ్లు మరింత అనుకూలంగా ఉంటాయని వివరిస్తున్నారు.

**వాణిజ్యం**

## వారెన్ బఫెట్ మరోసారి భారీ విరాళం

**ముంబై, జూన్ 29:** ప్రపంచ కుబేరుడు వారెన్ బఫెట్ మరోసారి భారీ విరాళం ఇచ్చారు. బెర్క్‌షైర్ హాత్వే స్టాక్‌లోని మరో 6 బిలియన్ డాలర్ల వాటాను గేట్స్ ఫౌండేషన్, నాలుగు కుటుంబ దాతృత్వ సంస్థలకు విరాళంగా ఇచ్చారు. మన ఇండియన్ కరెన్సీలో దాదాపు 51 వేల కోట్లు. వారెన్ బఫెట్ దాదాపు 20 ఏళ్లుగా ఇలా విరాళాలు ఇస్తూనే ఉన్నారు. ఆయన తన సంపదను దానం చేయడం ప్రారంభించినప్పటి నుండి ఇది అతిపెద్ద వార్షికవిరాళం. దాదాపు 12.36 మిలియన్ బెర్క్‌షైర్ క్లాస్ బి షేర్లను విరాళంగా ఇవ్వడంతో బఫెట్ మొత్తం ఛారిటీలకు ఇచ్చిన విరాళం 60 బిలియన్ల డాలర్లకు పైగా పెరిగింది. గేట్స్ ఫౌండేషన్‌కు 9.43 మిలియన్ షేర్లను, సుసాన్ థాంప్సన్ బఫెట్ ఫౌండేషన్‌కు 943,384 షేర్లను, అతని పిల్లలు హోవార్డ్, సూసీ, పీటర్ నేతృత్వంలోని మూడు ఛారిటీలకు 6,60,366 షేర్లను విరాళంగా ఇచ్చారు. అవి వరుసగా హోవార్డ్ జీ బఫెట్ ఫౌండేషన్, షేర్వుడ్ ఫౌండే షన్, నోవో ఫౌండేషన్‌లు. ఇన్ని షేర్లు విరాళంగా ఇచ్చినా కూడా బెర్క్‌షైర్ స్టాక్‌లో వారెన్ బఫెట్ ఇప్పటికీ 13.8 శాతం వాటాను కలిగి ఉన్నారు. శుక్రవారం విరాళాలకు ముందు అతని 152 బిలియన్ల డాలర్ల నికర విలువ అతన్ని ప్రపంచంలోని ఐదవ అత్యంత ధనవంతుడిని చేసిందని ఫోర్బ్స్ తెలిపింది. 2024 జూన్‌లో 5.3 బిలియన్ డాలర్లు, 2024 నవంబర్‌లో కుటుంబ దాతృత్వ సంస్థలకు 1.14 బిలియన్ డాలర్లను విరాళంగా ఇచ్చారు. ఒక ప్రక టనలో బెర్క్‌షైర్ షేర్లను విక్రయించే ఉద్దేశం తనకు లేదని బఫెట్ స్పష్టం




చేశారు. ఇప్పుడు 94 ఏళ్ల వయ సులో ఉన్న బఫెట్ 2006లో తన సంపదను దానం చేయడం ప్రారంభించారు. గతేడాది ఆయన తన వీలు నామాను సైతం మార్చుకున్నారు. తన మరణానంతరం తన మిగిలిన సంపదలో 99.5శాతం తన పిల్లలు పర్యవేక్షించే ఛారిటబుల్‌ట్రస్ట్‌కు చెందాలని రాశారు.

## జులైలో వర్కింగ్ డేస్ 18 రోజులే!

**ముంబై, జూన్ 29:** వచ్చే నెలలో బ్యాంకులు 18 రోజులు మాత్రమే పనిచేస్తాయి. జూలై 3 (గురువారం) త్రిపురలోని అగర్తలాలో ఖర్చి పూజ సందర్భంగా బ్యాంకులు మూసివేయడం జరుగుతుంది. మిగతా రాష్ట్రాల్లో బ్యాంకులు పనిచేస్తాయి. జూలై 5 (శనివారం) జమ్మూ కశ్మీర్‌లో గురు హారోబింద్ జీ జయంతి సందర్భంగా మూసివేత ఉంటుంది. మిగతా రాష్ట్రాల్లో బ్యాంకులు యధావిధిగా పనిచేస్తాయి.జూలై 6 ఆదివారం. దేశమంతటా బ్యాంకులు పనిచేయవు. జూలై 12 రెండో శనివారం సందర్భంగా దేశమంతటా బ్యాంకులు పనిచేయవు. జూలై 13 ఆదివారం సందర్భంగా దేశమంతటా బ్యాంకులు పనిచేయవు. జూలై14 మేఘాలయలోని షిల్లాంగ్ లో బెహ్ దేంఖ్లామ్ ఫెస్టివల్ సందర్భంగా బ్యాంకులు క్లోజ్ అవుతాయి. మిగతా రాష్ట్రాల్లో బ్యాంకులు పనిచేస్తాయి. జూలై 16 (బుధవారం) ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ లో హారేలా ఫెస్టివల్ సందర్భంగా బ్యాంకులు మూసివేయడం జరుగుతుంది. మిగతా రాష్ట్రాల్లో బ్యాంకులు పనిచేస్తాయి. జూలై 17 (గురువారం) మేఘాలయలోని షిల్లాంగ్‌లోయు తిరోత్ సింగ్ వర్ధంతి సందర్భంగా బ్యాంకులు మూసివేయడం జరుగుతుంది. మిగతా రాష్ట్రాల్లో బ్యాంకులు పనిచేస్తాయి. జూలై 19 (శనివారం) త్రిపురలోని అగర్తలాలో కేర్ పూజ సందర్భంగా బ్యాంకులు మూసివేయడం జరుగుతుంది. మిగతా రాష్ట్రాల్లో బ్యాంకులు పనిచేస్తాయి. జూలై 20 ఆదివారం సందర్భంగా దేశమంతటా బ్యాంకులు పనిచేయవు. జూలై 26 నాలుగో శనివారం సందర్భంగా దేశమంతటా బ్యాంకులు పనిచేయవు. జూలై 27 ఆదివారం సందర్భంగా దేశమంతటా బ్యాంకులు పనిచేయవు.జూలై 28 (సోమవారం) సిక్కింలోని గ్యాంగ్‌టక్‌లో ద్రుక్పా త్షెజీ సందర్భంగా మూసివేత ఉంటుంది.

## నెలవారీ పొదుపులో 'ఆర్‌డి'యే బెస్ట్

**ముంబై, జూన్ 29:** క్రమం తప్పకుండా డబ్బు ఆదా చేయడం అనేది అత్యంత ముఖ్యమైన ఆర్థిక అలవాట్లలో ఒకటిగా ఉంటుంది. అత్యవసర పరిస్థితుల కోసం అయినా, భవిష్యత్తు లక్ష్యాల కోసం అయినా, లేదా ఆర్థిక క్రమశిక్షణను పెంపొందించడం కోసం అయినాపొదుపు మార్గం వైపు పయనించాలని నిపుణులు చెబుతున్నారు. ప్రతి నెలా ఒక స్థిర మొత్తాన్ని ఆదా చేయడంలో రికరింగ్ డిపాజిట్లు కీలక పాత్ర పోషిస్తాయి. ఆర్‌డీ అనేది మీ పొదుపులను కాలక్రమేణా హామీ ఇచ్చిన రాబడితో పెంచుకోవడానికి ఒక సులభమైన, సురక్షితమైన మార్గం. రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ) అనేది బ్యాంకులు, ఆర్థిక సంస్థలు అందించే పొదుపు పథకం. ఇది వ్యక్తులు ప్రతి నెలా ఒక నిర్దిష్ట కాలానికి నిర్ణీత మొత్తంలో డబ్బును డిపాజిట్ చేయడానికి అనుమతిస్తుంది. ప్రతిగా బ్యాంక్ డిపాజిట్ చేసిన మొత్తంపై స్థిర వడ్డీ రేటును అందిస్తుంది. పెట్టుబడిదారుడు కాలపరిమితి ముగింపులో ఏకమొత్తం అందుకుంటాడు. మీ ఎంపిక మరియు స్థోమత ఆధారంగా మీరు ప్రతి నెలా రూ. 500 లేదా రూ. 1,000 వంటి నిర్ణీత మొత్తాన్ని జమ చేస్తారు. మీరు ఎంత కాలం ఆదా చేయాలను కుంటున్నారో ఎంచు కోవచ్చు. సాధారణంగా బ్యాంకును బట్టి 6 నెలల నుంచి 10 సంవత్సరాల వరకు ఉంటుంది. వడ్డీ రేటు ప్రారంభ సమయంలో స్థిరంగా ఉంటుంది.



మార్కెట్ పరిస్థితులతో మారదు. మీరు ఎంత సంపాదిస్తారో మీకు కచ్చితంగా అంచనా వేస్తుకోవచ్చు. ఈ స్కీమ్ ఇది స్టాక్ మార్కెట్‌తో ముడిపడి లేనందున ఆర్‌డీలు సురక్షితమైనవి, భద్రంగా ఉంటాయి. ఇవి సంప్రదాయవాద పొదుపు దారులకు అనువైనవిగా చేస్తాయి.వడ్డీ సాధారణంగా త్రైమాసికానికి ఒకసారి చక్రవడ్డీ చేస్తారు. కాబట్టి మీరు మీ డిపాజిట్లపై మాత్రమే కాకుండా ఇప్పటికే సంపాదించిన వడ్డీపై కూడా వడ్డీని పొందు తారు. మీకు అత్యవసర నిధులు అవసరమైతే కొన్ని బ్యాంకులు మీ ఆర్‌డీ బ్యాలెన్స్‌పై రుణం లేదా ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకోవడానికి అనుమతిస్తాయి.మీరు మెచ్యూరిటీకు ముందే మీ ఆర్‌డీ ఖాతాను మూసివేయవచ్చు. కానీ దీనికి జరిమానా లేదా తక్కువ వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది.మీరు నెలవారీ డిపాజిట్ మొత్తాన్ని, కాలపరిమితిని ఎంచుకోవాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రతి నెలా మీ పొదుపు ఖాతా నుంచి ఆటోమెటిక్‌గా తీసివేస్తారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.